www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 23
మంగళవారం | 22-4-2025
శ్రీవిశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం తిథి: నవమి సా.6.13 తదుపరి దశమి, నక్షత్రం: శ్రవణం మ.12.44 తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: సా.4.37-6.11, దుర్ముహూర్తం: ఉ.8.28-9.18, రా.10.14-10.58, అమృతఘడియలు: రా.1.59-3.32, రాహుకాలం: మ.3.00-4.30 వరకు, సూర్యోదయం: ఉ.5.58, సూర్యాస్తమయం: 6.29
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పోప్ ఫ్రాన్సిస్ అస్తమయం



ప్రజలకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపిన మరుసటి రోజే తుదిశ్వాస విడిచిన పోప్

శ్వాసకోశ సమస్యలతో ఇటీవల ఆస్పత్రిలో..

మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

వాటికన్ సిటీ, న్యూఢిల్లీ/హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): క్యాథలిక్ మతపెద్ద, రోమ్ బిషప్ పోప్ ఫ్రాన్సిస్(88) ఇక లేరు. ఆదివారం ఈస్టర్ సందేశం ఇచ్చిన ఆయన ఇటలీ కాలమానం ప్రకారం.. సోమవారం ఉదయం 7.35 గంటలకు వాటికన్ సిటీలోని తన కాసా శాంటా మార్టా నివాసంలో తుది శ్వాస విడిచారని వాటికన్ ప్రకటించింది. ఫ్రాన్సిస్ శ్వాసకోశ సమస్యలు, డబుల్ న్యూమోనియాతో ఫిబ్రవరి 14న ఆస్పత్రిలో చేరి 38 రోజుల పాటు చికిత్స తీసుకున్నారు. ఆపై కోలుకుని డిశ్చార్జి అయ్యారు. ఆదివారం సెయింట్ పీటర్ స్క్వేర్‌లో ప్రజలకు స్వయంగా ఈస్టర్ శుభాకాంక్షలు కూడా చెప్పారు. భక్తులకు ఈస్టర్ సందేశం ఇచ్చారు. మరుసటి రోజే ఆయన ప్రాణాలు కోల్పోయారు. గుండె పోటుతో ఆయన మరణించినట్లు ఇటలీ వార్త సంస్థలు పేర్కొంటున్నాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన రాలేదు. కాగా, ఈస్టర్ సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్.. పోప్ ఫ్రాన్సిస్‌ను కలిశారు. ప్రధాని మోదీ 2021, 2024లో ఫ్రాన్సిస్‌ను కలిసి భారతదేశానికి ఆహ్వానించారు. పోప్ ఫ్రాన్సిస్ వచ్చే ఏడాది భారతదేశానికి రావాల్సి ఉండగా, ఇంతలోనే ఆయన మరణించడం బాధాకరం. కాగా, ఫ్రాన్సిస్ మృతి పట్ల భారత ప్రభుత్వం మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. మంగళవారం, బుధవారం, అలాగే ఫ్రాన్సిస్ అంత్యక్రియలు నిర్వహించే రోజు సంతాప దినాలుగా పాటించాలని తెలిపింది. కాగా, 1937లో పోప్ ఫ్రాన్సిస్ అర్జెంటీనాలో

మిగతా 2వ పేజీలో...



బంగారం.. లకారం

రూ.లక్షకు చేరువైన పసిడి ధర 10

పెళ్లిళ్ల సీజన్ కావడంతో పెరిగిన డిమాండ్

రానున్న రోజుల్లో 1.23 లక్షలకు చేరే చాన్స్

పిల్లలను వాగులో తోసి.. తానూ దూకేసిన తల్లి

మనసు మార్చుకుని పిల్లలను రక్షించే యత్నం 14

అప్పటికే మరణించిన ఇద్దరు చిన్నారులు.. తల్లి క్షేమం

మెదక్ జిల్లా ఇస్లాంపూర్‌లో ఘటన

భర్తను చంపి.. శవాన్ని పూడ్చి

హైదరాబాద్‌లో ఓ భార్య క్రైమ్ కథాచిత్రమ్ 14

18న ఇద్దరి మధ్య ఘర్షణ.. కరెంట్ షాక్ ఇచ్చి..

చెల్లితో కలిసి మెడకు తువ్వాలు బిగించి హత్య

రాత్రివేళ ఆటోలో తీసుకెళ్లి పూడ్చిపెట్టే యత్నం

ఆటోడ్రైవర్ సమాచారంతో పోలీసుల దర్యాప్తు

వాణిజ్య చర్చలు భేష్

ఉభయులకు లాభదాయకంగా ఒప్పందం కుదుర్చుకుంటాం

- ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్
- 4 రోజుల భారత పర్యటనకు కుటుంబంతో వచ్చిన వాన్స్
- ఉపాధ్యక్షుడిగా తెలుగింటి అల్లుడి తొలి అధికారిక పర్యటన
- భారతీయ వస్త్రధారణలో వాన్స్-ఉష పిల్లలు
- తొలిరోజు ఢిల్లీలో మోదీతో భేటీ, విందు ఇచ్చిన ప్రధాని
- పిల్లలకు ఇల్లంతా చూపించి నెమలీకలు ఇచ్చిన ప్రధాని
- నేడు, రేపు జైపూర్, ఆగ్రాల సందర్శన, అట్నుంచే అమెరికాకు



ప్రధాని మోదీతో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఆయన సతీమణీ ఉషా చిలుకూరి, కుమారులు ఎవాన్, వివేక్, కుమార్తె మిరాబెల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: ఇరు దేశాలకు లాభదాయకంగా ఉండే వాణిజ్య ఒప్పందం దిశగా భారత్, అమెరికా అధికారుల మధ్య జరుగుతున్న చర్చలు చెప్పుకోదగ్గ ప్రగతి సాధించడాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా ఉపాధ్యక్షుడు స్వాగతించారు. సోమవారం వారిద్దరూ ప్రధాని నివాసంలో ఇరు దేశాల అధికారులతో కలిసి రక్షణ, ఇంధనం, వ్యూహాత్మక సాంకేతిక పరిజ్ఞానంలో మరింత సహకారం గురించి విస్తృతంగా చర్చలు జరిపారు. చర్చల అనంతరం మోదీ వాన్స్ కుటుంబానికి విందు ఇచ్చారు. తెలుగింటి అల్లుడైన జేడీ వాన్స్ తన భార్య ఉషా చిలుకూరి, ముగ్గురు పిల్లలతో విందుకు హాజరయ్యారు. చర్చల సందర్భంగా మోదీ అమెరికా అధ్యక్ష, ఉపాధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు. ట్రంప్ ఈ ఏడాదే ట్రంప్ భారతదేశ పర్యటనకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ, వాన్స్ అనేక జాతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. రష్యా-ఉక్రెయిన్ సమస్యను ఇరు దేశాలు చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న అభిప్రాయాన్ని మోదీ, వాన్స్‌లు వ్యక్తం చేశారు. ట్రంప్ తలపెట్టిన మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ లాంటిదే తాను తలపెట్టిన వికసిత భారత్ అని మోదీ గుర్తు చేశారు. తన కుటుంబం పట్ల మోదీ కనబరచిన ఆదరాభిమానాలకు వాన్స్ సంతోషం వ్యక్తం చేశారు. భారత ప్రజలతో స్నేహం, సహకారం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇరు దేశాలకూ లాభదాయకంగా ఉండే సహకారానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ ప్రకటించారు. వాన్స్ తన కుటుంబం, అధికారులతో కలిసి ఎయిర్‌ఫోర్స్ 2 విమానంలో ఉదయం 9.50 గంటలకు ఢిల్లీలో దిగారు. కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వారికి స్వాగతం పలికారు. ఆయనతోపాటే వచ్చిన కుమారులు ఎవాన్(8), వివేక్(5), కుమార్తె మిరాబెల్(4) ప్రత్యేక ఆకర్షణగా

మిగతా 2వ పేజీలో...

ట్రంప్ దెబ్బ మరింత తీవ్రం!



భారతీయ విద్యార్థులకు పెరిగిన కష్టాలు 2


అమెరికాలో చిన్న నేరాలకే దేశ బహిష్కరణ ముప్పు

వీసా రద్దు బాధితుల్లో 50% మనవాళ్లే

అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ వెల్లడి

ఇప్పటికే మాపై విమర్శలు

కార్యనిర్వాహక వ్యవస్థ అధికారాల్లోకి చొరబడుతున్నామని ఆరోపణలు



పశ్చిమ బెంగాల్‌లో అల్లర్లపై నివేదిక కోరాలన్న పిటిషన్ మీద కాబోయే సీజేఐ గవాయ్ వ్యాఖ్యలు

ఓటీటీ, సోషల్ మీడియాలో అశ్లీలతను నిలువరించాలన్న పిటిషన్‌పైనా ఇదే తరహాలో..

కేంద్రమే నిబంధనలు రూపొందించాలని వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: ముర్షిదాబాద్ అల్లర్ల నేపథ్యంలో బెంగాల్లో పరిస్థితిపై రాష్ట్రపతి ఆర్టికల్ 355 కింద నివేదిక కోరాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం పరిశీలించనుంది. కాబోయే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ ఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు సోమవారం న్యాయవాది విష్ణు శంకర్ జైన్ ఈ అంశాన్ని తీసుకొచ్చారు. 2022లో బెంగాల్లో ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్లకు సంబంధించి తన పిటిషన్ మంగళవారం విచారణకు వస్తోందని గుర్తు చేశారు. తాజాగా వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో హిందువులపై దాడులు జరిగాయని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కేంద్ర పారా మిలిటరీ బలగాలను రంగంలోకి దించాలని, ముగ్గురు పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులతో ఈ హింసపై దర్యాప్తు జరిపించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముర్షిదాబాద్ అలర్లపై ఆర్టికల్ 355 కింద నివేదిక తెప్పించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్

మిగతా 2వ పేజీలో...

లగచర్ల భూసేకరణ సరైనదే!

పోలీసుల వైఖరి చట్టవిరుద్ధం 3

స్టేషన్లో కెమెరాలు పని చేయలేదు

గ్రామస్థుల్ని రాత్రంతా చితకబాదారు

నిబంధనలు పాటించకపోవడం వల్లే

కలెక్టర్‌పై గ్రామస్థుల దాడి పరిస్థితి

జాతీయ హక్కుల కమిషన్ వ్యాఖ్యలు

తెలంగాణ హైకోర్టు నుంచి ఇద్దరు న్యాయమూర్తుల బదిలీ

జస్టిస్ శ్రీసుధ కర్ణాటక హైకోర్టుకు

జస్టిస్ కాసోజు సురేందర్ మద్రాస్‌కు

ఏపీ నుంచి జస్టిస్ మన్మథరావు 10

కర్ణాటకకు.. కొలీజియం నిర్ణయం



నిజామాబాద్‌లో రైతుమహోత్సవంలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్, జూపల్లి, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ 3

ఇందూరులో వ్యవసాయ విశ్వవిద్యాలయం!

జపాన్ నుంచి సీఎం రాగానే నిర్ణయం

అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు

మిగిలిన రైతులకూ భరోసా: తుమ్మల 3

ప్రాణహిత-చేవెళ్ల ప్యాకేజీల పెండింగ్ పనులు షురూచేస్తాం: మంత్రి ఉత్తమ్

పందులతో కుస్తీపడితే.. మనం మురికి అవుతాం 2

బురద అంటించడం ఆ పందికెంతో ఇష్టం

దూబే వ్యాఖ్యలపై ఖురేషీ పరోక్ష విసుర్లు

విద్వేష రాజకీయాల కోసం మతపరమైన గుర్తింపును పావుగా వాడుతున్నారని ఫైర్

ఏసీబీ వలలో ఐదుగురు అధికారులు

మణుగూరులో భూవివాదం.. రూ.4 లక్షల డిమాండ్ చేసిన సీఐ అరెస్ట్

సీఐ తరఫున లంచం తీసుకుంటూ పట్టుబడ్డ బిగ్‌టీవీ విలేకరి గోపి 3

జనగామ, మేడ్చల్, నిజామాబాద్ జిల్లాల్లో మరో నలుగురు అధికారుల పట్టివేత



జపాన్‌లో ఒసాకా వరల్డ్ ఎక్స్‌పోను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

తెలంగాణకు రండి.. ప్రపంచానికి విస్తరించండి

మీ పెట్టుబడులకు మా రాష్ట్రాన్ని గమ్యస్థానంగా ఎంచుకోండి

మాది సులభతర పారిశ్రామిక విధానం

సర్క్యులర్ ఎకానమీ కేంద్రంగా 'ఫ్యూచర్ సిటీ'

మారుబెనీ సంస్థతో కలిసి పారిశ్రామిక పార్కు

అంతర్జాతీయ ఎగుమతుల కోసం 'డ్రై పోర్ట్'ను ఏర్పాటు చేస్తున్నాం

జపాన్ పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్‌రెడ్డి

ఒసాకా వరల్డ్ ఎక్స్‌పో-2025లో సమావేశం

తొలిసారిగా తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): "హైదరాబాద్‌కు రండి.. మీ ఉత్పత్తులు తయారుచేయండి.. భారత మార్కెట్‌తోపాటు ప్రపంచ దేశాలకు ఎగుమతులు చేసుకోండి.. తెలంగాణను మీ పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎంచుకోండి.." అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జపాన్ కంపెనీలను సాదరంగా

మిగతా 13వ పేజీలో...

రోహిత్ వేముల చట్టం చేయండి

విద్యాసంస్థల్లో కులవివక్ష రూపుమాపండి

రేవంత్‌రెడ్డికి రాహుల్ గాంధీ లేఖ 12

మిస్ వరల్డ్ పోటీలకు ప్రభుత్వ ఖర్చు రూ.2 కోట్లే!

రూ.25 కోట్ల స్పాన్సర్‌షిప్‌కు ఫార్మా, మీడియా, పర్యాటక సంస్థల నుంచి ఆఫర్లు

ములుగు, రామప్ప, సాగర్‌లో నిర్వహించే ప్రత్యేక ఈవెంట్లకు స్థానికులకూ ఆహ్వానాలు

గ్రాండ్ ఫినాలేకి 3,500 మందికి అవకాశం

రష్యా, ఇజ్రాయెల్ సుందరిలకు ప్రత్యేక భద్రత

బుద్ధ జయంతిన బుద్ధవనానికి బ్యూటీలు

నెల రోజుల పండుగ.. 80% ఏర్పాట్లు పూర్తి

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): 'మిస్ వరల్డ్' పోటీలకు రూ.25 కోట్ల మేర నిధులు సమకూర్చేందుకు స్పాన్సర్లు ముందుకొచ్చారు. దీంతో, ఈ పోటీలకు ప్రభుత్వ ఖజానా నుంచి ఖర్చయ్యేది కేవలం రూ.2 కోట్లే కానుంది. ఈ పోటీల నిర్వహణకు సంబంధించిన వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వ శాఖల వాటా రూ.27 కోట్లుగా అంచనా వేసిన సంగతి తెలిసిందే. ఆ మొత్తాన్ని కూడా స్పాన్సరర్ల నుంచి సమకూర్చుకోనున్నట్టు ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. ఈమేరకు.. పలు ఫార్మా, మీడియా, రియల్ ఎస్టేట్, పర్యాటక, బ్యాంకింగ్ సంస్థలతో ప్రభుత్వం చర్చలు జరిపింది. పోటీలకు నిధులు సమకూర్చేందుకు ఆయా సంస్థలు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. ఈ పోటీలను తెలంగాణలో నిర్వహించినందుకు

మిగతా 12వ పేజీలో...



వంట నూనె తాగేస్తున్నాం!

దేశంలో ఏటా తలసరి వినియోగం 24 కిలోలు

2001తో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువ

ఐసీఎంఆర్ సిఫారసు పరిమితి 12 కిలోలే

అధిక వాడకంతో ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు.. అనారోగ్య సమస్యలు

నూనె దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: దేశంలో గతంలో పోలిస్తే వంట నూనెల వినియోగం భారీగా పెరిగింది. ప్రస్తుతం సగటున ప్రతి భారతీయుడు ఏడాదికి 24 కేజీల వంట నూనె తాగేస్తున్నాడట! దేశంలో తలసరి వంట నూనె వినియోగం గత రెండు దశాబ్దాల్లో దాదాపు మూడు రెట్లు పెరిగిందని 'మింట్' నివేదిక వెల్లడించింది. ఇది నూనెల కోసం దిగుమతులపై ఆధారపడడాన్ని పెంచుతుందని, అదేవిధంగా ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు, ఫ్యాటీ లివర్ వంటి అనారోగ్య

మిగతా 2వ పేజీలో...

మత్తు కోసం ఒకేసారి ఇంజక్షన్, ట్యాబ్లెట్లు

వికటించి ఓ ఇంటర్ విద్యార్థి మృతి

ఆస్పత్రిలో అతని ఇద్దరు స్నేహితులు

హైదరాబాద్ బాలాపూర్‌లో ఘటన 14

పోలీసుల అదుపులో వారికి మత్తు మందు విక్రయించిన నిందితుడు

వడదెబ్బతో 9 మంది మృతి



భానుడి భగభగలతో మండుతున్న రాష్ట్రం 14

కామారెడ్డి జిల్లా బిచ్కుందలో గరిష్ఠంగా 44, మరో 3 జిల్లాల్లో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

రేపటి నుంచి మరింత పెరగనున్న ఉష్ణోగ్రతలు

నేడే ఇంటర్ ఫలితాలు

విద్యార్థుల మొబైల్ ఫోన్లకూ ఫలితాల లింక్ 13

ఏఐతో ఉద్యోగాల ఊచకోత





ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఉద్యోగాలు పోతాయి

గత వందేళ్లలో ఎన్నడూ చూడనంత సంక్షోభం

తమ పనితీరును మెరుగుపరచుకోవడానికి ఏఐని ఉపయోగించేవారి ఉద్యోగాలు మాత్రమే ఉంటాయి 10

కృత్రిమ మేధపై బిల్‌గేట్స్, బరాక్ ఒబామా ఆందోళన

మంచి వైద్యసలహాలు, బోధన సేవలు మాత్రం ఏఐతో ప్రజలందరికీ అందుబాటులోకి వస్తాయన్న బిల్ గేట్స్

పోప్ ఫ్రాన్సిస్ అస్తమయం



(మొదటి పేజీ తరువాయి)

జన్మించారు. పోప్ బెనడిక్ట్ తర్వాత 2013లో ఫ్రాన్సిస్ 266వ పోప్‌గా బాధ్యతలు చేపట్టారు. ఫ్రాన్సిస్ ప్రజల పోప్‌గా పేరు తెచ్చుకున్నారు. పోప్ ఫ్రాన్సిస్ సామాజిక అంశాలపై ఆయన మాట్లాడుతుండే వారు. కాగా, దక్షిణ అమెరికా నుంచి పోప్‌గా ఎన్నికైన తొలి వ్యక్తి ఫ్రాన్సిస్ కావడం విశేషం. పోప్ అంత్యక్రియల ప్రక్రియలో ఫ్రాన్సిస్ కొంతకాలం క్రితం కొన్ని మార్పులు చేశారు. వాటికన్ సిటీ వెలుపల కూడా పోప్‌ను సమాధి చేసేలా ఆయన మార్పులు చేశారు. ఫ్రాన్సిస్ తనను బాసిలికా ఆఫ్ శాంటా మరియా మ్యాగోరియాలో సమాధి చేయాలని కోరుకున్నారు. పోప్ మరణాన్ని ధ్రువీకరించిన తర్వాత ఆయన ఉంగరాన్ని ధ్వంసం చేస్తారు. పోప్ పార్థివ దేహాన్ని బాసిలికా ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. ఆపై ఆచారాల ప్రకారం పోప్ పార్థివదేహాన్ని ఖననం చేస్తారు. పోప్ చనిపోయిన తర్వాత 4 నుంచి 6 రోజుల్లో అంత్యక్రియలు పూర్తిచేస్తారు. అంత్యక్రియల తర్వాత 9 రోజులు సంతాప దినాలు పాటిస్తారు. అవి పూర్తయ్యాక తదుపరి పోప్ ఎన్నిక ప్రక్రియ మొదలు పెడతారు. పోప్ ఫ్రాన్సిస్ మరణం పట్ల భారత్ క్యాథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్‌తో పాటు ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్, విదేశాంగ మంత్రి జైశంకర్, ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, కేసీఆర్ తదితరులు సంతాపం ప్రకటించారు. ఫ్రాన్సిస్ మరణంతో తదుపరి పోప్ ఎవరనే చర్చ మొదలైంది. తదుపరి పోప్ రేసులో ఇటలీకి చెందిన 70ఏళ్ల కార్డినల్ పిట్రో పెరోలిన్, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోకు చెందిన 65ఏళ్ల కార్డినల్ ఫ్రీడోలిన్ అంబోంగో బెసుంగు, ఇటలీకి చెందిన 69ఏళ్ల కార్డినల్ మెట్టో పేర్లు వినిపిస్తున్నాయి.

పోప్ ఎంపిక విధానం?

పోప్ ఎన్నికకు రహస్య ఓటింగ్ నిర్వహిస్తారు. 80 ఏళ్ల లోపు వయసున్న కార్డినల్స్ ఈ ఓటింగ్‌లో పాల్గొంటారు. మొత్తం 252 మంది కార్డినల్స్‌లో 138 మందికి ఓటింగ్‌లో పాల్గొనే అర్హత ఉంది. రోజుకు నాలుగు రౌండ్ల ఓటింగ్ చొప్పున ఎవరైన అభ్యర్థికి మూడింట రెండొంతుల మెజారిటీ వచ్చేవరకు ఓటింగ్ జరుగుతుంది. ప్రతి సెషన్‌లో బ్యాలెట్ పేపర్లకు నల్లటి పొగ వెలువడే రసాయనాలు కలిపి కాల్చుతారు. ఆ సమయంలో ఏ అభ్యర్థి పేరు బ్యాలెట్ పేపర్ కాల్చుతుండగా తెల్లటి పొగ వస్తుందో ఆ అభ్యర్థి పోప్‌గా ఎన్నికైనట్లు. పోప్ ఎన్నికలో ఆరుగురు భారత కార్డినల్స్‌కు ఓటు వేసే అర్హత ఉంది. వారు కార్డినల్ ఫిలిప్ నెరీ ఫెర్రో(72), కార్డినల్ క్లిమిస్ బెసిలియోస్(64), కార్డినల్ అంథోని పూల(63), కార్డినల్ జార్జ్ జాకోబ్ కూవకడ్(51), కార్డినల్ ఓస్వల్డ్ గ్రెసియస్(80), కార్డినల్ జార్జ్ అలెంచెరి(79).

ఇప్పటికే మాపై విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

స్పందిస్తూ, "ఇప్పుడు మమ్మల్ని మీ బాధ్యత మీరు నిర్వర్తించాలంటూ రాష్ట్రపతికి రిట్ ఆఫ్ మాండమస్ జారీ చేయమంటారా? ఇప్పటికే మేం కార్యనిర్వహణ అధికారాల్లోకి చొరబడుతున్నామని విమర్శలు వస్తున్నాయి" అని ప్రస్తావించారు. తమిళనాడు గవర్నర్ నిలిపేసిన బిల్లులన్నీ ఆమోదం పొందినట్లేనని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్, బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే చేసిన వ్యాఖ్యలను దృష్టిలో ఉంచుకొని జస్టిస్ గవాయ్ ఈ విధంగా స్పందించారని భావిస్తున్నారు. అయితే, తాజా పిటిషన్‌ను మంగళవారం లిస్ట్ చేయడానికి జస్టిస్ గవాయ్ అంగీకరించారు. ఓటీటీల్లో, సోషల్ మీడియాలో అశ్లీల దృశ్యాలను నిలువరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విషయంలోనూ జస్టిస్ గవాయ్ ఇదే విధంగా స్పందించారు. "ఎవరు నియంత్రించ గలరు? కేంద్రమే నియమ నిబంధనలు రూపొందించాలి. మేం పూనుకుంటే కార్యనిర్వాహక అధికారాల్లో చట్ట సభల అధికారాల్లో జోక్యం చేసుకున్నారంటారు" అని మరోసారి అన్నారు.

బలవంతంగా తీసుకొచ్చి చంపేశారు

- కర్ణాటక మాజీ డీజీపీ హత్యలో ఆయన భార్య దారుణం
- ఫిర్యాదులో కుమారుడి వెల్లడి.. భార్య, కుమార్తెపై కేసు



ఓంప్రకాశ్

బెంగళూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మాజీ డీజీపీ ఓంప్రకాశ్ హత్యలో ఆయన భార్య పల్లవి, కుమార్తె కృతి దారుణాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రాణ భయంతో తన సోదరి ఇంటికి వెళ్లిపోయిన ఓంప్రకాశ్‌ను రెండు రోజుల క్రితమే పల్లవి, కృతి బలవంతంగా తిరిగి ఇంటికి తీసుకొచ్చినట్టు ఆయన కుమారుడు కార్తికేశ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఓంప్రకాశ్ కుమారుడు కార్తికేశ్ ఫిర్యాదు మేరకు పల్లవి, కృతిపై బీఎన్ఎస్ సెక్షన్ 103 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. తన తల్లి పల్లవి వారం రోజులుగా తన తండ్రి ఓంప్రకాశ్‌ను చంపేస్తానని బెదిరించారని కార్తికేశ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. తరచూ గొడవలెందుకని ఓంప్రకాశ్ చెల్లెలు సరిత ఇంటికి వెళ్లారని తెలిపారు. కాగా, ఆస్తి గొడవల నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఓంప్రకాశ్‌ను పల్లవి ముఖంపై కారం చల్లి కత్తితో పొడిచి చంపేసినట్టు పోలీసులు వెల్లడించారు. ఈ హత్యలో కుమార్తె కృతి భాగస్వామ్యం ఉందన్నారు. ఓంప్రకాశ్ అంత్యక్రియలు సోమవారం పోలీసు లాంఛనాలతో పూర్తయ్యాయి.

స్పేడెక్స్‌లో రెండో డాకింగ్ కూడా సక్సెస్

సూళ్లూరుపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) మిషన్‌లో భాగంగా ఇస్రో మరో ఘనత సాధించింది. ఈ మిషన్‌లో ప్రయోగించిన ఎస్‌డీఎక్స్-01 (ఛేజర్), ఎస్‌డీఎక్స్-02 (టార్గెట్) అనే జంట ఉపగ్రహాలకు రెండోసారి డాకింగ్ ప్రక్రియను కూడా విజయవంతంగా పూర్తిచేసినట్టు ఇస్రో సోమవారం ప్రకటించింది. పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ద్వారా గతేడాది డిసెంబరు 30న స్పేడెక్స్ ప్రయోగాన్ని చేపట్టిన ఇస్రో.. ఈ ఏడాది జనవరి 16న ఛేజర్, టార్గెట్ ఉపగ్రహాలను కక్ష్యలో విజయవంతంగా డాకింగ్ చేసింది. మార్చి 13న వాటిని అన్‌డాకింగ్ కూడా చేసింది. .

ఇక ప్రతి నెలా నిరుద్యోగ గణాంకాల విడుదల

ముంబై, ఏప్రిల్ 21: కేంద్ర ప్రభుత్వం ఇక నుంచి ప్రతి నెలా నిరుద్యోగ గణాంకాలను వెల్లడించనుంది. వచ్చే మే 15 నుంచి నెలవారీ ప్రాతిపదికన ఈ గణాంకాలను విడుదల చేయనున్నట్టు సీనియర్ అధికారి ఒకరు సోమవారం తెలిపారు. ఇంతకు ముందు మూడు నెలలకు ఒకసారి నిరుద్యోగ గణాంకాలను విడుదల చేసేవారు. మే 15న విడుదల చేసే గణాంకాల్లో జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన వివరాలు ఉంటాయి. ఆ తర్వాత ప్రతి నెలా గణాంకాలను విడుదల చేయనున్నారు. ఇప్పటి వరకు మూడు నెలలకు ఒకసారి పట్టణ నిరుద్యోగ గణాంకాలను కేంద్ర ప్రభుత్వం వెల్లడిస్తోంది. గ్రామీణ, పట్టణ నిరుద్యోగానికి సంబంధించిన డేటాను వార్షికంగా వెలువరిస్తోంది.

ఉక్రెయిన్‌తో చర్చలకు సిద్ధం: పుతిన్

మాస్కో, ఏప్రిల్ 21: ఉక్రెయిన్‌తో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు సహకరించాలంటూ అమెరికా.. రష్యాపై ఒత్తిడి చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌తో చర్చలు జరిపేందుకు తాను సిద్ధమని సోమవారం పుతిన్ చెప్పారు. అనేక సంవత్సరాల తర్వాత ఆయన ఇలాంటి ప్రకటన చేయడం ఇదే తొలిసారి. ఇక ఈస్టర్ సందర్భంగా రష్యా ఒక రోజు కాల్పుల విరమణను పాటించిన సంగతి తెలిసిందే. ఇలాంటి కాల్పుల విరమణలు మరిన్ని పాటిచేందుకు కూడా సిద్ధమని పుతిన్ పేర్కొన్నారు. శాంతి స్థాపనకు రష్యా ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, ఉక్రెయిన్ నుంచి కూడా అదే ఆశిస్తున్నామని తెలిపారు. పుతిన్ వ్యాఖ్యలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇంకా స్పందించలేదు.

ట్రంప్ దెబ్బ మరింత తీవ్రం!

భారతీయ విద్యార్థులకు పెరిగిన కష్టాలు.. వీసా రద్దు బాధితుల్లో 50% మనవాళ్లే

- చిన్న నేరాలకే దేశ బహిష్కరణ ముప్పు
- 14 శాతంతో తర్వాతి స్థానంలో చైనా
- అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ గణాంకాలు వెల్లడి



ప్రధాని మోదీ నివాసంలో నెమలి ఈకలతో ఆడుకుంటున్న జేడీ వాన్స్ పిల్లలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: అమెరికాలో భారతీయ విద్యార్థుల కష్టాలు తీవ్రస్థాయికి చేరాయి. వీసా రద్దు బాధితుల్లో భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా ఉంటోంది. ఈ ఏడాది జనవరి 20వ తేదీ నుంచి ఇప్పటి వరకు 4,736 సెవిస్(ది స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టం) రికార్డులను అమెరికా ఐసీఈ(ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్) విభాగం రద్దు చేయగా, 300కుపైగా విద్యార్థి వీసాలను అమెరికా విదేశాంగశాఖ రద్దు చేసింది. ఈ బాధితుల్లో భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా ఉన్నట్టు ఐలా(ది అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్) విడుదల చేసిన గణాంకాలు తెలియజేస్తున్నాయి. అలాగే, రద్దయిన సెవిస్ రికార్డుల్లో అత్యధికం ఎఫ్-1(విదేశీ విద్యార్థి)లకు సంబంధించినవే. సెవిప్(స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్) సర్టిఫైడ్ స్కూళ్లు, ఎఫ్-1, ఎం-1 విద్యార్థుల సమాచార నిర్వహణ కోసం అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఉపయోగించే వెబ్ ఆధారిత వ్యవస్థే సెవిస్. అలాగే, ఎఫ్-1 హోదా విద్యార్థి అంటే అమెరికాలోని ఏదైనా సెవిప్ సర్టిఫైడ్ స్కూల్లో విద్యను అభ్యసించేందుకు అధికారికంగా ఆమోదం లభించిన విదేశీ విద్యార్థి. వీసా రద్దు, సెవిస్ రికార్డుల రద్దుకు సంబంధించి అమెరికా వ్యాప్తంగా 327 నివేదికలను అటార్నీలు, విద్యార్థులు, యూనివర్సిటీ సిబ్బంది నుంచి తాము సేకరించగా, అందులో 50% బాధితులు భారతీయ విద్యార్థులేనని ఐలా తెలిపింది. ఆ తర్వాతి స్థానంలో చైనా విద్యార్థులు(14%) ఉన్నారని, బాధితుల్లో దక్షిణ కొరియా, నేపాల్, బంగ్లాదేశ్ విద్యార్థులు కూడా ఉన్నారని పేర్కొంది. ఐలా సేకరించిన సమాచారం మేరకు బాధిత విద్యార్థుల్లో 50 శాతం మంది ఓపీటీ(ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్) వారే. వీరంతా విద్యాభ్యాసం పూర్తి చేసి అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నారని అర్థం. బాధితుల్లో 57 శాతం మంది విద్యార్థులకు వీసా రద్దు నోటీసులను అమెరికా కాన్సులేట్లు ఈమెయిల్ ద్వారా పంపగా, వారిలో ఇద్దరికి మాత్రమే రాజకీయ ఆందోళనల్లో పాల్గొన్న చరిత్ర ఉంది. అలాగే, సెవిస్ రికార్డుల రద్దు నోటీసులను 83 శాతం బాధితులు తమ యూనివర్సిటీల నుంచి పొందగా, 14 శాతం మంది నేరుగా ఐసీఈ నుంచి పొందారు. బాధితుల్లో 7 శాతం మందికి అసలు నోటీసులు ఇవ్వకుండానే రికార్డులను రద్దు చేసేశారు. ఏవిధమైన పోలీసు చర్యలు, నేర చరిత్ర లేకుండానే సెవిస్ రికార్డులు రద్దయిన కేసులు కనీసం 17 ఉన్నాయని ఐలా తెలిపింది. బాధిత విద్యార్థుల్లో 86 శాతం మందికి నేరచరిత్ర ఉన్నప్పటికీ వారిలో 33 శాతం మందిపై కేసులను కోర్టులు కొట్టివేశాయని పేర్కొంది.





ఢిల్లీలోని అక్షర్‌ధామ్ ఆలయం వద్ద వాన్స్ దంపతులు, సంప్రదాయ వస్త్రధారణలో వారి పిల్లలు

వాణిజ్య చర్చలు భేష్

(మొదటి పేజీ తరువాయి)

నిలిచారు. అబ్బాయిలు కుర్తా పైజామా వేసుకోగా, కుమార్తె నీలాకుపచ్చ అనార్కలీ డ్రెస్‌లో మెరిసింది. రాగానే వాన్స్ కుటుంబం యమున ఒడ్డున ఉన్న అక్షరధామ్ ఆలయాన్ని సందర్శించింది. ఆలయం తన పిల్లలకు బాగా నచ్చిందని వాన్స్ చెప్పారు. వాన్స్ కుటుంబం జన్‌పథ్ లోని సెంట్రల్ కాటేజ్ ఇండస్ట్రియల్ ఎంపోరియంను సందర్శించారు. కాగితం గుజ్జు బొమ్మలు, తేనె, టీ పొడులు కొన్నారు. అనంతరం వాన్స్, భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరు దేశాల అధికారులు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో ఉండాల్సిన అంశాలపై చర్చించారు. వాన్స్ కుటుంబం సాయంత్రం రాగానే మోదీ తన ఇంటిని, తోటను పిల్లలకు తిప్పి చూపించారు. వాన్స్ పిల్లలు ఆసక్తిగా అనేక ప్రశ్నలు వేస్తూ మోదీతో మాట్లాడారు. ఆయన ఓపికగా వారికి సమాధానం ఇచ్చారు. మోదీ ఇచ్చిన నెమలి ఈకలను పిల్లలు సంతోషంగా తీసుకున్నారు. ఢిల్లీలోని ఐటీసీ మౌర్య షెరిటన్ హోటల్‌లో బస చేస్తున్న వాన్స్ కుటుంబం రాత్రి ప్రత్యేక విమానంలో జైపూర్ పర్యటనకు వెళ్లింది. అంబర్ ఫోర్ట్‌ను సందర్శిస్తారు. పర్యటనలో భాగంగా వాన్స్ 23న ఆగ్రాను సందర్శించనున్నారు. తిరిగి జైపూర్ వచ్చి అక్కడి నుంచి నేరుగా అమెరికా వెళతారు. అమెరికా ఉపాధ్యక్షుడి రాకతో ఢిల్లీలో భద్రతను భారీ ఎత్తున పెంచారు. అమెరికా ఉపాధ్యక్షుడిగా వాన్స్‌కు ఇదే తొలి భారత పర్యటన. ఆయనకు ముందు జో బైడెన్ ఉపాధ్యక్ష హోదాలో 2013లో భారత్‌లో పర్యటించారు. కాగా, క్యాథలిక్ క్రైస్తవుడైన జేడీ వాన్స్ ఆదివారం వాటికన్ సిటీలో అనారోగ్యంగా ఉన్న పోప్ ఫ్రాన్సిస్‌ను కలిశారు. ఆయన ఢిల్లీకి వచ్చేలోపు పోప్ మరణవార్త వెలువడింది. దాంతో వాన్స్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

లోకం తీరు



సుంకాలు విధించకుండానే మోసం!

- అమెరికాతో వాణిజ్యం చేసే దేశాలపై ట్రంప్ మరోసారి ఫైర్
- పలు పరోక్ష, అనైతిక పద్ధతుల్లో అమెరికాకు నష్టం చేస్తున్నాయని విమర్శ

వాషింగ్టన్, ఏప్రిల్ 21: సుంకాల యుద్ధానికి 90 రోజుల విరామం ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. తమతో వాణిజ్యం చేసే దేశాల మీద మరోసారి విరుచుకుపడ్డారు. పలు పరోక్ష, అనైతిక విధానాల ద్వారా అవి తమను ఆర్థికంగా నష్టపరుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో 'నాన్ టారిఫ్ చీటింగ్' (సుంకాలు విధించకుండానే మోసం) పేరుతో 8 అంశాలను ప్రస్తావించారు. వాటిలో 1. కరెన్సీ మోసాలు 2. సుంకాల రూపంలో వసూలు చేసే వ్యాట్ ట్యాక్స్‌లు, సబ్సిడీల ఎగుమతులు 3. చవక సరుకులను తెచ్చి మార్కెట్లను ముంచెత్తటం 4. ప్రభుత్వ సబ్సిడీలు 5. విదేశీ ఉత్పత్తుల నుంచి ఆయా దేశాలు తమ వ్యవసాయోత్పత్తులకు రక్షణ కల్పించటం (యూరోపియన్ యూనియన్ దేశాల్లో జన్యుపరివర్తిత మొక్కజొన్నను అనుమతించపోవటం) 6. సాంకేతిక ప్రమాణాల పేరుతో విదేశీ ఉత్పత్తులను అడ్డుకోవటం (జపాన్ బౌలింగ్ టెస్ట్) 7. పైరసీ, మేధోహక్కుల చోరీ (ఏటా లక్ష కోట్ల డాలర్లకుపైగా) 8. సుంకాలను తప్పించుకోవటానికి సముద్రరవాణా మార్గాలను ఎంచుకోవటం వంటి అంశాలను ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా నుంచి దిగుమతి అయ్యే కార్ల మీద జపాన్ నిర్వహించే పరీక్షను బౌలింగ్ బాల్ టెస్ట్‌గా ట్రంప్ అభివర్ణించారు. 'బంతిని 20 అడుగుల ఎత్తు నుంచి కారు మీదకు వదులుతారు. కారుపై సొట్ట పడితే దానికి నాణ్యత లేదని పక్కనపెడతారు. ఎంత హాస్యాస్పదం ఇది' అని ఎద్దేవా చేశారు.

పందులతో కుస్తీపడితే.. మనం మురికి అవుతాం

- దూబే వ్యాఖ్యలపై ఖురేషీ పరోక్ష విసుర్లు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: సుప్రీం కోర్టు, చీఫ్ జస్టిస్‌పై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే చేసిన తీవ్ర వ్యాఖ్యల దుమారం మరింత ముదురుతోంది. దూబే వ్యాఖ్యలను మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్‌వై ఖురేషీ తప్పుపట్టగా, ప్రతిగా ఖురేషీపై దూబే 'ముస్లిం కమిషనర్' అంటూ విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. దీంతో దూబేపై ఖురేషీ పరోక్షంగా, ప్రత్యక్షంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దూబే పేరును ప్రస్తావించకుండా.. "చాలా ఏళ్ల కింద నేను ఒకటి తెలుసుకున్నాను. పందులతో ఎప్పుడూ కుస్తీ పట్టకూడదు. అలా చేస్తే మనం మురికి అవుతాం. అంతేకాదు.. మనను ఇలా మురికి చేయడం ఆ పందికి ఇష్టం కూడా..' అని జార్జ్ బెర్నార్డ్ షా చెప్పిన సూక్తి చాలా గొప్పది" అని సోమవారం ఉదయం ఎక్స్‌లో పోస్టు చేశారు. తర్వాత మీడియాతో ఖురేషీ మాట్లాడారు. "కొందరు విద్వేష రాజకీయాలు చేసేందుకు మతపరమైన గుర్తింపును పావుగా వాడుకుంటున్నారు. కానీ భారత్ ఎప్పుడూ రాజ్యాంగ వ్యవస్థలు, సూత్రాల కోసం నిలబడుతుంది. పోరాడుతుంది. మన దేశంలో ఎవరైనా తమ వ్యక్తిగత సామర్థ్యం, చేసిన సేవలను బట్టి గుర్తింపు పొందుతారు. వారి మతపరమైన గుర్తింపును బట్టి కాదు.." అని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, న్యాయవ్యవస్థ, చీఫ్ జస్టిస్‌పై దూబే చేసిన వ్యాఖ్యలపై కోర్టు ధిక్కరణ కింద చర్యలు చేపట్టాలని న్యాయవాది బ్రిజేశ్‌సింగ్, మరికొందరు సుప్రీంకోర్టును కోరారు. అయితే దీనిపై అటార్నీ జనరల్ దగ్గరికి వెళ్లి అనుమతి తీసుకోవాలని జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం సూచించింది. దీంతో బ్రిజేశ్ సింగ్ అటార్నీ జనరల్‌కు లేఖ రాశారు.

వంట నూనె తాగేస్తున్నాం!

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళనలను తీవ్రతరం చేస్తుందని పేర్కొంది. 2001లో ఏడాదికి 8.2 కేజీలుగా ఉన్న నూనె వినియోగం నేడు 23.5 కేజీలకు పెరిగిందని తెలిపింది. ఇది భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) సిఫారసు చేసిన 12 కేజీల పరిమితికి రెట్టింపు అని పేర్కొంది. దిగుమతుల అంశంపై నీతి ఆయోగ్ సభ్యుడు రమేశ్ చంద్ మాట్లాడుతూ 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్స్ ఆయిల్స్' కింద ప్రభుత్వం దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేస్తోందని, పామాయిల్, సాంప్రదాయ నూనె గింజలపై దృష్టి సారించిందని తెలిపారు.

దిగుమతులపైనే ఆధారం

దేశీయంగా వంట నూనె ఉత్పత్తి ఉన్నప్పటికీ, భారత్ దిగుమతులపై ఎక్కువగా ఆధారపడుతోంది. స్థానికంగా ఏడాదికి 1.1 కోట్ల టన్నుల నూనె మాత్రమే ఉత్పత్తి అవుతుండగా.. ఏడాదికి 2.5-2.6 కోట్ల టన్నుల వంట నూనెను భారత్ వినియోగిస్తోందని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈఏ) ఇటీవలి గణాంకాలు చెబుతున్నాయి. ఇండోనేషియా, మలేషియా నుంచి పామాయిల్, అర్జెంటీనా, బ్రెజిల్ నుంచి సోయాబీన్ ఆయిల్, రష్యా, ఉక్రెయిన్ నుంచి సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను భారత్ దిగుమతి చేసుకుంటోంది. 2024 నవంబర్, 2025 మార్చి మధ్య గత ఏడాది అదే కాలంతో పోలిస్తే భారత్ ముడి సోయాబీన్ నూనె దిగుమతి రెట్టింపు కంటే ఎక్కువై 19 లక్షల టన్నులకు పైగా చేరింది. 2023-24లో దేశ మొత్తం వంట నూనెల దిగుమతులు 1.6 కోట్ల టన్నులుగా ఉందని అంచనా.



పామాయిల్ వినియోగమే ఎక్కువ

పారిశ్రామిక గణాంకాల ప్రకారం.. భారత వంట నూనెల వినియోగంలో ప్రస్తుతం పామాయిల్ 37 శాతానికి పైగా ఉంది. ఆ తర్వాతి స్థానంలో సోయాబీన్ (20%), ఆవ నూనె (14%), సన్‌ఫ్లవర్ (13%) ఉన్నాయి. ఇంటి బయట తిండ్లు ఎక్కువవడం, 'రెడీ టు ఈట్' ఉత్పత్తులు, బేకరీ ప్రోడక్టుల కారణంగా ప్రధానంగా హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్‌ల నుంచి నూనె డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.

అధిక నూనెతో అనారోగ్య సమస్యలు

పెద్ద నగరాలు, టైర్-2, 3 నగరాల్లో అధికంగా నూనె వినియోగించి ఇళ్లలో, బయట తయారు చేసే తిండిని తినడం వలన అనారోగ్య సమస్యలను పెంచుతున్నాయి. ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు, ఫ్యాటీ లివర్, టైప్-2 మధుమేహం వంటి సమస్యలకు వంట నూనె అధికంగా శరీరంలోకి చేరడానికి మధ్య సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో ఆరోగ్యకర జీవనం కోసం నూనె వినియోగాన్ని తగ్గించుకుందామని ప్రధాని మోదీ గత శనివారం ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా పిలుపునిచ్చారు.

ఝార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్ ఎనిమిది మంది మావోయిస్టుల హతం

- మృతుల్లో అగ్రనేత ప్రయాగ్ మాంఝీ
- అతని తలపై రూ.కోటి రివార్డు



ప్రయాగ్ మాంఝీ

రాంచీ/న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ తగిలింది. ఝార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది మావోయిస్టులు హతమయ్యారు. వీరిలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడైన ప్రయాగ్ మాంఝీ అలియాస్ వివేక్ కూడా ఉన్నాడు. అతని తలపై రూ.కోటి రివార్డు ఉంది. సోమవారం ఉదయం 5.30 గంటల సమయంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్లు భద్రతా దళాలు వెల్లడించాయి. బొకారో జిల్లాలోని లాల్పానా ప్రాంతంలో ఉన్న లుగుహిల్స్‌లో సీఆర్పీఎఫ్‌కు చెందిన కోబ్రా కమెండోలు, ఝార్ఖండ్ పోలీసులు ఈ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నారు. తెల్లవారుజామున కూంబింగ్ ప్రారంభించిన భద్రతా దళాలకు 5.30 గంటల సమయంలో మావోయిస్టులు తారసపడ్డారు. ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. 8 మంది మావోయిస్టులు హతమవగా.. మిగిలిన వారు అడవుల్లోకి పారిపోయారని భద్రతా దళాలు వెల్లడించాయి. మృతులను కేంద్ర కమిటీ సభ్యుడు ప్రయాగ్ మాంఝీ, స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు అర్వింద్ యాదవ్ అలియాస్ అవినాశ్, జోనల్ కమిటీ సభ్యుడు సాహెబ్‌రామ్ మాంఝీ అలియాస్ రాహుల్ మాంఝీ, మహేశ్ మాంఝీ అలియాస్ మోటా, తాలూ, రంజు మాంఝీ, గంగారాం, మహేశ్‌గా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో ప్రయాగ్‌పై రూ.కోటి రివార్డు ఉండగా.. అర్వింద్ యాదవ్‌పై రూ.25 లక్షలు, సాహెబ్‌రామ్‌పై రూ.10 లక్షల రివార్డులు ఉన్నట్లు చెప్పారు.

ఎన్నికల సంఘం రాజీ పడింది

- ఈసీ వ్యవస్థలో లోపం ఉంది
- అమెరికాలో రాహుల్ సంచలన వ్యాఖ్యలు



బోస్టన్, భోపాల్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: భారత ఎన్నికల సంఘంపై అమెరికాలో రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం రాజీ పడిందని, అందుకు మహారాష్ట్ర ఎన్నికలే ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ అమెరికా పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం బోస్టన్‌లో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గతేడాది జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో.. ఉన్న ఓటర్ల కంటే ఎక్కువ మందే ఓట్లు వేశారని రాహుల్ చెప్పారు. "మహారాష్ట్ర ఎన్నికల్లో సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7.30 గంటల మధ్య 65 లక్షల ఓట్లు పోల్ అయ్యాయని ఈసీ వెల్లడించింది. కానీ ఇది అసంభవం. సగటున ఒక ఓటుకు 3 నిమిషాలు పట్టినా అన్ని ఓట్లు పోల్ అవ్వాలంటే అర్ధరాత్రి 2 గంటల వరకు పోలింగ్ జరిగి ఉండాలి. కానీ అలా జరగలేదు. మహారాష్ట్ర పోలింగ్ గురించి మేం వీడియో కోసం మేం అడగగా అందుకు ఈసీ ఒప్పుకోలేదు. ఇప్పుడు వీడియో గురించి అడగడానికి వీలు లేకుండా చట్టాన్నే మార్చేశారు" అని పేర్కొన్నారు. దీనిని బట్టి ఈసీ రాజీ పడినట్లు స్పష్టమవుతోందని, ఈసీ వ్యవస్థలోనే లోపం ఉందని అన్నారు. భారత్ - అమెరికా సంబంధాలపై కూడా రాహుల్ మాట్లాడారు. అమెరికాతో మనకు భాగస్వామ్యం ఉందని, ఇరు దేశాలు కలిసి పనిచేయాలని కోరుకుంటున్నానని అన్నారు.

రాహుల్ పౌరసత్వంపై బ్రిటన్‌కు లేఖ: కేంద్రం

కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి బ్రిటన్ పౌరసత్వం ఉందన్న ఆరోపణలపై సమాచారం ఇవ్వాలంటూ ఆ దేశానికి లేఖ రాశామని కేంద్రం వెల్లడించింది. ఇందుకు సంబంధించిన కేసుపై విచారణ జరుపుతున్న అలహాబాద్ హైకోర్టు లఖ్‌నవూ బెంచ్‌కు సోమవారం ఈ విషయాన్ని తెలిపింది. దీనిపై పూర్తి వివరాలు ఇచ్చేందుకు మరికొంత సమయం కోరింది.

ప్రజలే దేవుళ్లు

- ఐఏఎస్‌లు పాలకులు మాత్రమే కాదు 'పురోగామి భారత' రూపశిల్పులు
- 'సివిల్ సర్వీసెస్ డే' వేడుకల్లో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: అణగారిన వర్గాల సమస్యలు పరిష్కరించే క్రమంలో 'నాగరిక్ దేవోభవ(ప్రజలే దేవుళ్లు)' సూత్రాన్ని పాటించాలని ప్రధాని మోదీ అధికారులకు సూచించారు. ఇది 'అతిథి దేవోభవ'లాంటిదేనని, ఇదే సత్పరిపాలన మంత్రం కావాలని ఆకాంక్షించారు. సోమవారం '17వ సివిల్ సర్వీసెస్ డే' వేడుకల్లో ఆయన ఐఏఎస్ అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. అభివృద్ధి అందరికీ అందాలని, చిట్టచివరి వ్యక్తికి కూడా ప్రయోజనం చేకూర్చాలని ఉద్బోధించారు. 'ఐఏఎస్ అధికారులు తమను తాము కేవలం పాలకులుగా భావించవద్దు. మీరు పురోగామి భారత రూపశిల్పులు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలు మారుతున్నాయి. సమకాలీన సవాళ్లకు అనుగుణంగా సివిల్ సర్వీసెస్ అధికారులు మారాలి. బడుగు వర్గాల ఈతిబాధలు వినాలి. వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి. ప్రజలే మన దేవుళ్లు. ఈ దృక్పథంతోనే గత పదేళ్ల కాలంలో 25 కోట్ల మంది ప్రజలకు పేదరికం నుంచి విముక్తి కల్పించాం. ఇది పేదరికరహిత భారత్‌కు దారితీస్తుందని విశ్వసిస్తున్నాను' అని పేర్కొన్నారు. కాలం చెల్లిన ప్రణాళికలతో అధికార యంత్రాంగం పనిచేయజాలదన్నారు. వచ్చే వెయ్యేళ్ల భవిష్యత్‌ను రూపుదిద్దే విధానాల తయారీపై ప్రభుత్వం దృష్టిపెట్టిందని తెలిపారు. ఈ విజన్‌ను నెరవేర్చేందుకు అధికారులంతా ప్రతి రోజూ, ప్రతి క్షణం అవిశ్రాంతంగా కృషిచేయాలని కోరారు. భారత్ మూడో ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించేలా చేయడంలో సివిల్ సర్వెంట్ల బాధ్యత చాలా పెద్దదన్నారు.

లగచర్ల భూసేకరణ సరైనదే!

- పోలీసుల వైఖరే చట్టవిరుద్ధం
- స్టేషన్లో సీసీ కెమెరాలు పని చేయలేదు
- గ్రామస్థుల్ని రాత్రంతా చితకబాదారు
- నిబంధనలు పాటించకపోవడం వల్లే కలెక్టర్‌పై గ్రామస్థుల దాడి పరిస్థితి
- జాతీయ హక్కుల కమిషన్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): లగచర్ల వంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల సంఘం తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. చట్ట ప్రకారం భూసేకరణకు ప్రభుత్వ ఏజెన్సీలు ఉత్తర్వులు జారీ చేసిన మాట నిజమేనని, అయితే పోలీసు అధికారులు మాత్రం ఈ విషయంలో వ్యవహరించిన తీరు సరిగాలేదని ఎన్‌హెచ్ఆర్సీ వ్యాఖ్యానించింది. లాకప్‌లోనూ, సీఐ కార్యాలయంలోనూ సీసీ టీవీ కెమెరాలు పని చేయలేదని, రాత్రంతా గ్రామస్థులను పరిగి పోలీసు స్టేషన్‌లో ఉంచి చితకబాదారని, ఆ విషయం మెజిస్ట్రేట్ ముందు చెప్పకూడదని హెచ్చరించారని, ఎన్‌హెచ్ఆర్సీ గతవారం రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన నోటీసుల్లో పేర్కొంది. పరిగి పోలీసు స్టేషన్‌లో గ్రామస్థులను నిర్బంధించిన విషయాన్ని జనరల్ డైరీలోనూ ప్రస్తావించలేదని, బీఆర్ఎస్, బీజేపీ పార్టీకి చెందిన వారినే పోలీసులు అత్యధికంగా అరెస్టు చేశారని, ఒక్క కాంగ్రెస్ మద్దతుదారుని కూడా అరెస్టు చేయలేదని తెలిపింది. అధికారులపై దాడులు చేయని అమాయకపు గ్రామస్థులపై చర్యలు తీసుకోరాదని ఎన్‌హెచ్ఆర్సీ స్పష్టం చేసింది. లగచర్ల గ్రామానికి చెందిన జర్పులా దేవితో పాటు మరో 11 మంది చేసిన ఫిర్యాదు ఆధారంగా ఎన్‌హెచ్ఆర్సీ దర్యాప్తును ప్రారంభించింది. ఈ భూమిలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన ప్రజలు సాగు చేసుకుంటున్నారని, గత నాలుగైదు నెలలుగా ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేపడుతున్నారని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా ఎన్‌హెచ్ఆర్సీ బృందం సంఘటన స్థలాన్ని, చుట్టుపక్కల ఉన్న గ్రామాలను సందర్శించిందని, సంగారెడ్డి, చర్లపల్లి జైళ్లలో ఉన్న వారిని కూడా విచారించిందని కమిషన్ వెల్లడించింది. జిల్లా కలెక్టర్, ఇతర ప్రభుత్వ అధికారులపై గ్రామస్థులు దాడి చేసిన విషయంలో అధికార వర్గాలు సాక్ష్యాధారాలు సమర్పించినట్లు కమిషన్ చెప్పింది. చట్టబద్ధమైన మార్గదర్శక సూత్రాలను అనుసరించకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఎన్‌హెచ్ఆర్సీ అభిప్రాయపడింది.

ఏసీబీ వలలో ఐదుగురు అధికారులు

మణుగూరు టౌన్/ చిలుపూర్/ ఆర్మూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో లంచం కోసం కక్కుర్తి పడ్డ ఐదుగురు అధికారులు ఏసీబీ వలలో చిక్కారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం గుట్టమల్లారంలో కొందరు ప్రభుత్వభూమిని కబ్జాచేసి ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు మణుగూరు సీఐ సతీశ్ కుమార్ కేసు నమోదు చేశారు. ఇదే కేసులో మణుగూరు వాసి బేతంచర్ల వెంకటేశ్వరరావు, ఆయన మేనల్లుడు శ్రీనివాస్‌లకు పోలీస్ స్టేషన్‌కు పిలిపించి.. కేసు పెట్టకుండా ఉండాలంటే రూ.4 లక్షలు లంచం అడిగారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు సోమవారం సీఐకి మధ్యవర్తిగా వ్యవహరించిన బిగ్‌టీవీ విలేకరి గోపికి బాధితులు రూ.లక్ష నగదు అందజేశారు. అక్కడే మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు.. గోపిని, సీఐ సతీష్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. కాగా, జనగామ జిల్లా చిలుపూర్‌కు చెందిన లింగయ్య, రాజయ్యలు మరణించిన తన తండ్రి పేరిట ఉన్న 1.23 ఎకరాల భూమిపై వారసత్వ పట్టా ఇవ్వాలని పలుమార్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) వినీత్‌కుమార్‌ను కోరారు. ఆయన లంచం డిమాండ్ చేయడంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సోమవారం బాధితుల నుంచి రూ.26 వేల నగదు తీసుకుంటున్న ఆర్ఐ వినీత్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం డొంకేశ్వర్‌కు చెందిన కాంట్రాక్టర్‌కు సీసీరోడ్డు పనులకు రూ.4.70 లక్షల బిల్లులు క్లియర్ కావాల్సి ఉంది. వాటిని క్లియర్ చేయడానికి ఆర్మూర్ పంచాయతీరాజ్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసశర్మ రూ.7,500 లంచం డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సోమవారం కాంట్రాక్టర్ నుంచి రూ.7వేలు తీసుకుంటున్న శ్రీనివాస శర్మను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. అలాగే, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో కాంట్రాక్టర్‌కు రోడ్డు నిర్మాణానికి గాను జీఎస్టీ మినహా రూ.8.50 లక్షలు చెల్లించాలి. ఆ బిల్లు మంజూరుకు లంచం ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను మున్సిపల్ డీఈఈ రఘు డిమాండ్‌చేశారు. దీంతో కాంట్రాక్టర్.. ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం డీఈఈ సూచన మేరకు వర్క్ఇన్‌స్పెక్టర్ సురేశ్‌కు కాంట్రాక్టర్ రూ.లక్ష నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. డీఈఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లపై కేసులు నమోదు చేశారు.

ఇందూరులో వ్యవసాయ వర్సిటీ!

జపాన్ పర్యటన నుంచి సీఎం రాగానే నిర్ణయం.. అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు పెడతాం

- మార్చి 31 వరకు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో వేశాం
- మిగిలిన వారికి త్వరలో వేస్తాం : తుమ్మల
- ప్రాణహిత-చేవెళ్ల ప్యాకేజీల పెండింగ్ పనులు ప్రారంభిస్తాం: ఉత్తమ్
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 90 సీట్లు: పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- నిజామాబాద్‌లో రైతుమహోత్సవ కార్యక్రమం ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, మంత్రులు ఉత్తమ్, జూపల్లి, పీసీసీ చీఫ్ మహేశ్

నిజామాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమంలో తెలంగాణకు సాటి మరో రాష్ట్రం రాష్ట్రం లేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఒకే విడతలో రైతు రుణమాఫీ పూర్తి చేసిన చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణేనని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా రూ.33వేల కోట్ల మేర రుణమాఫీ చేశామని చెప్పారు. రైతులకు పెట్టుబడి సాయం కోసం మార్చి 31 వరకు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో వేశామని.. కొందరు రైతుల ఖాతాల్లో జమ చేయలేకపోయామని, త్వరలో వారి ఖాతాల్లోనూ వేస్తామని చెప్పారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల్లో పూడికతీసేందుకు త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు. నిజామాబాద్ జిల్లాలో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని, దీనిపై.. జపాన్ పర్యటన నుంచి సీఎం తిరిగి రాగానే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. నిజామాబాద్ గిరిరాజ్ కళాశాలలో మూడు రోజుల పాటు జరగనున్న రైతు మహోత్సవం కార్యక్రమాన్ని సోమవారం మిగతా మంత్రులు ఉత్తమ్, జూపల్లి.. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి తుమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతుబంధు ఇచ్చి.. మిగతా అన్ని పథకాలనూ నిలిపివేసిందన్నారు. ఆ ప్రభుత్వ హయాంలో సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలను అందించలేదని.. వాటిని తాము పునరుద్ధరించామని చెప్పారు. వడగళ్ల వానతో పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారాన్ని అందిస్తామని తెలిపారు. అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉత్తమ్ మాట్లాడుతూ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ఆనాడు నిర్మించి ఉంటే.. నిజామాబాద్ జిల్లా రైతులకు ఎంతో మేలు జరిగి ఉండేదన్నారు. గత ప్రభుత్వం రూ.లక్ష కోట్లు అప్పుతెచ్చి కాళేశ్వరం నిర్మించినా.. ఉపయోగం లేకుండా పోయిందదన్నారు. మిగతా రాష్ట్రాలకన్నా అత్యధిక ధాన్యం ఉత్పత్తి మన రాష్ట్రంలోనే జరిగిందని, గత రెండు సీజన్‌లో 2.85కోట్ల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు సాధించామని చెప్పారు. ప్రాణహిత-చేవెళ్ల ప్యాకేజీల పెండింగ్ పనులను త్వరలోనే మొదలు పెడతామన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో 80శాతం మందికి సన్నరకం బియ్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల రాష్ట్రంలో 3.1 కోట్ల మందికి సన్న బియ్యాన్ని పంపిణీ చేశామన్నారు. మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నిజాం నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టుతో నిజామాబాద్ జిల్లా సస్యశ్యామలంగా మారిందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యాక నిజాం నవాబు ఏపీలోని గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి రైతులను ఇక్కడికి రప్పించారని పేర్కొన్నారు. ఆ రైతులే మనకు పంటలు పండించే విధానాన్ని నేర్పారన్నారని వివరించారు. రైతులు ఓట్లు వేసినందు వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. ఇది ప్రజల, రైతుల ప్రభుత్వం అని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 90 సీట్లకు పైగా గెలుస్తుందన్నారు.

హెలికాప్టర్ గాలికి కూలిన స్వాగత తోరణం

రైతుమహోత్సవ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి తుమ్మల. జూపల్లి, ఉత్తమ్, మహేష్‌కుమార్ గౌడ్‌లు హెలికాప్టర్‌లో వచ్చారు. హెలికాప్టర్ కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్‌లో దిగాల్సి ఉండగా.. పైలెట్ పొరపాటు వల్ల గిరిరాజ్ కళాశాల మైదానంలో దిగింది. ఆ గాలి వల్ల స్వాగత తోరణం కూలిపోయింది. గాలికి ఎగిసిన ధూళి కారణంగా పోలీసులు, ప్రజలు తలో దిక్కున పరుగులు తీశారు. ఈ ఘటనతో అక్కడ కాస్త గందరగోళం నెలకొంది.

సింగరేణి కార్మికులకు రూ.140 కోట్ల పింఛను నిధి

- ఎంపీ గడ్డం వంశీకృష్ణ చొరవతో నిధుల మంజూరు

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా పెండింగులో ఉన్న సింగరేణి బొగ్గు కార్మికుల పింఛను నిధిని ఎట్టకేలకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) మంజూరు చేసింది. దీనికోసం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీసుకున్న చొరవ ఫలించింది. సింగరేణి ప్రతి టన్ను బొగ్గులో రూ.20 చొప్పున కార్మికుల పింఛను నిధికి కేటాయించాల్సి ఉంది. ఈ అంశాన్ని ఎంపీ పలుమార్లు పార్లమెంటులో లేవనెత్తారు. ఈనేపథ్యంలో ఎట్టకేలకు సింగరేణి అనుమతించడంతో ఈ నిధికి రూ.140 కోట్లు వచ్చాయి. పదవీ విరమణ పొందిన ప్రతి కార్మికుడికి రూ.10వేల పింఛను అందించడం లక్ష్యమని వంశీకృష్ణ పేర్కొన్నారు.

అధిక వడ్డీ ఆశ చూపి ఉన్నదంతా ఊడ్చేసి..

- ఓం సాయి శ్రీరాం ఫైనాన్స్ సంస్థ ఘరానా మోసం
- 2,500 మందికి.. 200 కోట్లకుపైగా టోపీ
- సీఎం రేవంత్ న్యాయం చేయాలని బాధితుల విజ్ఞప్తి

పంజాగుట్ట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): "పైసాపైసా కూడబెట్టుకున్న సొమ్ము.. పాలమూరు ప్రాజెక్టులో భూములు మునిగిపోతే ఇచ్చిన పరిహారం.. ఏదీ వదల్లేదు.. అధిక వడ్డీ వస్తుందని ఆశపెట్టారు.. డబ్బులు డిపాజిట్ చేయించుకుని నిలువునా ముంచారు. రాజకీయ నాయకులతో కలిసి దర్జాగా తిరుగుతున్నారు. పోలీసులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా లాభం లేదు. ఇక మాకు ఆత్మహత్యలే శరణ్యం. సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకోవాలి.." అని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ బాధితులు గోడు వెళ్లబోసుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాధితులు ఎల్లమ్మ, దస్తగిరి, నాగమ్మ, వెంకటయ్య, భాగ్యమ్మ, పర్వతాలు తదితరులు మాట్లాడారు. ఇట్యాల సాయిబాబు, అతడి సోదరులు ఇట్యాల ధనుంజయ, బాలేశ్వర్, మరికొందరు కలిసి నాగర్‌కర్నూల్‌లో ఓం సాయి శ్రీరాం ఫైనాన్స్ సంస్థను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆ సంస్థ 2,500 మంది నుంచి రూ.200 కోట్లకుపైగా వసూలు చేసి మోసానికి పాల్పడిందని ఆరోపించారు. దీనిపై పోలీసులు 14 మందిపై కేసు పెట్టి ఐదుగురినే అరెస్టు చేశారని.. నాగం కరుణాకర్‌రెడ్డి, నాగం బుచ్చిరెడ్డి, జానకిరామ్‌రెడ్డి, సాయిబాబు కుటుంబ సభ్యులు పరారీలో ఉన్నట్టు చూపారని తెలిపారు. నిజానికి వారంతా బహిరంగంగా ఎమ్మెల్యేలతో కలిసి తిరుగుతున్నారని పేర్కొన్నారు. బాధితుల్లో ఇప్పటికే 105 మందికిపైగా ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి కల్పించుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. బాధితులకు ప్రజాసంఘాల నేతలు విమలక్క, పాశం యాదగిరి తదితరులు సంఘీభావం తెలిపారు.

సీఎం వస్తేనే పెళ్లి చేసుకుంటా !

- భీష్మించి కూర్చున్న ఖమ్మం జిల్లా యువకుడు
- వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు విజ్ఞప్తి

కారేపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి హాజరైతేనే పెళ్లి చేసుకుంటానని ఓ యువకుడు తెలిపాడు. ముఖ్యమంత్రికి ఎప్పుడు సమయం కుదిరితే అప్పుడే ముహూర్తం పెట్టుకుంటానని భీష్మించి కూర్చున్నాడు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మేకలతండాకు చెందిన భూక్య గణేశ్‌కు మహబూబ్‌నగర్ జిల్లా వెంకట్రావ్ తండాకు చెందిన కవితతో మార్చి 6న నిశ్చితార్థం జరిగింది. సీఎం తన పెళ్లికి వచ్చేలా తనకు సహకరించాలని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను కోరాడు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సీఎం రేవంత్‌రెడ్డిని వివాహానికి తీసుకువచ్చేందుకు తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

బస్సులో పుట్టిన చిన్నారికి జీవితకాలం ఉచిత పాస్

- ప్రసవం చేసిన ఆశా కార్యకర్తకూ ఏడాది ఉచిత ప్రయాణం
- ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్-కొల్లాపూర్ ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా జన్మించిన చిన్నారికి జీవిత కాలం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు సంస్థ ఎండీ సజ్జనార్ ప్రకటించారు. గర్భిణీకి సుఖ ప్రసవం చేయడంలో సహాయపడిన ఆశా కార్యకర్తతో పాటు మానవత్వం చాటుకున్న బస్సు కండక్టర్, డ్రైవర్‌ను ఆర్టీసీ యాజమాన్యం అభినందించింది. హైదరాబాద్ బస్ భవన్ లో సోమవారం ఉన్నతాధికారులతో కలిసి సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నారికి జీవిత కాలం ఉచిత బస్‌పాస్‌ను, ఆశా కార్యకర్తకు సైతం ఏడాది పాటు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించారు. ఈ నెల 15న సువర్ణ అనే గర్భిణి నాగర్ కర్నూల్‌లో వైద్య పరీక్షలు ముగించుకుని సొంతూరికి తిరుగుపయనమయ్యారు. మార్గమధ్యంలో ఆమెకు ఒక్కసారిగా పురిటినొప్పులు రావడంతో గర్భిణి వెంట ఆశా కార్యకర్త మల్లి కాంతమ్మ బస్సు కండక్టర్, డ్రైవర్ సహాయంతో ఆమెకు పురుడు పోసిన సంగతి తెలిసిందే.

గ్రూప్-1 ర్యాంకర్ కు సన్మానం..

గ్రూప్-1లో ప్రతిభ కనబరిచిన గోర్ల సుమశ్రీని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సన్మానించింది. వనపర్తి జిల్లా చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన సుమశ్రీ ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో 179 ర్యాంకును సాధించింది. ఆమె తండ్రి గోర్ల కృష్ణయ్య వనపర్తి డిపోలో గతంలో కండక్టర్‌గా విధులు నిర్వర్తించారు. కరోనా కాలంలో మరణించారు. ఆయన కూతురు గ్రూప్-1లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిందని తెలుసుకుని.. ఆమెను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సన్మానించారు.

మజ్లిస్ చేతిలో కీలు బొమ్మలు

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు సూపర్ బాస్ అసద్
- మజ్లిస్‌కు బీఆర్ఎస్ మద్దతు సిగ్గుచేటు
- మతోన్మాద పార్టీతో రాహుల్ దోస్తీ: కిషన్‌రెడ్డి



హైదరాబాద్/సంగారెడ్డి అర్బన్/సుభాష్‌నగర్ (నిజామాబాద్), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మజ్లిస్ చేతిలో కీలు బొమ్మలని, ఆ రెండు పార్టీలకు సూపర్ బాస్ మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అని కేంద్ర మంత్రి.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మజ్లిస్ మోచేతి నీళ్లు తాగుతున్నాయని ధ్వజమెత్తారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన మజ్లిస్‌కు హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ మద్దతివ్వడం సిగ్గుచేటని మండిపడ్డారు. బుధవారం ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి.. పార్టీ కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పచ్చి మతోన్మాద మజ్లిస్‌తో స్నేహం చేస్తున్న రాహుల్‌గాంధీ ఏ మొహం పెట్టుకుని సెక్యులర్ అంటున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఇప్పటికే మజ్లిస్‌కు హైదరాబాద్‌ను అప్పగించాయని.. భవిష్యత్తులో తెలంగాణను సైతం అప్పగించడానికి వెనకాడబోవన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలో మజ్లిస్‌ను గెలిపించాలని అంతర్గతంగా నిర్ణయించుకున్న బీఆర్ఎస్.. ఆ విషయాన్ని బహిరంగంగా ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. ఓట్లు ఉన్నా ఎందుకు పోటీ చేయడం లేదని.. ఓటింగ్‌కు వెళ్లొద్దని కార్పొరేటర్లను ఎందుకు బెదిరిస్తున్నారని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఎన్నికలో తాము విజయం సాధిస్తామని.. తమ అభ్యర్థి గౌతంరావు ఇతర పార్టీల ఓటర్లను ప్రజాస్వామ్య మార్గంలో కలిసి, మద్దతు కోరారని తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీ చేయకపోవడం సిగ్గుచేటు: లక్ష్మణ్

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీ చేయకపోవడం సిగ్గుచేటని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. ఆ రెండు పార్టీలు మజ్లిస్‌కు అంతర్గతంగా మద్దతు ఇవ్వడమంటే పాముకు పాలుపోసి పెంచినట్లేనని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఓటు వేయవద్దని పిలుపునివ్వడం హాస్యాస్పదమన్నారు. ఐదు దశాబ్దాలుగా ఒవైసీ కుటుంబం పాత నగరంలో అధికారంలో ఉన్నా.. ప్రజల జీవన ప్రమాణాలు మాత్రం మెరుగుపడలేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికలో ఎంఐఎం కార్పొరేటర్లు అసదుద్దీన్ కుటుంబానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

వక్ఫ్ ఆస్తులను వెల్లడించే దమ్ముందా?: రఘునందన్‌రావు

సీఎం రేవంత్‌రెడ్డికి పాతబస్తీలో వక్ఫ్ ఆస్తులపై శ్వేత పత్రం విడుదల చేసే దమ్ముందా..? అని ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. సంగారెడ్డి శివారులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో కొత్తగా తీసుకొచ్చిన రెవెన్యూ చట్టంలో వక్ఫ్ ఆస్తులెన్ని ఉన్నాయో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు దేశానికే ప్రమాదకరంగా మారిందని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ విమర్శించారు. సోమవారం నిజామాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వక్ఫ్ బోర్డు పేద ముస్లింల కోసం పని చేయడం లేదన్నారు. వక్ఫ్ ఆస్తులను ఒవైసీ ఒక్కడే కాకుండా కాంగ్రెస్‌లో ఉన్న పెద్ద ముస్లింలు కూడా వింగుతున్నారని ఆరోపించారు. వక్ఫ్ ఆదాయం పెంచే విధంగా కొత్త చట్టాన్ని తీసుకువస్తున్నామని తెలిపారు.

సాగర్, శ్రీరాంసాగర్ పరిశీలనకు ఎన్‌డీఎస్‌ఏ

- సమ్మతి తెలిపిన చైర్మన్ అనిల్‌జైన్

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంతో పాటు నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులను పరిశీలించడానికి జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్ఏ) సమ్మతి తెలిపింది. శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించడానికి వస్తున్న ఎన్‌డీఎస్ఏ చైర్మన్ అనిల్‌జైన్‌ను సాగర్, శ్రీరాంసాగర్‌లు కూడా పరిశీలించేలా విజ్ఞప్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఎన్‌డీఎస్ఏకు తెలంగాణ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్ కుమార్ లేఖ రాశారు. సాగర్, శ్రీరాంసాగర్‌లను పరిశీలించడానికి వీలుగా అదనంగా ఒక రోజు కేటాయిస్తామని, షెడ్యూల్‌ను ఖరారు చేసి, సమాచారం ఇవ్వాలని ఎన్‌డీఎస్ఏ కార్యాలయం తెలంగాణకు బదులిచ్చింది. ఇదివరకు ఉన్న షెడ్యూల్ ప్రకారం ఈనెల 28న విజయవాడకు చేరుకొని, ఏపీలో డ్యామ్ సేఫ్టీ అధికారులతో ఏపీ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో అనిల్‌జైన్ సమావేశం కానున్నారు. ఆ తర్వాత ఈనెల 29న శ్రీశైలం డ్యామ్‌ను పరిశీలించనున్నారు. 30న హైదరాబాద్‌లో తెలంగాణ అధికారులతో సమావేశం జరగాల్సి ఉండగా... దీన్ని మార్చనున్నారు. 30న నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్‌లను పరిశీలించాక... మే 1న హైదరాబాద్‌లో స్టేట్ డ్యామ్ సేఫ్టీ అధికారులతో సమావేశం అయ్యేలా షెడ్యూల్‌లో మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది.

శ్రీరాంసాగర్ గేట్లన్నీ జల్లెడ పట్టండి : మంత్రి ఉత్తమ్

తుంగభద్ర డ్యామ్ గేటు దుర్ఘటన నేపథ్యంలో రాష్ట్రంలో 50ఏళ్లు నిండిన ప్రాజెక్టుల గేట్లను పరిశీలించాలని ప్రముఖ ఇంజనీర్ కన్నయ్యనాయుడు సూచనతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. 1963లో నిర్మించిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్ల మన్నికపై సమగ్రంగా పరిశీలించాలని అధికారులకు నిర్దేశించారు. ఈ మేరకు ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్‌కు మంత్రి లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ గేటును నిశితంగా పరిశీలించి, లోపాలుంటే కొత్త గేట్లు పెట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు.

పోలవరం బ్యాక్ వాటర్ ముంపుపై అధ్యయనం

- సీడబ్ల్యూసీకి పోలవరం ప్రాజెక్టు అథారిటీ లేఖ

పోలవరం ప్రాజెక్టులో 150 అడుగుల ఎత్తుతో నీటిని నిల్వ చేయడం వల్ల బ్యాక్‌వాటర్‌తో తెలంగాణలో కలిగే ముంపుపై థర్డ్ పార్టీతో సర్వే చేయడానికి అంగీకారం తెలిపిన పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఆ దిశగా మరో కీలక అడుగు వేసింది. అంచనాలు అందిస్తే సర్వే చేయించనున్నట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర జలవనరుల సంఘం చైర్మన్‌కు లేఖ రాసింది. ప్రధానంగా కిన్నెరసాని, ముర్రేడువాగులపై ఇప్పటికే సర్వే జరిగినందున ముంపు ప్రాంతాలను గుర్తించడం, భద్రాచలం పట్టణంతో పాటు మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ వద్ద గోదావరి వాటర్ లెవల్‌ను పరిశీలించడం వంటి చర్యలు తీసుకోనుంది.

గోదావరిపై భేటీకి తెలంగాణ దూరం

గోదావరి నీటి లభ్యతపై చర్చించేందుకు ఉద్దేశించిన భేటీ సోమవారం యథావిధిగా జరిగింది. అయితే, ఈ భేటీని వాయిదా వేయాలని తెలంగాణ చేసిన విజ్ఞప్తిని కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) తోసిపుచ్చింది. ఇదివరకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారమే సోమవారం సీడబ్ల్యూసీ సమావేశమైంది. దీనికి ఏపీ చీఫ్ ఇంజనీర్ (హైడ్రాలజీ), చీఫ్ ఇంజనీర్ (అంతరాష్ట్ర వ్యవహారాలు) హాజరుకాగా... తెలంగాణ అధికారులెవరూ వెళ్లలేదు. ఈనెల 24న సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ నేతృత్వంలో న్యూఢిల్లీలో సాంకేతిక సలహా మండలి(టీఏసీ) సమావేశం ఉన్నందున... ఆ తర్వాతే భేటీ నిర్వహించాలని సీడబ్ల్యూసీని తెలంగాణ కోరినా ఫలితం లేకుండాపోయింది. దీంతో వర్చువల్ విధానంలో హాజరుకావడానికి లింక్ పంపించినా తెలంగాణ అధికారులు దూరంగానే ఉండిపోయారు.

మందుపాతర పేలి జవాన్ మృతి

చర్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్‌బాంబ్ పేలి సీఆర్‌పీఎఫ్ జవాన్ మృతి చెందాడు. బీజాపూర్ జిల్లా పర్సాగూడ అడవుల్లో రహదారి నిర్మాణం జరుగుతోంది. భద్రత కల్పించేందుకు వెళ్లిన 19వ బెటాలియన్‌కు చెందిన మనోజ్ పూజారి(26) మందుపాతరపై కాలువేయడంతో గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ చట్టం.. రాజ్యాంగ విరుద్ధం

- క్రీమీలేయర్ ఉండాలని సుప్రీంకోర్టు చెప్పినా.. కమిషన్ సిఫార్సు చేసినా సర్కారు పట్టించుకోలేదు
- ఈ చట్టాన్ని నిలిపివేస్తూ ఆదేశాలు ఇవ్వండి
- హైకోర్టులో ఎస్సీ మహిళ పిటిషన్
- విచారణకు స్వీకరించిన కోర్టు.. సర్కారుకు నోటీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమల్లోకి తెచ్చిన ఎస్సీ వర్గీకరణ చట్టం-2025ను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ప్రైవేటు రంగంలో పనిచేసే అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎస్సీ వర్గానికి చెందిన కనుకుంట్ల మంగ ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది ఆకాశ్‌కుమార్ వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నోటిఫై చేసిన ఎస్సీ వర్గీకరణ చట్టం.. 'దావిందర్‌సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ (సంపన్న కుటుంబాలను రిజర్వేషన్ల నుంచి మినహాయించడం) ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టంగా తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు.

మా పేద కుటుంబాలకు నష్టం

"ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న పేద కుటుంబాల్లోని నాలాంటి మొదటితరం వారు తీవ్రంగా నష్టపోతున్నారు. రిజర్వేషన్ల ద్వారా ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగాలు పొంది, ఆర్థికంగా ముందడుగు వేసిన కుటుంబాల్లోని రెండో తరం, మూడో తరం వారే మళ్లీ లబ్ధి పొందుతున్నారు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ, ఉపాధి కోసం ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ.. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీపడుతున్న నా వంటి మొదటితరం అభ్యర్థులకు అవకాశాలు అందడం లేదు. 'దావిందర్‌సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్' కేసులో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలోని మెజార్టీ సభ్యులు క్రీమీలేయర్ ఉండాలని తీర్పుల్లో పేర్కొన్నారు" అని పిటిషనర్ కోర్టుకు వివరించారు. ఆ కేసులో తీర్పు ఆధారంగానే తెలంగాణలో ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిషన్ కూడా ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ ఉండాలని సిఫార్సు చేసిందని.. కానీ ఈ అంశాన్ని పక్కన పెట్టి ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమల్లోకి తేవడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఈ మేరకు వర్గీకరణ చట్టం అమలును నిలిపేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. ఈ అంశంలో సుదీర్ఘంగా వాదనలు వినాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఆరువారాలకు వాయిదా వేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రాజ్యాంగ లక్ష్మణరేఖలు

భారత ప్రధాన న్యాయమూర్తి కాబోతున్న జస్టిస్ గవాయ్ సోమవారం ఒక పిటిషన్ విచారణ సందర్భంలో కొన్ని విచిత్రమైన వ్యాఖ్యలుచేశారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌లో హింస చెలరేగిన నేపథ్యంలో, ఆ రాష్ట్రంలో శాంతిభద్రతలు రాష్ట్రపతి నిర్వహణలోకి పోవాలని కోరుతున్న పిటిషన్ అది. ఆర్టికల్ 355 ప్రకారం నివేదిక తెప్పించుకోవలసిందిగా రాష్ట్రపతికి చెప్పండి అంటూ విష్ణుశంకర్ జైన్ అనే న్యాయవాది సర్వోన్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అయోధ్య నుంచి జ్ఞానవాపివరకూ తన పిటిషన్లతో న్యాయస్థానాల్లో పలువిజయాలు సాధించిపెట్టిన ఈ సుప్రీంకోర్టు న్యాయవాది ఎంత సుప్రసిద్ధుడో తెలిసిందే. ఈ పిటిషన్ చూడగానే జస్టిస్ గవాయ్‌కు మన ఉపరాష్ట్రపతి కళ్ళలో మెదిలి ఉంటారు. మీరేమో రాష్ట్రపతికి చెప్పాలంటూ నేరుగా ఇలా 'మాండమస్' ఇవ్వమంటారు, మేము మరోపక్క పార్లమెంటరీ, కార్యనిర్వాహక విధుల్లో జోక్యం చేసుకుంటున్నామని మాటలు పడుతూంటాం అన్నది గవాయ్ వ్యాఖ్యల సారాంశం. రాష్ట్రపతికి చెప్పగలిగేంతవాళ్ళం కాదు అని సుప్రీంకోర్టు ఈ పిటిషన్‌ను తిరస్కరించి వుంటే ఆ రాష్ట్రానికి గతంలో గవర్నర్‌గా వ్యవహరించిన జగదీప్ ధంఖర్ సంతోషించేవారా? అన్నది కాంగ్రెస్ నాయకుల ప్రశ్న.

బిల్లుల ఆమోదానికి రాష్ట్రపతికి గడువు విధించినందుకు సుప్రీంకోర్టును తప్పుబడుతూ ఉపరాష్ట్రపతి చేసిన వ్యాఖ్యలు దేశప్రజల్లో సంభ్రమాశ్చర్యాలు కలిగించాయి. ఆయన తన హోదాకు తగనిరీతిలో మాట్లాడారని సామాన్యులకు సైతం అనిపించింది. వాళ్ళే శాసనకర్తలు, వాళ్ళే తీర్పరులు, వాళ్ళే కార్యనిర్వాహకులు, సమస్తం వాళ్ళే, ఇక్కడి చట్టాలు మాత్రం వాళ్ళకు వర్తించవు, ఎందుకంటే వీటిన్నింటికీ అతీతులు వారు అంటూ న్యాయమూర్తులను విమర్శించారు జగదీప్ ధంఖర్. సుప్రీంకోర్టును 'సూపర్ పార్లమెంట్'గా, ఆర్టికల్ 142ను దాని అమ్ముల పొదిలో ఉన్న న్యూక్లియర్ మిసైల్‌గా అభివర్ణించడం ఆయన స్థాయికి తగినట్టుగా లేదు. న్యాయశాస్త్రం చదువుకున్న వ్యక్తి కనుక ఆయన తన అభిప్రాయాన్ని గౌరవప్రదంగా వెలిబుచ్చవచ్చు. అసమ్మతిని, విమర్శను నిర్మాణాత్మకంగా చేయవచ్చు. కానీ, ఆయన వాడిన భాషవల్ల ఇంకా ఆయనను పక్షపాతాలూ, విధేయతలు వీడలేదన్న భావన కలిగింది. విషయం పక్కకుపోయి, ఆయన రాజకీయ ప్రస్థానం, ఎదిగివచ్చిన క్రమం ఇప్పుడు చర్చకు వస్తున్నాయి. మోదీ తెచ్చిన ఎన్‌జేఏసిని సుప్రీంకోర్టు కొట్టివేసినప్పుడు ఎంపీలంతా చేష్టలుడిగి, చేతలుకట్టుకొని కూర్చున్నారంటూ ఈ మధ్యనే వారిని రెచ్చగొట్టేరీతిలో వ్యాఖ్యానించారు. ఇటీవల ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ ఉదంతం జరగ్గానే కొద్దిగంటల్లోనే బీజేపీ, కాంగ్రెస్ అధ్యక్షులను ఇంటికి పిలిపించుకొని మరీ ఎన్‌జేఏసిమీద చర్చించిన విషయం తెలిసిందే. ఇప్పుడు కూడా ఆయన వర్మ ఉదంతాన్ని ఆయుధంగావాడి మరీ అక్కసు తీర్చుకున్నారు. వక్ఫ్ చట్టంలోని కొన్ని వివాదాస్పద అంశాలమీద సుప్రీంకోర్టు స్టే విధించే అవకాశాలు కనిపిస్తున్నందువల్లే అధికారపక్షం నుంచి సుప్రీంకోర్టు మీద పై స్థాయిలో ఎదురుదాడి జరుగుతోందని విపక్ష నేతల ఆరోపణ.

గవర్నర్లు సరే, రాష్ట్రపతికి గడువు విధించడం సరికాదని ఉపరాష్ట్రపతి అభ్యంతరం. విపక్షపాలిత రాష్ట్రాల్లో గవర్నర్లు ఏమీ తేల్చకుండా బిల్లులను నిరవధికంగా తొక్కిపెడుతున్నారు కనుక, అక్కడి ప్రభుత్వాలు సుప్రీంకోర్టును శరణుజొచ్చవలసి వస్తున్నది. కోర్టు కూడా ఏళ్ళ తరబడి హితవులు చెప్పి, ఫలితం లేకపోవడంతోనే ఈ గడువులు విధించాల్సి వచ్చింది. అసెంబ్లీ రెండోమారు ఆమోదించిన బిల్లులను సైతం తమిళనాడు గవర్నర్ అతితెలివిగా రాష్ట్రపతికి పంపితే, అక్కడ కూడా అవి కదలకుండా ఉండిపోతే ఏం చేయాలి? రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాల్సిన గవర్నర్లు గాడితప్పినప్పుడల్లా రాష్ట్రపతి మందలిస్తూ ఉంటే, అసలు ఈ కేసులే ఉండవు.

ఒక బిల్లు గవర్నర్ దగ్గర ఎంతకాలం ఉండాలి, రాష్ట్రపతికి ఏ దశలో నివేదించాలన్నది రాజ్యాంగం స్పష్టంగా చెప్పనికారణంగా దానిని ఒక రాజకీయఆయుధంగా వాడుకుంటున్నవారు, ఇప్పుడు కాలపరిమితి విధించినందుకు న్యాయవ్యవస్థమీద బురదజల్లుతున్నారు. రాజ్యాంగ మూలస్తంభాలు మూడు సమన్వయంతో, సహకారంతో, పరస్పర గౌరవంతో నడుచుకోవాలి. శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థల మధ్య పరిమితులు, పరిధులకు సంబంధించి ఘర్షణ తలెత్తడం కొత్తేమీ కాదు. కానీ, వాటిని సరిదిద్ది, తిరిగిపట్టాలమీద ఉంచాల్సిన అత్యున్నత స్థాయి వ్యక్తులే చర్చకు కాక, రచ్చకు దారితీసేవిధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదు. ప్రతీ వ్యవస్థా లక్ష్మణరేఖదాటకుండా వ్యవహరించినప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుంది.

అక్షరాలూ రంగుల సవ్యసాచి

మన సాహిత్యంలో నవల, కథ, కవిత, గేయం, నాటకం, పద్యం వంటి ప్రక్రియలు ఉన్నట్లే, చిత్రకళలో కూడా వాటర్ కలర్స్, ఆయిల్ పెయింట్స్, చార్‌కోల్, కలర్ పెన్సిల్, పేస్టల్స్, కత్తిరింపుల కళ, పేపర్ ఆర్ట్, మ్యూరల్స్ వంటి పలు రకాల ప్రక్రియలు ఉన్నాయి. శీలా వీర్రాజు అటు సాహిత్యంలోనూ, ఇటు చిత్రకళా రంగంలోనూ సమకృషి చేసి రెండు రంగాల వారిని మెప్పించారు.

తెలుగు రాష్ట్రాల్లో ఈ రెండు కళారంగాల్లో కృషి కొనసాగించినవారు అరుదు. రాంభట్ల కృష్ణమూర్తి, అడవి బాపిరాజు, చలసాని ప్రసాదరావు, సంజీవదేవ్, వేలూరి రాధాకృష్ణ, తలిశెట్టి రామారావు, పిలకా లక్ష్మీనరసింహమూర్తి, అంట్యాకుల పైడిరాజు, రాజాజీ, జింకా రామారావు, ఆకురాతి రామకృష్ణ, ఇనపకుర్తి చిన సత్యనారాయణ, బాలి, ఎస్వీ రామారావు, వడ్డాది పాపయ్య, అబ్బూరి గోపాలకృష్ణ, బి.ధర్మారావు, బాలగోపాల భాస్కరరాజు, చేమకూర సత్యనారాయణ, ద్వివేదుల సోమనాథశాస్త్రి, యీడూరి రామచంద్రరావు, కొండిపర్తి శేషగిరిరావు, మాధవపెద్ది గోఖలే, మారేమండ శ్రీనివాసరావు, పల్లా పర్సినాయుడు, తాడి మోహన్, తిప్పాసి వెంకటరావు, ఉండ్రు ఆశీర్వాదం తదితరులు సాహిత్య, చిత్రకళా రంగాల్లో కృషిచేసి రెండు రంగాల్లోనూ గుర్తింపు పొందారు.



తొలితరం చిత్రకారులైన దామెర్ల రామారావు సన్నిహితుడు వరదా వెంకటరత్నం శిష్యుడైన శీలా వీర్రాజుగారు వందలాది వాటర్, ఆయిల్ కలర్ చిత్రాలు వేశారు. కొందరి చిత్రాల్లా వీర్రాజుగారి చిత్రాలు చూసిన వెంటనే ఇది వాటర్ కలర్ అనీ, ఇది ఆయిల్ కలర్ అని చెప్పడం కష్టం. ఆయన తన తైలవర్ణ చిత్రాల్ని సహజ సుందరంగా ఉండే రంగుల్లో చూపించగా, నీటిరంగుల చిత్రాలకు ప్రాథమిక వర్ణాలను అద్దారు.

శీలా వీర్రాజు చిత్రకళలో ముఖ్య విభాగాలు స్కెచ్‌లు, వాటర్ కలర్స్ ఆయిల్ పెయింట్స్. ఒక్క మాటలో చెప్పాలంటే కార్టూన్లు తప్ప మిగిలిన అన్ని విభాగాల్లోనూ ఆయన సాధన చేశారు. వందలాది కథలు, నవలలు చదివి అందులో రచయిత/ రచయిత్రి చెప్పిన ముఖ్య విషయాన్ని వీర్రాజు రేఖల్లో చెప్పేవారు. బాపు తర్వాత ఎక్కువమంది నాటి రచయితలు తమ గ్రంథాలకు చిత్రాలు, వీర్రాజు గారిచే వేయించుకోవాలని ఆరాటపడేవారంటే ఆయన చిత్ర ప్రతిభ ఊహించవచ్చు. ఆయన వెయ్యికి పైగా గ్రంథాలకు ముఖచిత్రాలు చిత్రించారు. అవన్నీ కూడా ఒక గ్రంథంగా త్వరలో రానున్నాయి.

సుప్రసిద్ధ దర్శనీయ స్థలాలైన లేపాక్షి, భువనేశ్వర్, కోణార్క్, ఎల్లోరా, పాకాల, అమరావతి, ఉండవల్లి, పానగల్లు, ఆంధ్ర మహావిష్ణు ఆలయం, శ్రీకాకుళం, వరంగల్లు, హనుమకొండ, శ్రీశైలం మల్లికార్జునస్వామి దేవాలయం, గోల్కొండ కోట, బిర్లా వెంకటేశ్వరాలయం తదితరాల్ని ఇండియన్ ఇంక్ స్కెచ్‌లుగా గీసి, సజీవ శిల్పాలుగా మన ముందు వుంచారు. శిల్ప రేఖల్లో వేగం, జీవం మనం ప్రత్యేకంగా గమనించవచ్చు. ఇంకా ఆయన తిరుపతి వేంకటకవులు, రఘుపతి వెంకటరత్నం నాయుడు, కుందుర్తి, బుచ్చిబాబు వంటి తనకిష్టమైన రచయితల రూపచిత్రాల్ని రేఖల్లో చూపించారు.

తొలితరం ఆంధ్ర చిత్రకారులైన దామెర్ల రామారావు సన్నిహితుడు వరదా వెంకటరత్నం శిష్యుడైన వీర్రాజుగారు వందలాది వాటర్, ఆయిల్ కలర్ చిత్రాలు వేశారు. కొందరి చిత్రాల్లా వీర్రాజుగారి చిత్రాలు చూసిన వెంటనే ఇది వాటర్ కలర్ అనీ, ఇది ఆయిల్ కలర్ అని చెప్పడం కష్టం. ఆయన తన తైలవర్ణ చిత్రాల్ని సహజ సుందరంగా ఉండే రంగుల్లో చూపించగా, నీటిరంగుల చిత్రాలకు ప్రాథమిక వర్ణాలను అద్దారు. నాటి గ్రామీణుల పండుగలు, అలంకరణలు, సంస్కృతి, కట్టు, బొట్టు, నేపథ్యం... ఇవీ ఆయన ప్రధాన ఇతివృత్తాలు. నాటి సంస్కృతిని తన చిత్రాలతో కళ్ళకు కట్టారు. 'చెరువు నుంచి' చిత్రంలో ఎనిమిది మంది మహిళలు ఇత్తడి, రాగి, మట్టి కుండలతో నీళ్లు తెస్తున్న దృశ్యం నేటి సమాజంలో మనకు ఎక్కడా గోచరించదు. చిత్రకారుణి సూక్ష్మపరిశీలనకు నిలువెత్తు నిదర్శనం ఈ చిత్రం. ఇంకా వారు గీసిన– 'మహాకవి పోతన', 'ఏటికెదురు', 'పళ్ళ మార్కెట్', 'కేశాలంకరణ', 'దీపావళి సంబరం', 'దంచడం', 'తిరగలి', 'సంత నుంచి', 'చలిమంట', 'మేదరుల జీవనం', 'చెమ్మచెక్క', 'హరిదాసు', 'మట్టి మనుషులు', 'కమ్మరి', 'క్షురకుడు', 'గొబ్బెమ్మ'... అత్యద్భుతమైన వర్ణ దృశ్యాలు, కావ్యాలు.

వీర్రాజుగారితో నాకు ప్రత్యక్ష సంబంధం లేకపోయినా, వారితో 2012 నుంచి ఒక దశాబ్దం పాటు పరోక్ష సంబంధం వుంది. హైదరాబాద్‌కు చెందిన సిపి బ్రౌన్ అకాడెమీ కోరికపై నేను 'జాతిరత్నం: వడ్డాది పాపయ్య' జీవితచరిత్ర వ్రాశాను. అకాడెమీవారు ఆ గ్రంథాన్ని పరిశీలన నిమిత్తం శీలా వీర్రాజుగారికి పంపారు. ఆ గ్రంథాన్ని చదివి ఆయన చాలా విలువైన విషయాల్ని తెలిపారు. కొరకరాని కొయ్యగా పేరొందిన వపాతో స్నేహం చెయ్యడంతో పాటు, కొయ్యని కొరికిన అసాధ్యుడివి అని అభినందించారు.

2017 ఏప్రిల్ 28, 29 తేదీల్లో విశాఖ మ్యూజియంలో వీర్రాజుగారి వ్యక్తిగత చిత్రకళా ప్రదర్శన నిర్వహించి విశాఖ చిత్రకళాభిమానులకు ఆయన చిత్ర ప్రతిభను మా చిత్రకళా పరిషత్ ద్వారా పరిచయం చేశాం. వారి అనారోగ్య కారణంగా వారి పరోక్షంలో ఈ కళాప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో దాదాపు 30కి పైగా వాటర్, ఆయిల్ కలర్ చిత్రాలను ప్రదర్శించాం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌర సంబంధాల శాఖలో అనువాదకుడిగా ఎన్నో ఒత్తిడులు ఎదుర్కొంటూ సాహిత్య, చిత్రకళా రంగాల్లో వీర్రాజుగారు తనదైన చెరగని ముద్ర వేశారు. పొగడ్తలకు, ప్రశంసలకు అవకాశం ఇవ్వకుండా తన కళా కృషిని మౌనంగా కొనసాగించిన వీర్రాజుగారి ప్రతిభను మన ప్రభుత్వం గుర్తించకపోయినా, సాహితీ, కళాభిమానులు వారి ప్రతిభను గుర్తించారు, ఉచిత రీతిన అనేక సంస్థలు గౌరవించాయి. రాజమహేంద్రవరంలో వీర్రాజుగారు చిత్రకళ అభ్యసించిన దామెర్ల ఆర్ట్ గ్యాలరీలో దామెర్ల, వరదా, రాజాజీ వంటి ఉద్దండుల చిత్రాలతో పాటు వీర్రాజుగారి చిత్రకళా వర్ణ వైభవాన్ని మనం చూడవచ్చు.

○ సుంకర చలపతిరావు

(నేడు శీలా వీర్రాజు జయంతి)

పృథ్వీ పరిరక్షణ పౌర కర్తవ్యం

'మాతా భూమి పుత్రోహం పృథివ్యా' ఈ భూమి నా తల్లి, నేను ఆమె కుమారుడిని అన్నది అథర్వణ వేదంలో చెప్పిన ఈ సూక్త భాగానికి భావం. ఈ రోజు ధరిత్రి దినోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో సమస్త జీవరాశులకు ఆధారమైన ఈ భూమిని కాపాడుకునే దిశగా ప్రతినబూనడం మనందరి కనీస బాధ్యత. ఈ విశాల విశ్వంలో జీవం మనుగడ ఉన్న భూమి లాంటి మరో గ్రహం ఉన్నట్లు ఇంతవరకు ఆధారాలు లేవు. చైతన్యపూరితమైన జీవం ఉన్నది ఈ భూమిపైనే. అరుదైన ఆ చైతన్యాన్ని మనం కాపాడుకోవాలంటే ఈ భూమిని కాపాడుకోవాలి. ఈ భూమి లేకపోతే ఈ చైతన్యం లేదు. మనం లేము. ఈ ఎరుకను భావితరాల్లో నింపేందుకు ప్రయత్నాలు మన నుంచే ప్రారంభం కావాలి. ఇందుకోసం ముందు మనం ఈ భూమిని కాపాడుకుని, భవిష్యత్ తరాలకు అందించాలి.



భూమిని తల్లిగా మనసా వాచా కర్మణా భావిస్తూ, జీవం మనుగడకు ప్రకృతే ఆధారం అన్న గొప్ప ఎరుక వేదకాలంలోనే మన పెద్దలు తెలియజేశారు. ప్రకృతిని పరిరక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని నమ్మి, ఆచరించిన ధన్యభూమి మనది. చెట్టూ పుట్టకు మొక్కి, పాముకు పాలు పోసి, చీమకు చక్కెరపెట్టి, పశువుకు దణ్ణం పెట్టే సంస్కృతి మనది. అటువంటి సంస్కృతికి దూరం అవుతున్న కొద్దీ విపరిణామాలు దగ్గరవుతున్నాయి. ప్రకృతి గొప్పతనాన్ని వివరిస్తూ బోధించిన విజ్ఞానాన్ని అవహేళన చేసే పరిస్థితి దాపురించింది. పాశ్చాత్య అభివృద్ధి నమూనాతో ఈ భూమిని, భూమిని ఆవరించుకుని ఉన్న ప్రకృతిని విధ్వంసం చేయడం వల్ల దుష్ఫలితాలను ఎదుర్కొంటున్నాం. తాగునీటిని సీసాల్లో కొనుక్కోవాల్సిన దుస్థితికి చేరుకున్నాం. అంతేకాదు.. అకాల వర్షాలు, అతి వృష్టి, అనావృష్టి, భూతాపం పెరిగిపోవడం వంటి విపత్తులతో అపార ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవిస్తున్నాయి.

ప్రపంచంలో మంచి నీటికి, కొన్ని ప్రధాన నదుల పుట్టుకకు మూల వనరులు అయిన హిమానీ నదాలు (గ్లేసియర్లు) చాలా వేగంగా కరిగిపోతున్నాయన్న నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా భూతాపం పెరిగి మంచు కొండలు, హిమానీ నదాలు చాలా వేగంగా కరిగిపోవడం కారణంగా నీటి చక్రం (మంచు కొండలు కరిగి నీటిగా మారడం, ఆ నీరు ఆవిరవడం, ఆవిరయిన నీరు వర్షంగా మారి తిరిగి భూమికి చేరడం– ఇదంతా ఒక క్రమబద్ధమైన చక్రం) అనూహ్య మార్పులకు లోనవుతోంది. ఫలితంగా తాగునీటి కొరత ఏర్పడడంతో పాటు సముద్ర మట్టం పెరిగిపోయి భూభాగం ముంపు ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది.

భూమిపై అందుబాటులో ఉన్న మంచి నీటిలో 70 శాతం మంచు, హిమానీ నదాల రూపంలో ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దాదాపు 200 కోట్ల మంది ప్రజలు... హిమానీ నదాలు, మంచు కరగడం వల్ల వచ్చే నీటిపై, కొండలపై నుంచి ప్రవహించే నీటిపై ఆధారపడుతున్నారు. ఒక్క 2023లోనే హిమానీ నదాలు వేగంగా కరగడం వల్ల 600 గిగా టన్నుల నీటిని కోల్పోయినట్లు నివేదికలు చెబుతున్నాయి. గత 50 ఏళ్ల చరిత్రలో ఇదే అత్యంత ఎక్కువ నష్టం. 1900 నుంచి ఇప్పటికి 20 సెంటీమీటర్లకు పైగా సముద్ర మట్టం పెరిగిందని నివేదికలు చెబుతున్న మాట ఎంతో కలవరపర్చే అంశం. ఈ పరిణామాలు ఇలాగే కొనసాగితే నీరు అత్యంత విలాస వస్తువుగా మారిపోతుంది. నీటి కోసం యుద్ధాలు సంభవిస్తాయి. ఇప్పటికే నీటి కోసం ప్రజల మధ్య, దేశాల మధ్య సంఘర్షణ వాతావరణం నెలకొని ఉండడం, పాత ఒప్పందాలను కాలరాయడానికి కూడా తెగబడడాన్ని మనం చూస్తున్నాం.

> మన భారత భాగ్య విధాతలు కలలుగన్న కాలుష్య రహితమైన భూమిని భవిష్యత్ తరాలకు అందించడమే ఆ మహనీయులకు అందించే నిజమైన నివాళి. ఈ ప్రకృతి సంపదకు మనం ధర్మకర్తలమే కానీ యజమానులం కాదన్న జాతిపిత మహాత్మాగాంధీ బోధనలను ఆచరణలో చూపించాలి. ప్రకృతి వనరుల పరిరక్షణ కేవలం ప్రభుత్వాల విధ్యుక్త ధర్మం మాత్రమే కాదు, అది మనందరి బాధ్యత అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

నీటికి, అడవులకు అవినాభావ సంబంధముంది. అడవులను కాపాడుకుంటే వర్షపాతం పెరుగుతుంది. వర్షపాతం పెరిగితే అది మళ్లీ అడవుల మనుగడకు ఉపయోగపడుతుంది. కానీ అభివృద్ధి పేరుతో అడవులను ఆక్రమిస్తూ, విధ్వంసానికి కారణమవడం వల్ల కూడా నీటి చక్రం తారుమారవుతోంది. అడవులు సహజసిద్ధమైన జలాశయాలు. వర్షపాతాన్ని ఇముడ్చుకుని భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండేలా కాపాడతాయి. అడవులను విచ్చలవిడిగా నరికివేయడం వల్ల పచ్చదనం తగ్గి, వర్షపాతం తగ్గి కరవు పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

పారిశ్రామికీకరణకు ముందు ఉన్న ఉష్ణోగ్రతల కన్నా 2 డిగ్రీల సెల్సియస్ నుంచి 1.5 డిగ్రీల సెల్సియస్‌కు మించి ఉష్ణోగ్రతలు పెరగకుండా చేస్తే ప్రపంచంలోని ప్రాచీన హిమానీ నదాల్లో మూడింట రెండోవంతు హిమానీ నదాలను కాపాడుకోవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇందుకు కర్బన ఉద్గారాలను తగ్గించడం అత్యంత అవసరమైన పని. భూతాపంలో పెరుగుదల 2 డిగ్రీల సెల్సియస్ – 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలన్న పారిస్ ఒప్పందానికి మన దేశం కట్టుబడి ఉంది. అభివృద్ధి చెందిన దేశాలు చిత్తశుద్ధితో ఈ ఒప్పందానికి కట్టుబడడంతో పాటు కర్బన ఉద్గారాలను తగ్గించడానికి కావాల్సిన నిధులను అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందిస్తే సమస్త మానవాళికి మేలు.

భారతదేశ పౌరులుగా మనమందరం కూడా మనవంతు కర్తవ్యం నెరవేర్చాలి. పెట్రోలు, డీజిల్ వంటి శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించుకుంటూ పునర్వినియోగ ఇంధనం వైపు, శుద్ధ ఇంధనం వైపు మరలాలి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ ఇంధన వనరుల్లో సౌర విద్యుత్తు ఉపయుక్తం. గృహ వినియోగానికి సౌర విద్యుత్తును కేంద్ర ప్రభుత్వం రాయితీతో ప్రోత్సహిస్తోంది. ప్రజలు దీన్ని పెద్ద ఎత్తున ఉపయోగించుకోవాలి. ఇప్పుడు ఎక్కువ మంది ఇళ్లల్లో తాగునీటికి ఆర్వో పరికరాలను వాడుతున్నారు. వాటిల్లో నీటి వృథా ఎక్కువగా ఉంటుంది. ఆ నీటిని వృథాగా సింకుల్లోకి వదలకుండా మొక్కలకు పారేలా ఏర్పాట్లు చేసుకోవాలి. లేదంటే ఆ నీటిని సమీకరించే ఏర్పాటు చేసుకుని ఇతరత్రా అవసరాలకు వాడుకోవాలి. నీటిని పునర్వినియోగించుకునే పద్ధతులను అలవర్చుకోవాలి.

భూమి సహజ స్వభావాన్ని నాశనం చేస్తున్న అంశాల్లో ప్లాస్టిక్ ఒకటి. ఈ రోజు మన జీవితాల్లోకి ప్లాస్టిక్ బాగా చొచ్చుకొచ్చేసింది. పాత్రల నుంచి ప్యాకేజింగ్ వరకు అంతా ప్లాస్టిక్కే. ప్లాస్టిక్‌పై సరైన అవగాహన లేకుండా వినియోగిస్తే, దానివల్ల వాటిల్లే నష్టం ఎక్కువ. మైక్రో ప్లాస్టిక్స్ దీర్ఘకాలంలో విషపూరిత రసాయనాలు విడుదల చేస్తాయని, అవి ఆహార చక్రంలోకి చేరి మానవాళి సహా జీవజాలం మొత్తానికి తీవ్ర హాని కలిగిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రతి ఏటా 460 మిలియన్ మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్‌ను ఉత్పత్తి చేస్తుంటే 20 మిలియన్ మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ పర్యావరణంలోకి



చేరుతోంది. ఇది భూమిలో తొందరగా కలవదు. దీంతో జీవావరణానికి చాలా నష్టం జరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దాదాపు 10 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ ప్రతి ఏటా సముద్రాల్లో కలుస్తూ జీవావరణానికి విపరీత నష్టం కలిగిస్తోంది. సాధ్యమయినచోట వస్తువులను తీసుకువెళ్లడానికి ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జౌళి సంచులు వంటివి ఉపయోగించాలి. ప్లాస్టిక్ పాత్రలకు బదులు మట్టి పాత్రలు, దీర్ఘకాలం మన్నే స్టీలు పాత్రల వంటివి వాడుకోవాలి.

జలవనరులను కలుషితం చేయడం, ఎక్కడికక్కడ చెత్త పారవేయడం వంటివి కూడా భూమి స్వభావాన్ని ప్రభావితం చేస్తున్నాయి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. తడిచెత్త, పొడిచెత్తను వేరు చేస్తూ పునర్వినియోగానికి వీలుగా ఉన్నవాటిని పునర్వియోగరూపంలోకి తీసుకొచ్చే ఏర్పాట్లు, ఇంధనం ఉత్పత్తి చేసే ఏర్పాట్లు, అందుకు తగ్గ విధానాలున్నా ఆచరణలో ఇంకా చాలా అవరోధాలున్నాయి. మన సమాజం ఇంకా ఈ పద్ధతులకు అలవాటుపడలేదు. నినాదాలకు పరిమితం కాకుండా ప్రజల్లో క్షేత్రస్థాయి నుంచే మార్పు వచ్చేలా ఆచరణాత్మక విధానాలు రూపొందించి అమలు చేయాలి.

మన మనుగడకు ఆధారం అయిన ఈ ధరిత్రిని కాపాడుకోవడానికి మనమందరం ఈ పంచసూత్రాలను అవలంబించాలి: 1. వినియోగ తత్వాన్ని తగ్గించుకుంటూ దీర్ఘకాలం మన్నే వస్తువులను వాడడం; 2. చెట్లను విచ్చలవిడిగా కొట్టకుండా, వీలయినన్ని ఎక్కువ మొక్కలు నాటుతూ అటవీ సంపదను పెంచడం; 3. శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించుకుంటూ సౌరవిద్యుత్తు వంటి శుద్ధ ఇంధనం వైపు మరలడం; 4. జలవనరులను పరిరక్షించుకోవడం, ఆక్రమణలను తొలగించడం; 5. పూర్వ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు ప్రకృతి వనరుల పరిరక్షణపై అవగాహన కల్పించడం, ఆచరణలో పెట్టించడం.

'సుజలాం సుఫలాం మలయజశీతలామ్
సస్యశ్యామలాం మాతరం వందే మాతరం' అంటూ స్వరాజ్య ఉద్యమ సమయంలో మన భారత భాగ్య విధాతలు కలలుగన్న కాలుష్యరహితమైన భూమిని భవిష్యత్ తరాలకు అందించడమే ఆ మహనీయులకు అందించే నిజమైన నివాళి అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ప్రకృతి సంపదకు మనం ధర్మకర్తలమే కానీ యజమానులం కాదన్న జాతిపిత మహాత్మాగాంధీ బోధనలను ఆచరణలో చూపించాలి. ప్రకృతి వనరుల పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. అది మనందరి బాధ్యత అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించినప్పుడు ఈ స్ఫూర్తి తరతరాలకు పరిఢవిల్లుతుంది.

■ ముప్పవరపు వెంకయ్యనాయుడు
పూర్వ ఉపరాష్ట్రపతి

(నేడు ధరిత్రి దినోత్సవం)

పర్యావరణ విద్యను నవీకరించాలి

ప్రపంచం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ), కార్బన్ ట్రేడింగ్, గ్రీన్ ఎనర్జీ, క్లైమేట్ టెక్నాలజీస్ వంటి వినూత్న మార్గాల్లో దూసుకుపోతోంది. భారత్ 2030 నాటికి ఎస్‌డీజీలను చేరాలన్న లక్ష్యంతో పాటు, 2045 కల్లా కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గించడం, 2070 నాటికి నెట్-జీరో దేశంగా మారడం లక్ష్యంగా పెట్టుకుంది.

కానీ, మన విద్యా విధానం పర్యావరణాన్ని ఇంకా ప్రాథమిక స్థాయిలో మాత్రమే విద్యార్థులకు బోధిస్తోంది. పాఠ్యాంశాలు పాతవి, దృష్టి కోణం మరీ పాతది! పర్యావరణ విద్య అంటే 'కాలుష్యం, మొక్కలు నాటడం, అటవీ సంరక్షణ' అనుకునే స్థాయికే విద్యార్థులు పరిమితం అవుతున్నారు. ఫలితంగా వారు, పర్యావరణ శాస్త్రాన్ని విలువలేని విషయంగా, తక్కువగా చూస్తున్నారు. కార్బన్ క్రెడిట్స్, ఈఎస్‌జీ ఫ్రేమ్‌వర్క్‌లు, సస్టైనబిలిటీ వంటి కీలక అంశాలు తెలియనప్పుడు– రేపటి గ్రీన్ ఎకానమీ అవకాశాల్లో వారు ఎలా పోటీపడగలరు? మన ప్రముఖ విశ్వవిద్యాలయాల్లోని పర్యావరణ విభాగాలు కూడా దశాబ్దాల కిందటి పాఠ్యాంశాలకే పరిమితమయ్యాయి! అంటే సిలబస్‌ను నవీకరించకుండా, విద్యార్థుల భవిష్యత్తును పాతబడిన విద్యతోనే మనం నిర్దేశిస్తున్నామన్న మాట. అందుకే పాఠ్యప్రణాళికలోని 'పర్యావరణ విద్య' సిలబస్‌ను ఆధునీకరించాల్సిన అవసరం ఉంది.

మార్పు ఒక అవసరం కాదు– అది మన భవిష్యత్తును నిలబెట్టే అద్భుత సాధనం. పర్యావరణాన్ని ఒక సబ్జెక్ట్‌గా చూడటం ఆపాలి– దాన్ని ఒక సమిష్టి బాధ్యతగా, ఒక జీవన దిశగా స్వీకరించాలి.

– డా. పేటేటి శేషబాల

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ-మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

జనారణ్యం మధ్య వనజీవి


నడిచే చెట్టులా కనిపించేవాడు దరిపెల్లి రామయ్య. పాతబడిన స్కూటీకి ఇరువైపులా విత్తన గింజల సంచులు, నీళ్లు నింపుకున్న ప్లాస్టిక్ బాటిళ్లు తగిలించుకొని ఊళ్ల దారుల్లో ఆయన ముందుకు సాగుతూ ఉంటే, హరిత వనమేదో జవజీవాలతో కదులుతున్నట్టు అనిపించేది. అడవుల పరిరక్షణ, మొక్కల పెంపకం కేవలం ప్రభుత్వాల బాధ్యతే అనేలా పరిస్థితులు మారిన తరుణంలో– రామయ్య విలక్షణమైన వ్యక్తిలా కనిపించేవాడు. ఎవరేమనుకున్నా 'నా దారి పర్యావరణ దారి' అనే నైజాన్ని ఒంటబట్టించుకొని రామయ్య జీవిత పర్యంతం ఒంటరిపోరు చేశాడు. ఖమ్మంలో, ఆ మాటకొస్తే తెలుగునాట హరితస్పృహను రగిలించడంలో రామయ్యది ప్రత్యేకమైన స్థానం. చివరి శ్వాస వరకూ రామయ్య వన రుషిగా బతికాడు. 79 ఏళ్ల వయస్సులో నిద్రలోనే తనువు చాలించాడు. ఆయనది సార్థక జీవితం. ఆనాడు రామయ్య అజ్ఞాతవాసంలో కీకారణ్యంలో వనజీవిగా సంచరిస్తే ఈ రామయ్య జనారణ్యంలో మొక్కవోని దీక్షతో అభినవ వనజీవిగా సంచరించాడు.

తరిగిపోతున్న అడవులతో పర్యావరణపరంగా విపరిణామాలు తలెత్తుతున్న నేపథ్యంలో అంతర్జాతీయంగా అన్ని దేశాలకు చెట్ల పెంపకం ఒక ఎజెండాగా మారిపోయింది. పాలకులు వ్యవస్థాగతంగా చేపట్టిన 'హరితహారం', 'వనమహోత్సవం' కంటే ఈ కార్యాచరణను యాభై ఏళ్ల క్రితమే దరిపెల్లి రామయ్య ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఒంటరిగా చేపట్టడం గొప్ప ఆదర్శంగా గోచరిస్తుంది.

కుమ్మరి సామాజికవర్గానికి చెందిన రామయ్య తల్లిదండ్రులు లాలయ్య–పుల్లమ్మ కులవృత్తిని నమ్ముకొని బతికేవారు. బతుకుదెరువు కోసం వారు ఖమ్మం రూరల్ మండలంలోని ముత్తగూడెం నుంచి ఖమ్మం పట్టణ శివారులోని రెడ్డిపల్లికి వలస వచ్చారు. అక్కడే సర్కారు పాఠశాలలో రామయ్య చేరాడు. ఐదో తరగతిలో మల్లేశం అనే ఉపాధ్యాయుడు చెట్లను నాటడం, వాటిని కాపాడుకోవడం ఎంత ముఖ్యమో బోధించాడు. ఆ మాటలు రామయ్యపై ఎంతో ప్రభావం చూపాయి. అప్పటి నుంచి మొక్కలు నాటడంపై రామయ్య మక్కువ పెంచుకున్నాడు. తొమ్మిదేళ్ల వయస్సులో ఆయనకు జానమ్మతో వివాహమైంది. వయస్సు పెరుగుతున్న కొద్దీ ఆయనలో వనస్పృహ పెరుగుతూ వచ్చింది. జానమ్మతో వివాహమైన తర్వాత, పిల్లలు పుట్టిన తర్వాత కూడా దానిని విడిచిపెట్టలేకపోయాడు. బతకడమే గగనమైన రోజులవి. పని చేస్తేనే పూట గడిచే కుటుంబం వారిది. బతుకుతెరువుకు ఒకవైపు వ్యవసాయం చేస్తూ, ఊరూరా పాలు అమ్ముతూ ప్రవృత్తిగా వనయజ్ఞాన్ని చేపట్టాడు. ఆ తర్వాత అదే తన జీవితమైంది.

రూపాయి ఖర్చు లేకుండా ప్రకృతి ఆలంబనగా రామయ్య సాగించిన వనయజ్ఞం అబ్బురపరుస్తుంది. తొలిదశలో కేవలం మొక్కలను సేకరించి, నాటడం చేస్తే, ఆ తర్వాత వేసవిలో చెట్ల కాయలను, విత్తన గింజలను సేకరించి, వానా కాలంలో ఖాళీ స్థలాల్లో చల్లడం, రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలను నాటడం పనిగా పెట్టుకున్నాడు. రూపాయి రాబడి లేకున్నా మల్లేశం సారు చెప్పిన మాటలు ఆయనలో మొక్కవోని దీక్షను కలిగించాయి.

> "నేను ఒక్కడినే గింజలు ఏరుతున్నప్పుడు, వాటిని విత్తుతున్నప్పుడు అందరూ నన్ను పిచ్చోడు అనుకునేవారు. నేను వారి మాటల్ని పట్టించుకునేవాడిని కాదు. వర్షాలు కురవాలంటే, పవనాలు రావాలంటే చెట్లు ఒక్కటే శరణ్యం. అందువల్ల పచ్చని చెట్లే నాకు లోకంలా మారాయి" – దరిపల్లి రామయ్య



ఖమ్మం చుట్టుపక్కల ప్రాంతాల్లో చెట్ల వెంట, పుట్టల వెంట రామయ్య విత్తనగింజల కోసం రోజంతా తిరుగుతుండేవాడు. తిరిగి వానాకాలంలో ఒక్కడే ఖాళీ స్థలాల్లో చల్లుతూ ఉండేవాడు. సైకిలే ఆయన వాహనం. ఆయన వెనుక ఎవరూ లేరు. ఆయన వెంట ఎలాంటి బృందమూ లేదు. "నేను ఒక్కడినే గింజలు ఏరుతున్నప్పుడు, వాటిని విత్తుతున్నప్పుడు అందరూ నన్ను పిచ్చోడు అనుకునేవారు. నేను వారి మాటల్ని పట్టించుకునేవాడిని కాదు. వర్షాలు కురవాలంటే, పవనాలు రావాలంటే చెట్లు ఒక్కటే శరణ్యం. అందువల్ల పచ్చని చెట్లే నాకు లోకంలా మారాయి," అని ఓ సందర్భంలో తన మనోగతాన్ని వెల్లడించాడు.

రామయ్య మొక్కవోని దీక్షకు ఆయన భార్య జానమ్మ కూడా అనివార్యంగా వెన్నంటి నిలిచింది. దీంతో ఆయన 'ఎకో'పాసన నిర్విఘ్నంగా ముందుకుసాగింది. కుటుంబ బాధ్యతలు, నలుగురు పిల్లల పోషణ, పెళ్లిళ్ల అన్నింటిలో జానమ్మ ముఖ్యపాత్ర వహించింది. జానమ్మ లేకుంటే రామయ్య వనయజ్ఞం అంత సాఫీగా ముందుకు సాగేది కాదు. రామయ్య చెట్టులాంటి వాడైతే, జానమ్మను వేరుగా భావించాల్సి ఉంటుంది. రామయ్యతో ఏడు దశాబ్దాల పాటు జీవనయానం సాగించిన జానమ్మ ఇప్పుడు జీవనదారుల్లో ఒంటరిగా మిగిలిపోయింది.

రామయ్య తన జీవితంలో దాదాపు 50 ఏళ్లు వన యజ్ఞాన్ని ఉధృతంగా సాగించాడు. ఆయన చేతి చలువ వల్ల కోటికి పైగా మొక్కలు పెరిగాయని చెబుతారు. రామయ్య ఆచరించిన వనయజ్ఞం మొక్కలకు సంబంధించి అపార జ్ఞానాన్ని తెచ్చిపెట్టింది. ఆయన 250 రకాల మొక్కల పేర్లను, వాటి గుణగణాలను, ఉపయోగాలను ఏకరువు పెట్టేవాడు. వేప, సుబాబుల్, కానుగ, నిద్రగన్నేరు వంటి మొక్కలను ఆయన ఎక్కువగా నాటగా, చివరి దశలో ఎర్రచందనం, శ్రీచందనం వంటి మొక్కలను కూడా నాటాడు. భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు ఎర్రచందనం, శ్రీచందనం వంటి మొక్కలు ప్రభుత్వానికి ఆర్థిక బడ్జెట్‌లా ఉపయోగపడతాయని ఆయన నమ్మేవారు.

ఒంటరిగా, నిస్వార్థంగా రామయ్య చేసిన కృషికి అంత సులభంగా గుర్తింపు దక్కలేదు. ఆయన పుట్టిన కులమో, ఆయన ఆహార్యమో, ఆయన చదువో... కారణమేదో తెలియదుగానీ, ప్రభుత్వం నుంచి ఆశించిన ప్రోత్సాహం, అండ దక్కలేదు. పర్యావరణంపై ఆయన పెంచుకున్న అలవిమాలిన ప్రేమ ఆయనకున్న భూమిలో మూడెకరాలను హరించి వేయగా, పిల్లలకు ఉన్నతమైన చదువులను అందించలేక పోయింది. రామయ్య ముగ్గురు కుమారుల్లో ఇద్దరు అనారోగ్యంతో చనిపోయారు. వారసులు దిగువ మధ్యతరగతి జీవితాలను అనుభవిస్తున్నారు.


2017లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును బహూకరించిన తర్వాతే రామయ్యకు సమాజంలో గౌరవ మర్యాదలు దక్కాయి. "ఒకప్పుడు నన్ను చూసి ఎగతాళి చేసినవారు పద్మశ్రీ అవార్డు వచ్చిన తర్వాత నాకు నమస్కారం పెట్టడం మొదలుపెట్టారు" అని రామయ్య ఓ సందర్భంలో పేర్కొన్నాడు. రామయ్య ఆచరించిన మార్గాన్ని వారసులు అందిపుచ్చుకోలేదు గానీ, వారు తమ పిల్లలకు మాత్రం తాత స్ఫూర్తితో కబంద పుష్పం, చందన పుష్పం, వనశ్రీ, హరితారణ్య అనే పేర్లు పెట్టుకున్నారు.

రామయ్య కన్నుమూసిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రులు రేవంతరెడ్డి, చంద్రబాబు ఇంకా అనేక మంది ప్రముఖులు సంతాపాలు తెలిపారు. పర్యావరణ సుస్థిరతకు రామయ్య చేసిన కృషి ఎంతో విలువైనదని కొనియాడారు. ప్రభుత్వాలు వ్యవస్థాపరంగా చేయలేని కార్యాన్ని రామయ్య విజయవంతంగా చేసి చూపించాడు. అర్బన్, సెమీ అర్బన్ జీవన విధానం పెరుగుతున్న నేటి జమానాలో సహజ వనాలు మాయమై, కాంక్రీట్ వనాలు విస్తరిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో రామయ్య వేసిన దారిలో నడిచేవారు ఈ సమాజానికి ఎంతో ముఖ్యం. కంచ గచ్చిబౌలిలో పాలకులే వందలాది ఎకరాల్లో వృక్షవిధ్వంసానికి తెగించి పర్యావరణ స్ఫూర్తికి గండికొట్టారు. ఇప్పటికైతే ఈ గండం గట్టెక్కింది గానీ, భవిష్యత్తులో అక్కడ అడవి ఉంటుందో మాయమవుతుందో ఎవరూ చెప్పలేరు.

అందువల్ల అడవుల హననానికి, వృక్ష విధ్వంసానికి విరుగుడుగా ప్రత్యామ్నాయ ప్రక్రియ ఒకటి ఎప్పుడూ కొనసాగుతూ ఉండాలి. అప్పుడే ప్రకృతి సమతౌల్యం సాధ్యం. ఆ ప్రత్యామ్నాయానికి రామయ్య ఆచరించిన యజ్ఞమే ఎప్పటికీ స్ఫూర్తి. ఆయన తాను బతికినన్నాళ్లూ 'వృక్షో రక్షతి రక్షితః' అనే నినాదం గల బోర్డును మెడలో ధరించి జనంలో తిరిగేవారు. ఆయన ప్రదర్శించిన ఆ నినాదమే ఈ సమాజానికి ఎప్పటికీ ప్రాణవాయువు.

● శంకర్‌రావు శెంకేసి
సీనియర్ జర్నలిస్ట్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
మంగళవారం 22 ఏప్రిల్ 2025





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

బీజేపీది గాడ్సే సిద్ధాంతం

- అదానీ, అంబానీలకు రూ.21లక్షల కోట్లను మాఫీ చేశారు
- రైతులకు రుణమాఫీ చేయడానికి చేతులు రాలేదు
- స్వేచ్ఛ, సమానత్వాల పరిరక్షణకు రాహుల్ నాయకత్వాన్ని బలపరచాలి
- ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళనం ముగింపులో మంత్రి సీతక్క

7

పాడైతే మూలకే..

బల్దియా వాహనాల మరమ్మతుల్లో జాప్యం

- నెలలు గడిచినా బల్దియా వెహికిల్ షెడ్డుకే పరిమితం
- సిబ్బంది సాంకేతికతను అంది పుచ్చుకోకపోవడమూ కారణమే..
- విడిభాగాలు, డీజిల్ అడ్డదారిలో విక్రయం
- అన్నీ తెలిసి పట్టించుకోని అధికారులు
- 500వాహనాలకు ఐదుగురే మెకానిక్‌లు



రిపేరుకు వచ్చి శిథిలావస్థకు పోతున్న వాహనాలు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 21 : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ నివాసానికి కూతవేటు దూరంలో ఉన్న బల్దియా వాహనాల (వెహికిల్ షెడ్డు) మరమ్మతు కేంద్రంలో సమస్యలు తాండవిస్తున్నాయి. బాలసముద్రంలోని వెహికల్ షెడ్డు ఏర్పడి సుమారు 20ఏళ్లు గడుస్తున్నా అక్కడి సమస్యల పరిష్కారంలో.. మేయర్, కమిషనర్ ఇస్తున్న హామీలు మాటలకే పరిమితమయ్యాయి. బల్దియా పరిధిలోని సుమారు 500కు పైగా స్వచ్ఛఆటోలు, ట్రాక్టర్లు, టిప్పర్లు, కాంపాక్టర్లు, డంపర్‌ప్లేసర్లు, హుక్‌లోడర్లు నిత్యం మరమ్మతులకు రావడం అక్కడ సాంకేతికతను వినియోగించే మెకానిక్‌లు లేకపోవడం వల్ల మరమ్మతుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఆయా వాహనాల్లో ఏర్పడిన చిన్నపాటి సమస్యకు కూడా ఇక్కడకు తీసుకురావడం.. సమస్యను పరిశీలించిన మెకానిక్‌లు విడిభాగాల కోసం అధికారులకు చెప్పడం వారు పట్టించుకోక పోవడం వల్ల రూ.100 ఖర్చయ్యే సామానుకు కూడా నెల నుంచి రెండు నెలల వరకు పడుతోంది. ఫలితంగా ఆ వాహనం అక్కడే ఉండాల్సి వస్తోంది. షెడ్డును పర్యవేక్షించాల్సిన కిందిస్థాయి అధికారులు ఇతర పనులపై దృష్టి సారించడంతో ఇక్కడకు మరమ్మతు కోసం వచ్చే వాహనాలకు తుప్పు పట్టే పరిస్థితి ఏర్పడుతోంది. అంతే కాకుండా చాలా కాలంగా వెహికిల్ షెడ్డులో దొంగల బెడద అధికమయ్యింది. మరమ్మతు కోసం వచ్చిన వాహనాల నుంచి రాత్రి సమయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు విలువైన వస్తువులు, బ్యాటరీలు, డీజిల్ చోరీ చేస్తున్నా సంబంధిక అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోని మెకానిక్‌లు..

బాలసముద్రంలోని వెహికిల్ షెడ్డులో వాహనాలు రిపేరు చేసేందుకు గతంలో 9 మందిని నియమించారు. కానీ ఇక్కడి అధిక పని భారాన్ని మోయలేమంటూ కొందరు పారిపోయారు. ప్రస్తుతం ఇద్దరు మెకానిక్‌లతో పాటు ఒక హెల్పర్, ఇద్దరు పంక్చర్లు అంటించే ఔట్‌సోర్సింగ్ కార్మికులు మాత్రమే పని చేస్తున్నారు. కనీసం 20 మంది మెకానిక్‌లు 20 మంది పంక్చర్లు వేసే సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉందని అక్కడి సిబ్బంది తెలిపారు. బల్దియా పరిధిలో నడిచే సుమారు 500 వాహనాలకు వీరే అన్నీ అయి రిపేర్లు చేస్తున్నారు. వారికి మరమ్మతు సాధ్యం కాని వాహనాలను అక్కడే వదిలేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఐదు సంవత్సరాల క్రితం నగర పాలక సంస్థకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, సెన్సార్, జీపీఆర్ఎస్ సిస్టంతో కూడిన స్వచ్ఛఆటోలు, ఎక్స్‌కవేటర్లు, కాంపాక్టర్లు, డంపర్ ప్రెజర్లు, బీఎస్-6 వాహనాలు వచ్చాయి. కానీ ఇక్కడి మెకానిక్‌లకు పాత వాహనాలను మాన్యువల్‌గా రిపేరు చేయడం తెలుసు. దీంతో కొత్త వాహనాలు షెడ్డుకు వెళితే రిపేరు చేయడం కష్టంగా మారింది. షెడ్డుకు వెళ్లిన వాహనాలు నెలల తరబడి మూలకు ఉంటున్నాయి. ఈ క్రమంలో ఇదే అదనుగా కొత్తగా వచ్చిన వాహనాలకు చిన్న సమస్య ఏర్పడినా ఇక్కడి అధికారులు ఆటోనగర్, ఉర్సుగుట్ట సమీపంలో ఉన్న షోరూంలకు తరలించి ఎక్కువ బిల్లులు వేసి బల్దియా ఆదాయానికి గండి కొడుతున్నట్లు సమాచారం.

అధికారుల కనుసన్నల్లోనే చోరీలు..

తొమ్మిదెకరాల విస్తీర్ణంలో ఉన్న బల్దియా వాహనాల రిపేరు షెడ్డుకు ప్రతీ రోజు 100 నుంచి 200 వాహనాలు పని పూర్తి కాగానే ఇక్కడే పార్కింగ్ చేస్తారు. ఇదే అదునుగా భావించిన సమీపంలో నివసించే గుర్తు తెలియని వ్యక్తులతో పాటు అక్కడే పని చేసే కార్మికులు డీజిల్, విడిభాగాలు దొంగిలించి బయటి వ్యక్తులకు విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో డీజిల్, విడిభాగాలు, బ్యాటరీలు చోరీ చేస్తూ పట్టుబడ్డ వ్యక్తులను గుర్తించి విధుల నుంచి తొలగించినా ఇంకా కొందరి ప్రవర్తనలో మార్పు రావడం లేదు. సీసీ కెమెరాలు, సెక్యూరిటీ ఉన్న చోరీలు జరుగుతుండడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. ఇదంతా కొందరు ఇంజనీరింగ్ అధికారులు, వారికి సహాయకులుగా పని చేస్తున్న వారి పనే అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చిన డబ్బులతో వాటాలుగా పంచుకుంటారనే విమర్శలు వస్తున్నాయి. ఇక్కడి నిర్లక్ష్యాన్ని నియంత్రించాల్సిన బాధ్యత వరంగల్ మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేపై ఎంతైనా ఉందని ప్రజలు భావిస్తున్నారు.

వాహనాలు ఇక్కడ.. మరి డ్రైవర్లు ఎక్కడ?

బల్దియాలో 200 ప్రభుత్వ స్వచ్ఛఆటోలు, 163 ఓనర్ కం డ్రైవర్ స్వచ్ఛఆటోలు, 73 ట్రాక్టర్లు, 12 ఎక్స్‌కవేటర్లు, 8 టిప్పర్లు, 13 కాంప్యాక్టర్లు, 10 డంపర్ ప్రెసర్లు, 12 స్వీపింగ్ మిషన్లు, 6 హుక్‌లోడర్లతో పాటు ఇతర విభాగాలను కలుపుకొని సుమారు 500వాహనాలున్నాయి. ఒక్కో వాహనాన్ని నడిపేందుకు ఒక డ్రైవర్‌ను బల్దియా కార్యాలయం నుంచి ప్రభుత్వ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించారు. ప్రస్తుతం 200కు పైగా స్వచ్ఛఆటోలు, ఇతర వాహనాలు షెడ్డుకు రాగా ఇక్కడ మరమ్మతు కాని వాహనాలను షోరూంలకు పంపించారు. కొన్ని వాహనాలు రెండు, మూడు నెలలుగా అక్కడే ఉంటున్నాయి. కానీ మరమ్మతులకు వెళ్లిన వాహనాల డ్రైవర్లు విధులకు హాజరు కాకుండా ఎక్కడో ఒక చోట బయోమెట్రిక్ హాజరు వేసుకుని విధులకు డుమ్మా కొడుతున్నారు. ఈ క్రమంలో వాహనాలు ఇక్కడ? మరి డ్రైవర్లు ఎక్కడ? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంకా కొందరు స్వచ్ఛఆటోలు, వాహనాల డ్రైవర్లు సంఘం నాయకుల ముసుగులో చలామణి అవుతూ విధులకు రాకుండా సొంత పనులు చక్కదిద్దుకుంటున్నట్టు తెలుస్తోంది. పని చేయకుండానే నెలనెల నిక్కచ్చినా జీతాలు తీసుకుంటున్నవారిని బల్దియా అధికారులు గుర్తించి విధుల నుంచి తొలగించాలి.



తుప్పుపట్టి పోతున్న వాహనాలు

సిబ్బంది సరిపడా ఉన్నారు..

శివానంద్, డీఈ, వెహికిల్ షెడ్డు

మా వద్దకు వచ్చే వాహనాలకు చిన్నపాటి రిపేర్లు ఉంటే ఇక్కడే చేస్తాం. మేజర్ సమస్య ఉంటే కొద్ది రోజులు చూసిన తర్వాత షోరూంకు పంపుతాం. అక్కడ రిపేరు చేసిన తర్వాత డ్రైవర్‌కు బండి అప్పగిస్తాం. ప్రస్తుతం ఇక్కడ సరిపడా సిబ్బంది పని చేస్తున్నారు. వాహనాల మరమ్మతులో ఎలాంటి జాప్యం లేకుండా చూస్తున్నాం. ఇక దొంగల బెడద కూడా ఏమీ లేదు.

నేడు ఎల్కతుర్తికి కేటీఆర్ రాక



ఎల్కతుర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రజతోత్సవ మహాసభ ఏర్పాట్లను పరిశీలించేందుకు గాను మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తికి రానున్నారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో రానున్న ఆయన సభా ప్రాంగణం, వేదిక తదితర ఏర్పాట్లను పరిశీలించనున్నారు. అనంతరం బీఆర్ఎస్ ముఖ్య నేతలతో సమావేశమవుతారని, సభ నిర్వహణ, ప్రజల రవాణా సౌకర్యాలపై దిశానిర్దేశం చేస్తారని తెలుస్తోంది.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

- రూ.50 కోట్లతో రీజనల్ సైన్స్ సెంటర్ అభివృద్ధి
- మండలానికొక తెలంగాణ పబ్లిక్ స్కూల్
- సన్మాన సభలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి



శ్రీపాల్‌రెడ్డి దంపతులను జ్ఞాపికతో సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గీసుగొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా తాను పనిచేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి అన్నారు. వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొని ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా ఆయన పనిచేసిన వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేట హవేలి జడ్పీ పాఠశాలలో శ్రీపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ నవిత దంపతులను సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంచేందుకు వరంగల్ రీజినల్ సైన్స్ సెంటర్‌ను రూ.50 కోట్లతో అభివృద్ధి చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి కృషిచేస్తానన్నారు. నియోజకవర్గంలో నిర్మించే ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో పాటు ప్రతీ మండలానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్)ను రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రతి టీపీఎస్‌లో 1500 మంది విద్యార్థులకు చదువుకునే అవకాశం కల్పిస్తుందని తెలిపారు. అందులో చదవుకునే విద్యార్థులందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యంతో పాటు అన్ని వసతులను కల్పించేందుకు ప్రభుత్వం ఆలోచనలు చేస్తుందన్నారు. విద్యాశాఖ సీఎం వద్ద ఉన్నందున సీపీఎస్ రద్దుతో పాటు ఉపాధ్యాయుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. హెల్త్ కార్డులు, పెండింగ్ బిల్లులు వెంటనే ఇప్పించడంతో పాటు ప్రతీ సంవత్సరం ప్రమోషన్‌లు జరిగేవిధంగా చూస్తానన్నారు. శాయంపేట పాఠశాలకు వచ్చిన తరువాతనే పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఎమ్మెల్సీగా ఎన్నికయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీగా ఎన్నిక కావడానికి సహకరించిన ఉపాధ్యాయులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శాయంపేట పాఠశాలను కార్పొరేట్‌స్థాయిలో అభివృద్ధి పరిచేందుకు వ్యక్తిగతంగా తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సంపత్‌రావు, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, పీఆర్టీయూ వరంగల్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఈదునూరి రవీందర్ రెడ్డి, మండల తిరుపతిరెడ్డి, కార్యదర్శులు ఎమ్డీ.గఫార్, పలిత శ్రీహరి, ఎఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్, పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కల్లూరి వెంకటేశ్వర్లు, మార్త శ్రీనివాస్, హెచ్ఎంలు రాజేశ్వరీ, మోహన్ రావు, విటోబా, సంఘం నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, విజయ్‌కుమార్, వెంకట్రావ్, ఫరీద్, జ్యోష్ణప్రభ, మాలతి, పష్పలత, ఎస్ఎంసీ చైర్మన్ గాలి స్రవంతి, గ్రామ కార్యదర్శి రవికర్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో చితికిపోతున్న బతుకులు

- ప్రజలు పోరాటం చేయాలి : ఎమ్మెల్సీ కోదండరామ్
- మాణిక్యాపూర్‌లో డ్రగ్స్ నిర్మూలన 'పోరుయాత్ర' ప్రారంభం



మాణిక్యాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరామ్

భీమదేవరపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌కు అలవాటు పడి యువత బతుకులు చితికిపోతున్నాయి.. డ్రగ్స్‌పై పోరాటానికి చేతులు కలుపుదామని ఎమ్మెల్సీ కోదండరామ్ పిలుపునిచ్చారు. సోమవారం భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్ గ్రామంలో జేఏసీ, మహిళా, దళిత, బహుజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర కార్యక్రమాన్ని కోదండరామ్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. గ్రామంలోని మహిళలు, ప్రజలు ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. మాణిక్యాపూర్ నుంచి గాంధీనగర్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం గాంధీనగర్ బస్టాండ్ వద్ద కోదండరామ్ మాట్లాడారు. డ్రగ్స్‌తో ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా యువత చిత్తవుతున్నారని, కొందరు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది బడా నాయకులు డ్రగ్స్ మాఫియాను విస్తరిస్తూ యువత ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. అలాగే ఆన్‌లైన్ లోన్ యాప్‌ల ద్వారా అప్పులు తీసుకొని వందలకు వేలు, వేలకు లక్షలు మిత్తిలు కట్టలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు కోకొల్లలు చూస్తున్నామన్నారు. అనంతరం ఈ ర్యాలీ రత్నగిరి, రంగయ్యపల్లి, వంగర గ్రామాలకు చేరుకున్నాయి. కార్యక్రమంలో జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, మండల కన్వీనర్ డ్యాగల సారయ్య, ఎస్ఐ సాయిబాబు, ఏపీఎం దేవానంద్, ఏపీవో కుమారస్వామి, చెప్యాల ప్రకాష్, కేతిరి లక్ష్మారెడ్డి, షబానా, కళావతి, రజిత, సతీష్, సదానందం, నాగమణి, కరుణాకర్, బాలసుందర్, ఉప్పుల కుమారస్వామి, మాట్ల వెంకటస్వామి, ఎదులాపురం తిరుపతి, తాళ్లపల్లి ఆశీర్వాదం, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్ పూర్తి చేయాలి

- మండలానికి నలుగురు అధికారుల నియామకం
- కలెక్టర్ ప్రావీణ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వెరిఫికేషన్ ఈ నెల 22 నుంచి 30 వరకు పూర్తి చేయాల ని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు నియమితులైన మండల స్థాయి వెరిఫికేషన్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రతీ మండలంలో నలుగురు అధికారులను వెరిఫికేషన్ ఆఫీసర్లుగా నియమించడం జరిగిందన్నారు. గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపికకు ఇప్పటి వరకు ఇందిరమ్మ కమిటీ సభ్యులతో పాటు ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారని, ఇప్పుడు మండల స్థాయిలో వెరిఫికేషన్ ఆఫీసర్లు పరిశీలించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు సమర్పించిన వివరాలు రాష్ట్రస్థాయిలో పరిశీలనలో ఉన్నాయని, మూడు కేటగిరిల లిస్టులను ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు అర్హుల జాబితా పరిశీలిస్తారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపిక చేసే లబ్ధిదారుల్లో మహిళల పేర్లను మాత్రమే అర్హుల జాబితాలో పెట్టాలని, వారి వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ పథకానికి రేషన్ కార్డు తప్పనిసరి కాదు అని, దీనిపై ప్రభుత్వ మార్గదర్శకాలు ఇంకా రాలేదన్నారు. లబ్ధిదారులు బీపీఎల్ అయి ఉంటే చాలునని, లబ్ధిదారుల ఎంపికలో వెరిఫికేషన్ అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. వెరిఫికేషన్ అధికారులకు ఏమైనా సందేహాలు ఉంటే ఎంపీడీవో, హౌసింగ్ పీడీలను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. వెరిఫికేషన్ కోసం క్షేత్రస్థాయిలో వెళ్లినప్పుడు చుట్టుపక్కల వారిని కూడా వీరు అర్హుల కాదా అనేది విచారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి రవీందర్, సంబందిత అధికారులు, ఎంపీడీఓలు, తహశీల్దార్లు, ఏఈలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీబ్యాగులు అందుబాటులో ఉంచాలి

జిల్లాలోని ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో సరిపోను గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం సంబంధిత శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ అకాల వర్షాలు పడే అకాశాలు ఉన్నందున ఈ సౌకర్యాలు చాలా అవసరమన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ప్యాడీ క్లీనర్‌తో పాటు తేమశాతాన్ని కొలిచే మాశ్చరైజర్ విఫషన్ ఉండాలన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను తరలించే విల్లులకు ట్యాగింగ్ చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేప ట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువ
- 128 దరఖాస్తులు స్వీకరించిన అధికారులు



సీపీఎం నాయకుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అందించే ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అప్పుడే ప్రజల సమస్యలకు పరిష్కార మార్గం లభిస్తుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరై ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఇటీవల నగరంలో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి తరుచుగా ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రధానంగా టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యం వీడాలని అన్నారు. వేసవిలో మంచి నీటి సమస్య రాకుండా ఇంజనీరింగ్ అధికారులు ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 128 ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు ప్రజలు హాజరై సమస్యలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, హెచ్‌వోలు రమేష్, లక్ష్మారెడ్డి, టీవో వై. రామకృష్ణతో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్-37, హెల్త్, టౌన్ ప్లానింగ్-55, శానిటేషన్-9, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ-14, తాగునీటి సరఫరా-12, హార్టికల్చర్-1 ఇలా మొత్తం 128 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు..

వరంగల్ మండిబజార్ కౌసర్ మసీదు గల్లీలో తమ ఇంటి ఎదుట ఎదురుగా ఉన్న ఇళ్లకు సంబంధించిన మురికి నీరు ప్రవహిస్తోంది. మురికి నీరు కారణంగా దోమలు, ఈగలు, క్రిమీ కీటకాలు రావడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని ఎమ్డీ మహమూద్ అలీ ఫిర్యాదు చేశాడు.

- గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పైడిపెలి శివారు రాఘవేంద్రనగర్, ఆర్టీసీ కాలనీలలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించకపోవడం వల్ల స్థానిక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ప్రజలు సుమారు 30 సంవత్సరాలుగా నివసిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బల్దియా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లు, డ్రైనేజీలు వేయాలని రెండు కాలనీల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.
- గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్‌లో స్ట్రీట్ లైట్ల సమస్య ఉంది. వెలిగితే వారం పాటు 24 గంటలు వెలుగుతూనే ఉన్నాయని, ఆఫ్ చేస్తే పట్టించుకునే వారు లేరు. ఈ సమస్యలు బల్దియా సిబ్బంది పట్టించుకున్న పాపాన పోలేదని స్థానిక కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ పరిధిలో 2500 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారని వారికి నెలకు 4 చీపుర్లు, పీపీ కిట్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకులు సింగారపు బాబురావు కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందించారు.



గవిచర్ల గ్రామంలో పర్యటిస్తున్న స్వర్ణ

రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ పౌరుడి బాధ్యత

కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు స్వర్ణ

సంగెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ పౌరుని బాధ్యతగా వ్యవహరించాలని కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ చెప్పారు. సోమవారం మండలంలోని గవిచర్ల గ్రామంలో మండల పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రతీ ఒక్కరు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. అంబేద్కర్ ఆలోచన విధానాలను అమలు చేయడంలో ప్రముఖ పాత్రను పోషించాలని అన్నారు. ప్రతీ గ్రామంలోని ప్రతీ ఒక్కరు రాజ్యాంగానికి జరుగుతున్న ప్రమాదాలను వివరించాలన్నారు. అహింసా పద్ధతిలో పోరాటం చేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన నాటి పోరాట యోధులను గుర్తుంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటు రమేష్, జిల్లా అధికార ప్రతినిధి రావుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కందకట్ల కళావతి, మాజీ జడ్పీటీసీ గుగులోతు వీరమ్మ, మండల మహిళ అధ్యక్షురాలు సంధ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అచ్చ నాగరాజు, నర్సింహనాయక్, పాష, జగన్నాథ చారి, బాసిపాక సదయ్య తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి మాత విగ్రహం తయారీ పూర్తి

మహదేవపూర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జయశంకర్ జిల్లాలోని మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు మహా బలిపురంలో వీఐపీ ఘాట్ వద్ద నిర్మిస్తున్న సరస్వతి అమ్మవారికి విగ్రహం తయారీ పూర్తయ్యింది. దాదాపు నెలరోజుల కింద ఈ విగ్రహానికి ఆలయ అధికారులు బలిపురానికి వెళ్లి అమ్మవారి విగ్రహానికి ఆర్డర్ ఇచ్చారు. అయితే విగ్రహం తయారీ పూర్తయిందని దేవాదాయ శాఖ అధికారులకు సమాచారం అందింది. ఈ నెల 30న విగ్రహాన్ని కాళేశ్వరం తీసుకురానునట్టు తెలిసింది. వీఐపీ ఘాట్ వద్ద భక్తులు స్నానాలు ఆచరించి సరస్వతి విగ్రహాన్ని దర్శించుకుని కాళేశ్వరాలయానికి వెళ్తారు.

కొండపర్తిలో గవర్నర్ కార్యదర్శుల బృందం

అభివృద్ధి పనుల పరిశీలన

తాడ్వాయి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ దత్తత తీసుకున్న గ్రామం కొండపర్తిని ఆయన ప్రత్యేక కార్యదర్శులు భవాని శంకర్, పవన్ సింగ్, గోవిందదాస్ సోమవారం సందర్శించారు. అధికారులతో కలిసి అభివృద్ధి పనులు, బహుళ ఉపయోగ యంత్రాలను పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బహుళ ఉపయోగాల యంత్రాలు మసాల తయారీ యూనిట్, టైలరింగ్ సెంటర్‌ను సందర్శించారు. మహిళా సంఘం సభ్యులతో సమావేశమై ఆయా యూనిట్ల ఉపయోగాలు, సమస్యలు, అవసరాలు అడిగి తెలుసుకున్నారు. మసాల యూనిట్ అభివృద్ధి చేయడానికి వృత్తి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ మధుకర్‌తో పలు అంశాలపై మాట్లాడారు. ఇంకా కావల్సిన అవసరాలు, మార్కెటింగ్ ఏర్పాట్లు, పనుల విధానం అడిగి తెలుసుకున్నారు. మిర్చి, పసుపు కొనుగోలు చేయడానికి, నిల్వా చేయడానికి మరింత అదిక వనరులు, సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సంస్థ ఆధ్వర్యంలో మసాలాలు గ్రైండింగ్ చేయడం, టైలరింగ్ శిక్షణ తరగతులు కొనసాగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగం ఈఈ వీరభద్రం, వృత్తి సంస్థ విలేజ్ కోఆర్డినేటర్ సూదికొండ గణేష్, సంఘాల సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బహుళ ఉపయోగ యంత్రాలను పరిశీలిస్తున్న గవర్నర్ సెక్రటరీల బృందం

రాష్ట్రాన్ని ఆగం చేస్తే కేసీఆర్ ఊరుకోరు

- కుట్రలు, కుతంత్రాలతో కాంగ్రెస్ పాలన
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ఎల్కతుర్తిలో రజతోత్సవ సభా స్థలం పరిశీలన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సభ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఎల్కతుర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని కాంగ్రెస్ పాలకులు ఆగం చేస్తుంటే.. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చూస్తూ ఊరుకోరని, ఆయన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ నెల 27న సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్ కుమార్, సభ ఇన్‌చార్జ్ బాలమల్లుతో కలిసి సోమవారం పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. 25 వసంతాల గులాబీ సభ కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగుబాటు సభగా ప్రజలు అభివర్ణిస్తున్నారని, దేశానికి కరువు వస్తే తెలంగాణ నుంచి అన్నం పెట్టే స్థాయికి రాష్ట్రాన్ని కేసీఆర్ తీసుకెళ్లారని గుర్తు చేశారు. ఉద్యమాలకు పురిటిగడ్డయిన వరంగల్‌లో సభ నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. కుట్రలు, కుతంత్రాలతో రేవంత్ పాలన సాగిస్తున్నారని, ఇంకా మూడున్నరేళ్ల కాంగ్రెస్‌ను ఎలా భరించాలంటూ ప్రజలు మనోవేదనకు గురవుతున్నారన్నారు. మోసపూరిత హామీలతో ప్రజలు విసుగు చెంది తిరిగి కేసీఆర్ పాలనను బలంగా కోరుకుంటున్నారన్నారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టులను నిర్వీర్యం చేయడంతో పాటు శ్రీశైలం నీటిని పక్క రాష్ట్రానికి తరలించి తెలంగాణను ఎడారిగా మార్చారని ఆరోపించారు. ఫలితంగా కేసీఆర్ పదేళ్ల కష్టం వెనక్కి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మోసగాళ్ల పాలనపై ప్రజల్లో విరక్తి : ఎర్రబెల్లి దయాకర్‌రావు

అధికారంలోకి రాగానే హామీలను నెరవేరుస్తామని చెప్పి అమలు చేయని మోసగాళ్ల పాలనపై ప్రజలు విరక్తి చెందారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. ఎల్కతుర్తిలో జరుగుతున్న బీఆర్‌ఎస్ సభ ఏర్పాట్లను సోమవారం ఆయన మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. సభ ఏర్పాట్లపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను దొంగల చేతిలో పెట్టామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. తిరిగి రాష్ట్రాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. 27న నిర్వహించే గులాబీ పండుగకు లక్షలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. రాష్ట్ర నాయకులు తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు, నాగుర్ల వెంకన్న, చింతం సదానందం, మండల నాయకులు జడ్సన్, నగేష్, మహేందర్, స్వామి, శేషు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు కళ్లు మూసుకున్నారా ?

- వేలాది ట్రిప్పుల మట్టి తరలింపుపై ఎందుకు సమాచారం లేదు
- కలెక్టర్, ఆర్డీవో, ఏడీ మైనింగ్ అధికారులపై ఫైర్
- సభ కోసం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రూ. 50 లక్షల డిమాండ్
- ఉద్యమం పేరుతో బీఆర్‌ఎస్ నాయకుల బెదిరింపులు
- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

ఎల్కతుర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సభకు అక్రమంగా మట్టిని తరలిస్తుంటే కళ్లు మూసుకున్నారా ? అంటూ అధికారులపై వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ధ్వజమెత్తారు. సోమవారం ఎల్కతుర్తి మండల పరిధిలోని ఇందిరానగర్, సుర వైన్స్ సమీపంలో బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభ కోసం వచ్చే వాహనాల పార్కింగ్ నిర్వహణలో భాగంగా పూడ్చిన దేవాదుల కాలువలను ఆయన పరిశీలించారు. బీఆర్‌ఎస్ సభకు ఎక్కడి నుంచి మట్టిని తరలించారు. ప్రభుత్వానికి ఎంత రాయల్టీ కట్టారని కలెక్టర్ ప్రావీణ్య, ఆర్డీవో రమేష్‌రాథోడ్, మైనింగ్ ఏడీలకు ఫోన్‌లో ఆరా తీశారు.

దీంతో తమ వద్ద ఎలాంటి అనుమతులు తీసుకోలేదని, మట్టి తరలింపుపై తమకు సమాచారం లేదని అధికారులు బదులిచ్చారు. దీంతో మండిపడ్డ ఎమ్మెల్యే మట్టి తరలింపునకు సంబంధించిన పూర్తి వివరాలు తనకు వెంటనే తెలియాలని డిమాండ్ చేశారు. తమ పరిధిలో జరుగుతున్న పనులపై సమాచారం లేకుండా ఎందుకు పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడారు. పెద్ద మొత్తంలో మట్టిని అక్రమంగా సభలకు తరలించడం, ప్రభుత్వ కాలువలు, వాగులను పూడ్చుతుంటే అధికారుల ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. మట్టి తరలింపుపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ప్రభుత్వమన్నారు. రైతులకు నష్టం చేస్తే ఎవరిని ఉపేక్షించేది లేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఉద్యమం పేరు చెప్పుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తన పరిధిలో ఓ వ్యాపారిని సభ నిర్వహణకు రూ. 50 లక్షలు ఇవ్వాలంటూ బెదిరించినట్లు ఆరోపించారు. దీనిపై ఫిర్యాదులు సైతం వచ్చాయని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ సంపదను ధ్వంసం చేశారన్నారు.

కాంగ్రెస్‌పై నిందలు మోపడం మానుకోవాలని హితవుపలికారు. బీఆర్‌ఎస్ సభను అడ్డుకోవాలనే ఆలోచన తమకు లేదన్నారు. సభకు అనుమతివ్వకుంటే కోర్టుకు వెళ్లి అనుమతులు తెచ్చుకున్నామనడం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, టీపీసీసీ సభ్యుడు బొమ్మనపెల్లి అశోక్‌రెడ్డి, నాయకులు సంతాజీ, గోలి రాజేశ్వర్‌రావు, డాక్టర్ రమేష్, అంబాల శ్రీకాంత్, నవీన్, గొలిపెల్లి సంపత్, దుగ్యాల రాజేశ్వర్‌రావు, పెండ్యాల తిరుపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని శాంతి భద్రతల విషయంపై సీపీతో చర్చించారు. సీపీని కలిసిన వారిలో మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మరెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, నాయకులు అరణ్యరెడ్డి, సంపత్, రుత్విక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పదవి సగరులకే కేటాయించాలి

రాంనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) :తెలంగాణ కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పదవిని సగరులకే కేటాయించాలని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం హనుమకొండ కేయూ గేటు ఎదురుగా ఉన్న ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సగర సంక్షేమ ట్రస్టు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సగర కుల గురువైన భగీరథ మహర్షి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ భగీరథ మహర్షి విగ్రహాలను అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల హరికిషన్, గౌరక్క సత్యం, కుమారస్వామి, గాండ్ల స్రవంతి, విద్యాసాగర్, రవిందర్, సతీష్ పాల్గొన్నారు.

నాలుగు క్రూ లింకులు విజయవాడకు తరలింపు

ఆందోళనలకు సిద్ధమవుతున్న రైల్వే కార్మిక సంఘాలు

కాజీపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట జంక్షన్ నుంచి నాలుగు క్రూ లింకులను విజయవాడకు తరలించేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే కార్మిక నాయకులు తెలిపారు. కాజీపేట క్రూ కేంద్రంగా కృష్ణా, కోణార్క్, ఎల్‌టీటీ, గౌతమి ఎక్స్‌ప్రెస్‌ల లింకులు విజయవాడ నుంచి సికింద్రాబాద్, సికింద్రాబాద్ నుంచి విజయవాడ మధ్య విధులు నిర్వర్తించేవి. రైల్వే అధికారులు ఈ నాలుగు క్రూ లింకులను విజయవాడకు తరలించడంతో మంగళవారం నుంచి విజయవాడ రైల్వే డివిజన్‌కు చెందిన డిపో నుంచి లోకో పైలెట్లు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ మధ్యనే కాజీపేట క్రూ డిపో నుంచి 185 మంది లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లు, ఇన్‌స్పెక్టర్ల ఖాళీలు ఇతర డిపోకు తరలించడంతో కార్మిక సంఘాలు నిరసన చేపట్టాయి. ఓవైపు కాజీపేట జంక్షన్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉన్న క్రమంలో ఇక్కడి నుంచి ఉద్యోగ ఖాళీలు, క్రూ లింకులను తరలిస్తుండడంతో కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది.

ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన కల్పించాలి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ (ల్యాండ్ రెగ్యులేషన్ స్కీం)పై ప్రజలకు అవగాహన కల్పించాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం బల్దియా కార్యాలయంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. ఈ నెల 30 వరకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపులలో 25 శాతం రిబేట్ ఉందని ప్రజలు గ్రహించి ఫీజులు చెల్లించాలని అన్నారు. బల్దియా పరిధిలో లక్షకు పైగా దరఖాస్తులు రాగా 24,670 మంది ఫీజులు చెల్లించారని అన్నారు.

టీటీఐ కేంద్రాన్ని సందర్శించిన రామగుండం ట్రాఫిక్ పోలీసులు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌ను సోమవారం రామగుండం ట్రాఫిక్ పోలీసులు సందర్శించారు. రామగుండం కమిషనరేట్‌లో నూతనంగా ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో వరంగల్‌లో కమిషనరేట్‌లో టీటీఐ ఏ విధంగా నిర్వహిస్తున్నారనే దానిపై అధ్యయనం చేసేందుకు వచ్చినట్లు ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించాల్సిన రికార్డులు, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వాహనాదారులకు ఏ విధంగా కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంటుందనే అంశాలపై ట్రాఫిక్ పోలీసులకు ఏసీపీ అవగాహన కల్పించారు.

చీటింగ్‌కు పాల్పడిన వ్యక్తికి మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : చిట్టీ డబ్బులు ఇవ్వకుండా మోసానికి పాల్పడిన వ్యక్తికి మూడేళ్ల జైలు, రూ. 10 వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా సెషన్స్ జడ్జి వీబీ నిర్మల గీతాంబ సోమవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ ఏకశిల నగర్‌కు చెందిన పెద్ది హరికృష్ణ అదే ప్రాంతానికి చెందిన గాదె లక్ష్మణ్ వద్ద చిట్టీలో చేరాడు. రూ. 50 వేల చొప్పున సుమారు రూ. 11 లక్షలు చెల్లించాడు. వ్యాపార నిమిత్తం చిట్టీ డబ్బులు కావాలని ఎన్నిసార్లు అడిగినా ఇవ్వకుండా చంపుతానని బెదిరించడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అదే విధంగా మరో వ్యక్తి కరీమాబాద్‌కు చెందిన కానిస్టేబుల్ దేవులపెల్లి సంపత్‌కుమార్ కూడా నిందితుడు గాదె లక్ష్మణ్ చిట్టీలో చేరాడు. అనంతరం రూ. 3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. చిట్టి డబ్బులు , అప్పుగా తీసుకున్న మొత్తం రూ. 5లక్షల 60 వేలు ఇల్లు నిర్మాణం కోసం డబ్బులు ఇవ్వాలని అడుగగా డబ్బులు ఇవ్వకపోగా చంపుతానని బెదిరించాడు. దీంతో ఇరువురు చేసిన ఫిర్యాదు మేరకు నిందితుడు లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ డి. ప్రతాప్ సాక్షులను ప్రవేశపెట్టగా సీఐలు ఎం. శ్రీనివాస్, జె. వెంకటరత్నం దర్యాప్తు అధికారులుగా వ్యవహరించారు. లైజన్ అధికారిగా ఏఎస్సై కె. హరికృష్ణ వ్యవహరించగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.

డిగ్రీ పరీక్షల నిర్వహణపై మల్లగుల్లాలు

నేడు నిర్ణయం వెలువరించే అవకాశం

వీసీ అందుబాటులో లేకపోవడంతో నిర్ణయం వాయిదా

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ రెగ్యులర్ బీఏ, బీకామ్, బీఎస్సీతో పాటు ఇతర కోర్సుల సెమిస్టర్ పరీక్షలపై మల్లగుల్లాలు కొనసాగుతున్నాయి. సోమవారం (ఏప్రిల్ 21) నుంచి షురూ కానున్న డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్, 1,3, 5 బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రైవేట్ కళాశాలల సహాయ నిరాకరణ నేపథ్యంలో ఆకస్మికంగా వాయిదా పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం గత 4 ఏళ్ళుగా తమకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించకపోవడమే పరీక్షల వాయిదాకు అడ్డంకిగా మారిందనేది నిర్వివాదమైన అంశం. రాష్ట్ర స్థాయిలోని ప్రధానమైన ప్రవేశ పరీక్షలైన ఐసెట్, లాసెట్‌తో ఇతర కోర్సుల షెడ్యూల్ విడులైంది. దీంతో కేయూ డిగ్రీ పరీక్షలు పూర్తి చేయాల్సిన అనివార్య పరిస్థితి ముంచుకు వస్తోంది. డిగ్రీ ఫలితాలపైనే ఆయా ప్రవేశ పరీక్షలు, అడ్మిషన్ల ప్రక్రియ ఆధారపడి ఉంటోంది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌తో పరీక్షలు ముడిపడి ఉండటంతో కేయూ అధికారులు పరీక్షల నిర్వహణ పట్ల కృతనిశ్చయంతో పకడ్బందీగా సరైన ఆలోచనలు చేస్తున్నారు.

వర్సిటీ ఉన్నతాధికారులు, పరీక్షల నియంత్రణాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సిద్ధం అయ్యారని సమాచారం. ఆఖరు ఏడాది 5, 6వ సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు సిద్ధమవుతున్నారు. కేయూ పరిధిలోని డిగ్రీ సెమిస్టర్ పరీక్షల వాయిదాల నేపథ్యంలో వర్సిటీ ఉన్నతాధికారులు వర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశాన్ని మంగళవారం (ఏప్రిల్ 22న) కేయూలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు పరీక్షల నిర్వహణకు సహకరించకపోవడాన్ని ప్రస్తావించనున్నారు. 24న వర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించనున్నారు. కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డితో మంగళవారం పరీక్షలపై చర్చించి తుది నిర్ణయం వెలువరించనున్నారు.

ఏసీబీకి చిక్కిన ఎంఆర్ఐ

- వారసత్వ భూమి పట్టా కోసం డబ్బులు డిమాండ్
- లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- జనగామ జిల్లా చిలుపూర్ మండలంలో ఘటన

చిలుపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వారసత్వంగా వచ్చిన భూమిని పట్టాచేయడం కోసం ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ చిలుపూరు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. జనగామ జిల్లా చిలుపూర్‌లో సోమవారం జరిగిన ఈ ఘటన కలకలం సృష్టించింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆవుల బుచ్చయ్య 10 నెలల క్రితం చనిపోగా, అతని పేరిట 1.23 గుంటల భూమి ఉంది. ఈ భూమిని వారసత్వ పట్టా చేయడం కోసం అతని కుమారులు లింగయ్య, రాజయ్య పలుమార్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వినీత్‌కుమార్‌ను సంప్రదించారు. భూమిని సర్వే, మ్యుటేషన్ చేయడం కోసం ఆర్ఐ వారిని డబ్బులు డిమాండ్ చేయగా దీంతో వారు ఏసీబీని ఆశ్రయించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న కారులో ఆర్ఐ రూ. 26 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ దాడుల్లో సీఐలు సట్ల రాజు, ఎల్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వినీత్‌కుమార్

పోలీస్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం



సువర్ణను సత్కరిస్తున్న సీపీ

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో రాణించే పోలీస్ క్రీడాకారులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. గత మార్చిలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన 18వ జాతీయ పోలీస్ షూటింగ్ (స్పోర్ట్స్) చాంపియన్‌షిప్‌నకు తెలంగాణ తరుపున ప్రాతినిధ్యం వహించి 300మీటర్ల మహిళా జట్టు విభాగంలో సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఏఎస్సై సువర్ణ సిల్వర్ మెడల్ సాధించింది. ఈ మేరకు మెడల్‌తో వచ్చి సీపీని సోమవారం కలవగా ఘనంగా సత్కరించి భవిష్యత్‌లో రాణించేందుకు సహకరిస్తానని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి పాల్గొన్నారు.

వాచ్‌మన్‌కు 20 ఏళ్ల జైలు

బాలికపై లైంగిక దాడి కేసులో శిక్ష ఖరారు

హసన్‌పర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): 7వ తరగతి చదువుతున్న బాలికకు మాయమాటలు చెప్పి శారీరకంగా లోబర్చుకున్న హాస్టల్ వాచ్‌మన్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ హనుమకొండ అదనపు జిల్లా జడ్జి అపర్ణదేవి సోమవారం తీర్పు చెప్పారు. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు కథనం ప్రకారం.. వడ్డెపల్లి చర్చి సమీపంలోని ఎస్‌డీ ఆశ్రమ పాఠశాలలో తల్లిని కోల్పోయి ఉన్న బాధిత బాలిక చదువుకునేది. అదే పాఠశాలలో వాచ్‌మన్‌గా పని చేస్తున్న భూపాలపల్లి జిల్లా ఘనపురం మండలం రవినగర్‌కు చెందిన నిందితుడు ఆకుల సాంబ బాలికతో పరిచయం ఏర్పర్చుకున్నాడు. ప్రేమిస్తున్నానని నమ్మించి అభం శుభం తెలియని బాలికను వేములవాడకు తీసుకెళ్లి అక్కడి సత్రంలో పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. మోసం గ్రహించిన బాలిక సీతంపేటలోని తన మేనమామకు విషయం తెలిపింది. హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిపై 2019 అక్టోబర్ 6న ఫిర్యాదు చేశారు. అప్పటి కాజీపేట ఏసీపీ రవీంద్రనాయక్ పోక్సో కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలతో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్ష్యుల్ని విచారించిన న్యాయమూర్తి సాంబకు 20సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించారు. అఘాయిత్యానికి గురైన బాలిక భవిష్యత్ కోసం రూ.4లక్షల ఆర్థిక సాయాన్ని బాలికకు ప్రభుత్వం ద్వారా ఇప్పించాలని న్యాయ సేవాధికార సంస్థను ఆదేశించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి వాదించగా కోర్టు డ్యూటీ హెడ్ కానిస్టేబుల్ వలబోజు రవీందర్ సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టారు.

వడ దెబ్బతో వ్యవసాయ కూలీ మృతి



శ్రీదేవి

సంగెం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ గీసగోని శ్రీదేవి(36) ఎండ, వడ దెబ్బకు మృతి చెందారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. శ్రీదేవి ఆదివారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లింది. ఎండవేడిమికి తాళ లేక వాంతులు, విరేచనాలు కావడంతో తోటి మహిళలు వెంటనే శ్రీదేవిని ఇంటికి తీసుకవెళ్లారు. విరేచనాలు అవుతున్న మహిళను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదే రోజు రాత్రి మృతి చెందారు. మృతురాలికి భర్తతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు.



నేడు ధరిత్రి దినోత్సవం

- మేడారం అడవుల్లో టోర్నడో తరహా విధ్వంసం
- క్లౌడ్ బరస్ట్‌లు, భూప్రకంపనలతో భయంభయం
- 20శాతం తగ్గిన అడవుల విస్తీర్ణం
- 2మీటర్ల లోతుకు పడిపోయిన భూగర్భ జలాలు

పర్యావరణంలో పెనుమార్పులు

పెరుగుతున్న భూతాపంతో ఎన్నో అనర్థాలు

హనుమకొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : సమస్త జీవకోటి భారాన్ని మోసే ధరిత్రి తల్లడిల్లుతోంది. పర్యావరణంలో వస్తున్న పెనుమార్పులతో ఎన్నో విధ్వంసాలకు ఆలవాలమవుతోంది. అటు పర్యావరణ పరిరక్షణ.. ఇటు జీవనశైలిలోనూ వస్తున్న మార్పులతో భూపరిరక్షణపై అవగాహనకు ప్రత్యేక కార్యక్రమాలు అవసరమవుతున్నాయి. ఇందులో నుంచి వచ్చిందే ప్రపంచ ధరిత్రీ దినోత్సవం. 1970 నుంచి ప్రారంభమైన ఈ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా 190 కంటే ఎక్కువ దేశాల్లో ఏప్రిల్ 22న జరుపుకొంటున్నాయి. భూగోళంపై మానవ ప్రభావాన్ని తెలియజేయడం, అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నారు. 2025 ఏడాదికి సంబంధించి 'మన వనరులు, మన భూగోళం' నినాదంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత దశాబ్దాకాలంలో పర్యావరణం పరంగా పెనుమార్పులు సంభవించాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కుండపోత వర్షాలు (క్లౌడ్ బరస్ట్), వరదలు సంభవించడం, ఉమ్మడి జిల్లా చరిత్రలోనే మొదటి సారిగా ములుగు జిల్లాలోని అటవీ ప్రాంతంలో టోర్నడో తరహా గాలులతో అడవిలో విధ్వంసం చెలరేగింది. అంతేకాదు ఇటీవల స్వల్పంగా భూమి కూడా కంపించడం.. దానికి మేడారం కేంద్రం కావడం ప్రత్యక్ష ఉదాహరణలు. మంగళవారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని వాతావరణ పరిస్థితులు, చోటు చేసుకుంటున్న పరిణామాలు, అందుకుగల కారణాలు, ధరిత్రి పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలపై ప్రత్యేక కథనం.

ఉమ్మడి జిల్లాలో..:

భూమి, గాలి, నీరు, నింగి, నిప్పు, నేల వల్లే మానవ మనుగడ సాధ్యమవుతోంది. వీటిలో ఏ ఒక్కటి లోపించినా జీవనం అస్తవ్యస్తమవుతుందన్నది గుర్తించాలి. కానీ ప్రస్తుతం నానాటికీ పెరుగుతున్న భూతాపంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతిని జీవరాశి మనుగడకు ముప్పు ఏర్పడుతోంది. ఈ పరిస్థితి ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ కనిపిస్తోంది. పదేళ్ల కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వాతావరణంలో పెనుమార్పులొచ్చాయి. జనాభా పెరిగింది. పట్టణీకరణ ఊపందుకుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పల్లెలు కూడా కాంక్రీట్ జంగిళ్లుగా మారుతున్నాయి. ఫలితంగా పచ్చదనం కరువవుతోంది. అంతేకాదు రవాణా సౌకర్యాలు మెరుగుపడి రాకపోకలు పెరిగాయి. గత పదేళ్లలో ఉమ్మడి జిల్లాలో వాహనాల సంఖ్య 35 శాతం పెరగ్గా.. ఆమేరకు కాలుష్యం కూడా రెట్టింపైంది.

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు..

భూతాపం పెరగడం వల్ల ఉష్ణోగ్రతల్లో మార్పులు సంభవిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత పదేళ్లలో అత్యధిక పగటి ఉష్ణోగ్రత 48 డిగ్రీలపైనే నమోదు అయింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా సాధారణ ఉష్ణోగ్రత 34.9 డిగ్రీ అయితే దానిని మించి రికార్డు స్థాయిలో 48.9 డిగ్రీలు నమోదయింది. మహబూబాబాద్ జిల్లాలో 48.5 డిగ్రీలు, వరంగల్ జిల్లాలో 48.7 డిగ్రీలు, హనుమకొండ జిల్లాలో 47.6 డిగ్రీలు, ములుగు జిల్లాలో 48.5 డిగ్రీలు నమోదైంది.



గతేడాది భీకర గాలులకు తాడ్వాయి అడవుల్లో నేలకూలిన వృక్షాలు

తరగిపోతున్న అడవులు

అడవుల వల్ల విస్తృతంగా వర్షాలు కురిసి భూతాపం తగ్గుతుంది. పచ్చదనం వల్ల ఆ ప్రాంతమంతా చల్లగా ఉంటుంది. విస్తారమైన అడవులకు పేరున్న ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గత దశాబ్ద కాలంలో వాటి విస్తీర్ణం 20 శాతం మేరకు తగ్గిపోయినట్టు అంచనా. ప్రస్తుతం ములుగు జిల్లాలో 64.64 శాతం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 41.15 శాతం అడవి, మహబూబాబాద్ జిల్లాలో 26.49 శాతం మాత్రమే ఉంది. జనగామ జిల్లాలో 4.44 శాతం, వరంగల్ జిల్లాలో 3.53 శాతం, హనుమకొండ జిల్లాలో 3,40 శాతం మాత్రమే అటవీ ప్రాంతం ఉంది. విచక్షణా రహితంగా చెట్లను నరికి వేయడం వల్ల దాని ప్రభావం ధరిత్రిపై పడుతోంది.



నేడు ఇనుపరాతి గుట్టల్లో వాకింగ్

ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని భూమిని పరిరక్షించేందుకు తీసుకోవలసిన చర్యలపై జనవిజ్ఞాన వేదిక, పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక సంయుక్త అధ్వర్యంలో మంగళవారం దేవునూరిలోని ఇనుపరాతి గుట్టల్లో వాకింగ్‌ను నిర్వహిస్తున్నారు. అలాగు దేవునూరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ధరిత్రి పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తారు. ఉదయం 5.30 గంటల నుంచి గుట్టల్లో వాకింగ్‌ను చేపడతారు. పలువురు పర్యావరణ వేత్తలు, సామాజిక వేత్తలు, విద్యార్థులు ఇందులో పాల్గొంటున్నారు.

పగబడుతున్న ప్రకృతి

ఉమ్మడి జిల్లాలో అయిదారు సంవత్సరాలుగా సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలను చూస్తుంటే ప్రకృతి పగబట్టిందా అన్న అనుమానం కలుగుతోంది. ఒకప్పుడు సాధారణ వర్షపాతం నమోదయ్యే ఉమ్మడి జిల్లాలో క్లౌడ్ బరస్ట్‌లు ఏర్పడి కుండపోత వర్షాలు పడుతున్నాయి. 2023 జులైలో కురిసిన భారీ వర్షాలతో భూపాలపల్లి, ములుగు జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. ఉమ్మడి జిల్లా చరిత్రలోనే తొలిసారిగా ములుగు జిల్లా లక్ష్మీదేవిపేటలో రికార్డు స్థాయిలో 64.98 సెమీ, భూపాలపల్లి జిల్లా చిట్యాలలో 61.65, సెంమీల రికార్డు వర్షపాతం నమోదైంది. 2023జూలైలో వరంగల్ చరిత్రలో మొదటిసారి వాన బీభత్సంతో అల్లకల్లోల పరిస్థితులు ఏర్పడ్డాయి. చెరువులు, కుంటలు ఉప్పొంగాయి. వరద ఉధృతికి తట్టుకోలేక చెరువులు, కుంటలు తెగిపోయాయి. గంటలకు 50 కిమీ వేగంతో గాలులు వీచాయి. ఇక గతేడాది మహబూబాబాద్ జిల్లాలో క్లౌడ్‌బరస్ట్ జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. ఇక గతేడాది ఆగస్టు31న ములుగు జిల్లా తాడ్వాయి-మేడారం అడవుల్లో టోర్నడో సంభించింది. గంటకు 150 కిలోమీటర్ల వేగంతో వీచిన ఆ సుడిగాలుల తీవ్రతకు మేడారం అడవుల్లో ఏడు కిలోమీటర్ల మేర అయిదు హెక్టార్ల పరిధిలో 50వేలకుపైగా చెట్లు నేలకూలాయి. ఇదిలా ఉంటే ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూకంపాలు అరుదు. అలాంటిది గత సంవత్సరం డిసెంబరు 4న ఉదయం భూప్రకంపనలు సంభవించడం ప్రజలను తీవ్రభయాందోళనకు గురి చేసింది. ఉదయం 7.30గంటల సమయంలో భూమి కంపించగా.. అది మేడారం కేంద్రంగా వచ్చినట్టు రిక్టర్‌స్కేల్‌పై చూపడం మరింత ఆందోళన రేకెత్తించింది. ఇక 2023 ఆగస్టు 25న కూడా వరంగల్, హనుమకొండ, జనగామ ప్రాంతాల్లో స్వల్పంగా భూమి కంపించింది.



ధరణి రక్షణకు చర్యలు..

భూతాపం రోజు రోజుకు అంతకంతకు పెరుగుతుండడంతో పర్యావరణంలో పెనుమార్పులు సంభవించి ప్రకృతివైరీత్యాలు సంభవిస్తున్నాయి. దీని నివారణకు కొన్ని చర్యలు పాటిస్తే భూతాపం కొంత మేరకు తగ్గవచ్చు. కాలుష్య కారకాల నియంత్రిచడం, అడవులు, పచ్చదనం రక్షణ, కర్బన ఉద్గారాలు వెలువడే వాటిని నియంత్రించడం, పర్యావరణ అనుకూల ఉత్పత్తులను ఉపయోగించడం, వ్యర్థాల వినియోగం, పునర్వినియోగ ఇంధనాలు, వస్తువులను వినియోగించడం లాంటివి చేయాల్సి ఉంటుందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానుకోవాలి.

ప్రకృతికి దగ్గరగా జీవించాలి



ధరణి పరిరక్షణ, మానవాళి మనుగడకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి. ప్రస్తుతం ఏటా ప్రకృతి నుంచి 124 ట్రిలియన్ డాలర్ల విలువైన వనరులను వాడుతున్నాం. అవసరాలకు మించి 30 శాతం అధికంగా వినియోగిస్తున్నాం. ప్రకృతి వనరుల రీసైక్లింగ్ జరగడం లేదు. దీంతో వనరులు తరిగిపోతున్నాయి. గాలి, నీరు, నేల కలుషితమై పోతోంది. కాలుష్యాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ప్లాస్టిక్ వాడకం విచ్చలవిడిగా సాగుతోంది. పచ్చదనం తగ్గిపోతోంది. ఫలితంగా భూతాపం పెరిగిపోతోంది. ఇటీవల భూతాపం ఒకటిన్నర డిగ్రీలు పెరగడంతో అనేక జీవులు నశించి పోతున్నాయి. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు పర్యావరణ హితంగా జీవించడం అలవరుచుకోవాలి.

- కాజీపేట పురుషోత్తం, రిటైర్డ్ జిల్లా అటవీ అధికారి అధ్యక్షుడు, పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక, జనవిజ్ఞానవేదిక, హనుమకొండ జిల్లా

కుంగిపోవద్దు.. కన్నీరు మిగల్చొద్దు..

మార్కులెలా వచ్చినా మనోధైర్యం చెడొద్దు

- ఫెయిలైనా ఆత్మస్థైర్యంతో ముందడుగేయాలి
- పరీక్షల ఫలితాల వేళ పిల్లలను తల్లిదండ్రులు ఓదార్చాలి



వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు ముగిశాయి. మంగళవారం ఇంటర్ ఫలితాలు, ఆ తర్వాత మరో వారం రోజుల్లో పదో తరగతి ఫలితాలు వెలువడనున్నాయి. ఈ క్రమంలో పిల్లల్లో సానుకూల దృక్పథాన్ని అలవాటు చేయాల్సి ఉంది. చిన్నచిన్న కారణాలతోనే బలవన్మరణాలకు పాల్పడుతున్నారు పిల్లలు. అలాంటిది తాము ఎంతో కష్టపడి చదివిన వార్షిక పరీక్షల్లో ఫెయిలైతే.. లేదంటే ఇతరుల కంటే మార్కులు తక్కువగా వస్తే.. కొందరు ఒక్కసారిగా ధైర్యం కోల్పోతారు. చిన్నతనంగా భావిస్తారు. అమ్మానాన్నలు తిడతారానో.. బంధువుల్లో చుట్టుపక్కల వారిలో తలెత్తుకుని తిరగలేమనో.. క్షణికావేశంలో తీసుకోరాని నిర్ణయం తీసుకుంటే.. అది ఆ కన్నవారి తీరని శోకమే మిగుల్చుతుంది. అందుకే పరీక్షల ఫలితాలు ఎలా ఉన్నా పిల్లలు కుంగిపోవద్దని, మార్కులు, ఫలితాలే పరమావధి కాదన్న విషయాన్ని వారికి అర్థమయ్యేలా చెప్పాలని మానసిక, మనో వికాస నిపుణులు తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. ఫెయిల్ అయినా, మార్కులు తక్కువగా వచ్చినా పిల్లలను ఏమీ అనకుండా వారికి అండగా నిలవాలని.. అనుకున్న మార్కులు రాని వారికి ఇంప్రూవ్‌మెంట్, ఫెయిలైన వారికి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉన్నాయన్న ధైర్యం కల్పించాలని చెబుతున్నారు. అందుకే ముందుగానే పిల్లలను ఆ దిశగా సిద్ధం చేయాలని సూచిస్తున్నారు. అలాగే చుట్టుపక్కల వారు, బంధువులు కూడా పిల్లల మార్కులు, ఫలితాల గురించి బేరీజు వేయడం, హేళన చేయడం, ఒకరికొకరికి పోలికలు పెట్టడం లాంటివి చేయకుండా ఉండాలని చెబుతున్నారు. ఇక స్నేహితులు, తోటి విద్యార్థులు కూడా మార్కులు తక్కువవచ్చిన, ఫెయినలైన విద్యార్థులకు అండగా ఉండి ధైర్యం చెప్పాలని, లేదంటే వారికి తగినంత సాయం చేయాలని సూచిస్తున్నారు.



గతానికి ఇప్పటికీ ఎంతో మార్పు..

ఒకప్పుడు పదోతరగతి, ఇంటర్‌లో ఫెయిల్ అయిపోతే ఏడాదంతా వృథా అయ్యేది. సెప్టెంబరులో సప్లిమెంటరీ పరీక్షలు రాసి పాసైతే వచ్చే ఏడాదికి ప్రమోట్ అయ్యేవారు. కానీ అలా విద్యాసంవత్సరం వృథా అవకుండా ఉండేందుకు ప్రస్తుతం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఫలితాలు వచ్చిన నాటినుంచి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే లోపే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అందుకే ఫెయిలైనంత మాత్రాన పోయేదేం లేదని వెంటనే పరీక్షలు రాసి పాసవ్వచ్చన్న విషయాన్ని పిల్లలకు వివరించి ధైర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. ఇందులో ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా తమ వంతు పాత్ర పోషించాలని చెబుతున్నారు. ఓటమి నుంచి విజయాలు పొందిన గొప్ప వారి చరిత్రను పిల్లలకు చిన్నతనం నుంచే వివరిస్తూ ఉండాలని సూచిస్తతన్నారు.

విద్యార్థులూ కుంగిపోవద్దు..



ఫలితాలను చూసి విద్యార్థులు కుంగిపోవద్దు. ఫెయిల్ అయినా, మార్కులు తక్కువ వచ్చినా వాటిని విశ్లేషించుకోవాలి. అందుకు కారణాలు వెతుక్కొని వాటిని అధిగమించేలా ప్రయత్నాలు ప్రారంభించాలి. అంతే తప్ప ఫెయిల్ అయ్యామని ప్రాణాలు తీసుకోవద్దు. ప్రతీ విద్యార్థిలోనూ విజ్ఞానం దాగి ఉంటుంది. దానిని సరైన పద్ధతిలో బయటకు తీసుకురావాలి తప్ప ఒక్క సారి ఫెయిల్ అయితే జీవితమే అయిపోయిందనే భావనలో ఉండకూడదు. ప్రతీ ఓటమి విజయానికి అవకాశంగా మార్చుకొని ముందుకు సాగాలి.

- డాక్టర్ బరుపాటి గోపి, అధ్యాపకులు, మనోవికాస నిపుణులు...

ఒత్తిడిని జయించాలి..



ఫలితాల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు. ఒత్తిడికి గురైనా దాన్ని జయించాలి. సాధారణ పరిస్థితుల్లో లాగానే వ్యవహరించాలి. ఉత్తీర్ణత సాధించేందుకు ముందు నుంచే ప్రణాళిక బద్ధంగా చదవాలి. అప్పుడు ఫలితం ఎలా ఉండబోతుందో ముందే తెలిసిపోతుంది. అలాంటప్పుడు ఆత్మన్యూనతకు గురికావాల్సిన అవసరం రాదు. ఫెయిల్ అయితే మళ్లీ పరీక్షలు రాసేందుకు అవకాశం ఉంది. కానీ ప్రాణాలు తీసుకుంటే తల్లిదండ్రులకు శోకమే విగులుతుంది.

- పోగు అశోక్, ఉపాధ్యాయుడు, మోటివేషనల్ స్పీకర్

విద్యార్థులూ.. తల్లిదండ్రులకు దుఃఖాన్ని మిగల్చొద్దు

పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని, ఫెయిల్ అయ్యామనే ఆత్మన్యూనతతో క్షణికావేశానికి గురికావొద్దు. ఫెయిల్ అయినా ధైర్యంతో ముందుడుగేయాలి. ఫలితాలు వెలువడిన కొద్ది రోజుల్లోనే నిర్వహిస్తున్న ఇన్‌స్టంట్ పరీక్షలపై దృష్టి పెట్టాలి. ఫలితాలు ప్రతికూలంగా వస్తే కుంగిపోయి అఘాయిత్యాలకు పాల్పడి తల్లిదండ్రులను దుఃఖాన్ని మిగల్చొద్దు. ఆత్మస్థైర్యంతో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేలా కృషి చేస్తే.. విజయాలు మీ చెంతకు అవే చేరుతాయనే విషయాన్ని గ్రహించాలి.

బీజేపీది గాడ్సే సిద్ధాంతం

- అదానీ, అంబానీలు రూ.21 లక్షల కోట్లను మాఫీ చేశారు
- రైతులకు రుణమాఫీ చేయడానికి చేతులు రాలేదు
- స్వేచ్ఛ, సమానత్వాల పరిరక్షణకు రాహుల్ నాయకత్వాన్ని బలపరచాలి
- ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళనం ముగింపులో మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీది గాడ్సే సిద్ధాంతమని ఆ మేరకే పాలన సాగిస్తోందని రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. ప్రజల మధ్య కుల, మత విద్వేషాలను రగల్చడమే అజెండాగా పెట్టుకొందని దుయ్యబట్టారు. హనుమకొండ హరితా హోటల్‌లో జరుగుతున్న 'ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళన్' మూడవ రోజు సోమవారం ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళన్ జాతీయ ఉపాధ్యక్షుడు, ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్యనాయక్ అధ్యక్షతన సమ్మేళన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో శాంతియుత పరిస్థితులకు విఘాతం ఏర్పడిందన్నారు. వివిధ వర్గాల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతూ భయానక పాలన సాగిస్తోందని విమర్శించారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలు, రైతులకు రుణమాఫీ చేయడానికి బీజేపీకి చేతులు రాలేదన్నారు. అంబానీ, అదానీ వంటి బడాబాబులకు మాత్రం రూ.21 లక్షల కోట్లను మోదీ ప్రభుత్వం మాఫీ చేసిందని విమర్శించారు.

బాపు, అంబేడ్కర్ ఆలోచనల సమ్మేళనమే కాంగ్రెస్ :

జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ ఆలోచనల సమ్మేళనమే కాంగ్రెస్ అని సీతక్క పేర్కొన్నారు. బీజేపీ అగ్రవర్ణాలు, పెత్తందార్లకు కొమ్ము కాస్తుంటే..తమ అధినేత రాహుల్ గాంధీ నిరుపేదల సంక్షేమం, స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడుతున్నారన్నారు. రాజ్యాంగాన్ని హరించేందుకు బీజేపీ యత్నిస్తుంటే పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నారని పేర్కొన్నారు. అణగారిన వర్గాలను అందలం ఎక్కించ డమే రాహుల్ గాంధీ లక్ష్యాల్లో ఒకటన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. సమ్మేళన్ శిక్షణ కార్య క్రమంలో వివిధ అంశాలపై కలిగిన అవగా హనను గ్రామలలో విస్తరించాలని సూచించారు.

తెలంగాణలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను డంప్ చేశారు.

30 వేల మంది ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను బీజేపీ తెలంగాణలో డంప్ చేసిందని సీడబ్ల్యూసీ సభ్యులు కొప్పుల రాజు వెల్లడించారు. బీజేపీ కుట్రలను చేధించడానికి గ్రామ స్థాయి నుంచి వాస్తవాలను వివరించే పనిలో ఆదివాసీలు నిమగ్నం కావాలని సూచించారు. ఆదివాసీలను చైతన్య పరిచి నాయకత్వాన్ని ఉత్పత్తి చేసే లక్ష్యంతో సమ్మేళన్ చేపట్టడం జరిగిందన్నారు. తెలంగాణ నుంచే సమ్మేళన్ శిక్షణ తరగతులు చేపట్టడానికి ఈ ప్రాంతానికి ఉన్న పోరాట చరిత్రే కారణమన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం గొప్ప ఘట్టమన్నారు. దీనిపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. అదే విధంగా జూన్ 2 నుంచి ఆగస్టు 15 వరకు రెవెన్యూ సదస్సులు జరగనున్న క్రమంలో ఆదివాసీలు సిద్ధం కావాలన్నారు. భూ భారతీ చట్టంపై సంపూర్ణ అవగాహన ఏర్పర్చుకొని సదస్సుల్లో భూ సమస్యలు ఎదుర్కొంటున్న ఆదివాసీలకు పరిష్కార చర్యల్లో సహాయ, సహకారాలు అందించాలన్నారు. బీఆర్‌యస్ ఓటమికి ధరణీ లోపాలే ప్రధాన కారణమని కొప్పుల రాజు వెల్లడించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళన్ ముగింపులో శిక్షణలో పాల్గొన వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం శిక్షణ సర్టిఫికెట్లను అందచేశారు. సమ్మేళన్ ప్రారంభానికి ముందు హరితా హోటల్ నుంచి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం వరకు 'జై బాపు-జై భీమ్-జై సంవిధాన్-జై జగత్' ర్యాలీలో మంత్రి సీతక్క, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కావ్య తదితరులు పాల్గొన్నారు. మైదానంలో శ్రమదానం చేసి శుభ్రం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు విక్రంత్ బునియా, ఉపాధ్యక్షుడు బెల్లయ్యనాయక్, ఎంపీ బలరాంనాయక్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, డాక్టర్ పులి అనిల్‌కుమార్, సమ్మేళన్ ఇన్‌చార్జి రాహుల్ బాల్, కో-ఆర్డినేటర్ చంద్రకళ, ఆదివాసీ కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారికి బంగారు కానుక

రూ. 4 లక్షల విలువైన తాళిబొట్టు అందజేసిన భక్తుడు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధి చెందిన భద్రకాళి అమ్మవారికి ఓ భక్తుడు బంగారు కానుక అందించారు. హనుమకొండకు చెందిన మాధవ్ అనే వ్యక్తి ఓవైపు ప్రభుత్వం ఉద్యోగం చేస్తూనే మరో వైపు గ్రూప్ -1 పరీక్ష రాశారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు వచ్చినందున ఆనందంతో అమ్మవారికి రూ.4 లక్షల విలువ చేసే బంగారు తాళి బొట్టును తయారు చేయించి సోమవారం ఈవో శేషు భారతి చేతుల మీదుగా అమ్మవారికి సమర్పించారు.

మండే ఎండలో.. ఏమి హాయిలే ఇలా..




ఎవరూ లేరు ఈ నీళ్లలో దిగుదాం..



అహా చల్లగా ఉంది..



అబ్బా ఎవరో వస్తున్నారే..



హమ్మయ్య ఎంత హాయిగా ఉందో..

ఎండలు దంచి కొడుతుండటంతో మనుషులే కాదు పశుపక్షాదులు కూడా అల్లాడుతున్నాయి. అందుకు నిదర్శనమే ఈ చిత్రాలు. ఎండ వేడిమిని తట్టుకునేందుకు ఓ కోతి ఎంచక్కా నీటి తొట్టిలోకి దిగి జలకాలాడింది. హమ్మయ్య చల్లగా ఉందంటూ బయటకొచ్చి కేరింతలు కొట్టింది. ఈ దృశ్యాలు వాజేడు మండల కేంద్రంలోని ఓ ఇంట్లో సోమవారం కనిపించాయి.

- వాజేడు, ఆంధ్రజ్యోతి

బోధనా రుసుంను వెంటనే విడుదల చేయాలి

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల బోధన రుసుం వెంటనే విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజులు విడుదల చేయాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట డీవైఎఫ్ఐ నాయకులు విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ట్యూషన్ ఫీజులను ఇప్పటికైనా వెంటనే విడుదల చేయాలని, లేదంటే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. ధర్నాలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్, కె. అమూల్య, పి.రుచిత, యు.మేఘన, స్వాతి, నవ్యతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు



కాళోజీ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ధరలు నియంత్రించడంలో మోదీ ప్రభుత్వం విఫలం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ పాలనను నిరసిస్తూ సోమవారం సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ సెంటర్‌లో నిరసన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందన్నారు. రోజురోజుకు పెరుగుతున్న నిరుద్యోగం, రూపాయి విలువ పతనంతో పతనమైన భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టకుండా కేంద్రం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను మానుకోవాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, ఎ.శ్రీనివాస్, మద్దెల ఎల్లేష్, ఉట్కూరి రాములు, మునిగాల బిక్షపతి, వేల్పుల సారంగపాణి పాల్గొన్నారు.

పెంచికల్‌పేట పీఏసీఎస్ కార్యదర్శి సస్పెన్షన్

హనుమకొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పెంచికల్‌పేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కార్యదర్శి ఓదెల లక్ష్మయ్యను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు జిల్లా సహకార అధికారి డాక్టర్ బి.సంజీవరెడ్డి తెలిపారు. కొనుగోలు కేంద్రాల విషయంలో నిబంధనలు పాటించకుండా బాధ్యతా రహితంగా విధుల్లో నిర్లక్ష్యం వహించినందు వల్ల లక్ష్మయ్యను సస్పెండ్ చేసినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని, అయితే ఈ కేంద్రాలను ప్రోటోకాల్ పాటించి ప్రజాప్రతినిధులు,జిల్లా అధికారులతో ప్రారంభోత్సవంచేయించాలని, రైతులకు సరైన వసతులు కల్పించాలని పీఏసీఎస్ కార్యదర్శులను ఆదేశించినట్టు తెలిపారు.

కేయూలో పరిశోధకుల కార్యశాల ప్రారంభం

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంహెచ్ఆర్ఎం విభాగం నేతృత్వంలో పరిశోధకులకు వారం రోజుల పాటు జరిగే కార్యశాల సోమవారం ఆ విభాగ సెమినార్ హాల్‌లో ప్రారంభమైంది. విభాగాధిపతి పెద్దమళ్ళ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యశాల లో ఆ విభాగం రిటైర్డు ప్రొఫెసర్లు క్రిష్ణయ్య, శ్రీనివాసరెడ్డిలు హాజరై మాట్లాడారు. పరిశోధన విధానాలను, క్షేత్రస్థాయి అంశాలపై వివరించారు.

బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్ భిక్షాటన

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి) : గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని హనుమకొండ జిల్లాలోని నడికూడ మాజీ సర్పంచ్ రవీందర్‌రావు సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట భిక్షాటన చేశారు. మన ఊరు మనబడి, గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, పైపులైన్ పనులతో పాటు గ్రామాభివృద్ధికి రూ.51.50 లక్షలు ఖర్చు చేసి పనులు చేయించానని, ఇంకా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని రవీందర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించాలని ఇప్పటికే నాలుగు సార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు.



కలెక్టరేట్ ఎదుట భిక్షాటన చేస్తున్న మాజీ సర్పంచ్ రవీందర్‌రావు

కేఎంసీలో సైకిల్ క్లబ్

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ మెడికల్ కాలేజీలో సైకిల్ క్లబ్‌ను స్టూడెంట్ బాడీ రూంను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామ్ కుమార్ రెడ్డి ప్రారం భించారు. ఈ సందర్భంగా బాలుర వసతి గృహానికి 30 సైకిళ్లను అందచేశారు. కాలేజీ విద్యార్థులు శారీరక ధృఢత్వాన్ని పెంపొందించడానికి, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ఈ సైకిల్ క్లబ్ ఏర్పాటైంది. విద్యార్థుల సమావేశాలు నిర్వహించేందుకు, ప్రత్యేకంగా స్టూడెంట్ బాడీ రూంను ఏర్పాటు చేశారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో సోమవారం హజ్ యాత్రికుల కోసం ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భా గంగా 47 మందికి ఓరల్ పోలియో వ్యాక్సిన్, మీనింగ్ కోకల్ వ్యాక్సిన్, సీజనల్ ఇన్‌ఫ్లూయా వ్యాక్సిన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ అప్పయ్య పాల్గొన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ మహేందర్, ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, డాక్టర్ రెహమాన్, డాక్టర్ రబీన అఫ్రోజ్, జిల్లా హజ్ కమిటీ అధ్యక్షుడు హనీఫ్ పాల్గొన్నారు.

అధ్యాపకులకు మద్దతుగా పీడీఎస్‌యూ నిరసన

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు అధ్యాపకులకు మద్దతుగా సోమవారం పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండో గేటు ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. 12 వర్సిటీల్లో 1270 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారని అన్నారు. వారి సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేశారు. సమ్మెతో క్లాస్‌లు జరగడం లేదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షకార్యదర్శులు వంశీకృష్ణ, రంజిత్‌కుమార్, పవన్‌కల్యాణ్, ముషారఫ్, అదిత్య, అరవింద్, ఠాగూర్, అకాశ్, సాయి, శంకర్ పాల్గొన్నారు.

కేయూలో పార్ట్‌టైమ్ అధ్యాపకుల నిరసన

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కేయూలో పార్టుటైమ్ అధ్యాపకులు సోమవారం కేయూ పరిపాలన భవనం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మా మొర ఆలకించండి అంటూ నిరసన వ్యక్తం చేస్తూ విజ్ఞప్తి చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, టైమ్‌స్కేల్ ఇవ్వాలని పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం నేతలు కోరారు.

చెత్త సేకరణపై దృష్టి సారించండి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కమర్షియల్ చెత్త సేకరణపై శానిటేషన్ అధికారులు దృష్టిసారించాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం వరంగల్ బీటుబజారులో చెత్త సేకరణపై మేయర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఆ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని బీటుబజారులో రోడ్లపై నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. చెత్త సేకరణను ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని అన్నారు. కమర్షియల్ కలెక్షన్‌ను పకడ్బందీగా చేయాలని అన్నారు. దుకాణదారులు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చూడాలని,

అధ్యాపకులు గణితంలో నైపుణ్యాలను పెంచుకోవాలి

నిట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఉమామహేశ్ రావు

హనుమకొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అధ్యాపకులు గణిత శాస్త్రం వంటి ప్రాథమిక విషయాలలో నైపుణ్యాలను పెంపొందిచుకోవాలని, అప్పుడే విద్యార్థులకు బలమైన భవిష్యత్తుకు పునాదులు పడతాయని వరంగల్ నిట్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ ఎస్‌వి ఉమామహేశ్ అన్నారు. సోమవారం వరంగల్ నిట్‌లోని సెమినార్ హాల్స్ కాంప్లెక్సులోని హోమీబాబ హాల్లో లీనియర్ అల్జీబ్రా, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్‌పై వారం రోజుల వర్క్‌షాపు ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఉమామహేశ్ మాట్లాడుతూ అధ్యాపకులు గణితాన్ని ఎంత సరళంగా, ప్రభావంతంగా విద్యార్థులకు బోధించగలిగితే వారు అంతా ప్రతిభావంతులవుతారని అన్నారు. నిట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం డీన్ ప్రొఫెసర్ శిరీష్ సోనా వానే మాట్లాడుతూ అనేక విభాగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలు కొనసాగాలంటే గణితంలో బలమైన పునాది అవసరమన్నారు. గణిత శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ ఆర్ఎస్ సెల్వరాజ్ గణితశాస్త్ర విభాగం కార్యక్రమాలు, సాధించిన విజయాల గురించి వివరించారు. ఐఐటీ ముంబై, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ (టీఐఎఫ్ఆర్) ముంబై సంయుక్తాధ్వర్యంలో నడుస్తున్న నేషనల్ సెంటర్ ఫర్ మ్యాథమెటిక్స్ (ఎన్‌సీఎం) సౌజన్యంతో ఈ వర్క్‌షాపును నిర్వహిస్తున్నారు. ఈ వర్క్‌షాపులో పాల్గొనేందుకు దేశంలోని వివిధ ఎన్ఐటీల నుంచి 110 మంది అధ్యాపకులు దర ఖాస్తు చేసుకోగా 50 మందిని ఎంపిక చేశారు. ఇందులో 12 మంది వరంగల్, పరిసర ప్రాంతాలకు చెందినవారే ఉన్నారు.



వర్క్‌షాపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఉమమహేశ్వర్

పేదలకు ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి) : నగరంలో ప్రభుత్వ ఇళ్ల స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేద ప్రజలకు పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 20 రోజులుగా జిల్లా, స్థానిక సమస్యలపై సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్న సర్వేలో వెల్లడైన సమస్యలు పరిష్కరించాలని సోమవారం సీపీఎం నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ పాలన పేదలను విస్మరిస్తూ కార్పొరేట్ శక్తులకు సంపద దోచిపెడుతుందన్నారు. తెలంగాణ విభజన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల ఎదుగుదలకు పథకాలు తెచ్చి వారిని ఆదుకోవాలని, లేదంటే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు చుక్కయ్య, బొట్ల చక్రపాణి, రాగుల రమేష్, గొడుగు వెంకట్‌తోపాటు పెద్ద సంఖ్యలో సీపీఎం శ్రేణులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మడికొండ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కాజీపేట మండలం మడికొండలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దర్గా ప్రాథమిక వ్యవసాయ కేంద్రం చైర్మన్ ఊకంటి వనంరెడ్డి 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డితో కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో సంధ్య, పీఏసీఎస్ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, పోలు శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బైరి కొమురయ్య, బైరి లింగమూర్తి, గుర్రం అమర్‌నాథ్, బిల్ల రవీందర్, ఎడబోయిన ప్రభాకర్, వస్కుల శ్రీను, నీలం రజినీవేణు, కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డే వేడుకలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

శ్రీనివాస్ గురుకుల్ పాఠశాలలో

శ్రీనివాస్ గురుకుల్ పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల్ పాఠశాలలో సోమవారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల కరస్పాండెంట్ చిదురాల సోమరత్నం హాజరై నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరై పిల్లల ఫొటోలను కెమెరాలలో బంధించుకున్నారు, ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు బలమైన పునాది వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ యుగేందర్, రజిని, రాధిక, కిరుపాల్‌కౌర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కమిటీ

విశ్వబ్రాహ్మణ పరపతి సంఘం నూతన కమిటీ

హనుమకొండ టౌన్, ఎప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : విశ్వబ్రాహ్మణ పరస్పర సహాయక సహకార పొదుపు, పరపతి సంఘం నూతన కమిటీని హనుమకొండలోని విశ్వబ్రాహ్మణ సంక్షేమ భవన్ ట్రస్ట్‌లో ఎన్నుకున్నట్లు సోమవారం సిద్దోజ్ విద్యాసాగర్ తెలిపారు. విశ్వబ్రాహ్మణ పరపతి సంఘం 8వ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. నూతన కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షుడుగా సిద్దోజ్ విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీపాద సుధాకర్, కోశాధికారిగా డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్, ఉపాధ్యక్షుడుగా ఆకోజ్ సురేందర్‌రావు, సంయుక్త కార్యదర్శిగా తాడూరి ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా మట్టెవాడ బ్రహ్మచారీ, రాగి కరుణాకర్, సిద్దోజ్ సూర్యప్రకాష్,శ్రీరామోజు గిరిబాబును ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారులుగా విశ్రాంత ఉద్యోగి కలకోట నర్సింహచారి, బింగి లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

సాగునీటి అక్రమ తరలింపును అరికట్టాలి

ప్రొఫెసర్ సీతారాంరావు

వడ్డెపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సాగునీటిని ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలించకుండా అరికట్టాలని అంబేద్కర్ వర్సిటీ మాజీ వీసీ సీతారాంరావు అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ వికాస సమితి (టీవీఎస్) ఆధ్వర్యంలో 'రాష్ట్ర ప్రగతి-గతం- వర్తమానం- భవిష్యత్తు' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీతారాం రావు మాట్లాడుతూ తెలంగాణ అస్థిత్వ పోరాటాన్ని, ఆకాంక్షను గౌరవించాలన్నారు. సీనియర్ జర్నలిస్టు పరాంకుశం వేణుగోపాలస్వామి మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావంతోనే సమస్యలన్నీ పరిష్కారం కావన్నారు. ప్రాంతీయేతర శక్తుల కుట్రలను తిప్పికొట్టడంలో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో టీవీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోత్ భిక్షపతి నాయక్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్, పీఆర్‌టీయూ నాయకులు రావుకారి వెంకటేష్, నిమ్మల శ్రీనివాస్, విద్యుత్ జేఏసీ నేత సంపత్‌రావు, విరసం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్‌కుమారస్వామి, భారత్ బచావో సభ్యులు శోభన్‌బాబు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు యువకులు తరలి రావాలి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ 25 ఏళ్ల రజతోత్సవ సభకు యువకులు పెద్ద ఎత్తున తరలి రావాలని రాష్ట్ర మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సన్నాహక సమావేశాన్ని 53వ డివిజన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ బియ్యాల జనార్ధన్‌రావు మేనల్లుడు తక్కళ్లపల్లి వినిల్‌రావుతోపాటు వంద మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ , దాస్యం వినయ్ భాస్కర్ ఆహ్వానించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. నాడు తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఉద్యమ పార్టీగా అవతరించిన బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు అండగా నిలిచిందన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అన్ని వర్గాల ప్రజలు, యువకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి సభను విజయవంతం చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య విప్లవం తీసుకొచ్చి కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను కేసీఆర్ అందించినట్లు తెలిపారు. వెయ్యికిపైగా గురుకులాలను ఏర్పాటు చేసి పేద ప్రజలకు విద్యను అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. .

కేసీఆర్‌రే తెలంగాణకు శ్రీరామరక్షా..

కేసీఆర్‌రే తెలంగాణకు శ్రీరామరక్షా అని ప్రొఫెసర్ బియ్యాల జనార్ధన్‌రావు మేనళ్లుడు తక్కళపల్లి వినిల్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి దేశంలో నే అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వస్తున్నానని, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత వంటి దక్షత కలిగిన పరిపాలన విధానానికి ఆకర్షితు న్నై ప్రజల కోసందాస్యం వినయ్‌భాస్కర్ నాయకత్వం లో బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వినిల్‌రావు అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్పొరేటర్ సోదా కిరణ్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన తక్కళ్లపల్లి వినిల్‌రావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, వినయ్ భాస్కర్

జిల్లా న్యాయవాదుల అభిమానం మరువలేనిది

వీడ్కోలు సమావేశంలో జిల్లా జడ్జి రమేష్‌బాబు

వరంగల్ లీగల్, ఏప్రిల్21 (ఆంధ్రజ్యోతి): జిల్లా జడ్జిగా కొంత కాలం పనిచేసినప్పటికీ హనుమకొండ జిల్లా న్యాయవాదుల ఆదరాభిమానాలు మరువలేనివని హనుమకొండ జిల్లా జడ్జి సీహెచ్ . రమేష్‌బాబు అన్నారు. సోమవారం హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో పరిపాలన విధుల నిర్వహణలో న్యాయవాదులు ఎంతో సహకరించారని ఒక ప్రత్యేకమైన అనుభూతితో హనుమకొండను విడిచి వెళ్తున్నానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొత్త రవి, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుధీర్, డి. రమాకాంత్, ఉపాధ్యక్షుడు మైదం జయపాల్, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ బైరపాక జయాకర్, ఉభయ జిల్లా కార్యవర్గ సభ్యులు,సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

డిప్యూటేషన్లపై జరిగిన అక్రమాలపై చర్యలేవీ?

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ డీఈవో కార్యాలయంలో డిప్యూటేషన్లు (వర్క్ అడ్జెస్ట్‌మెంట్లు)పై జరిగిన అక్రమాలపై చర్యలెప్పుడు తీసుకుంటారని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ ప్రశ్నించారు. సోమవారం వరంగల్‌లోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో అశోక్ మాట్లాడుతూ... ఉపాధ్యాయులు సర్దుబాటులో జరిగిన అన్ని అవకతవకలను పూర్తి ఆధారాలతో కలెక్టర్‌కు ప్రాతినిధ్యం చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా డీఈవో కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. డీసీఈబీలో అనేక అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని కాపాడేందుకు డీఈవో ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులకు ఉన్నత పదవులు కట్టబెట్టడం నిబంధనలకు విరుద్ధమన్నారు. డిప్యూటేషన్‌పై డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వెంటనే పాఠశాలలకు పంపించాలన్నారు. డీఈవో కార్యాలయంలో ఎయిడెడ్, ఇతరత్ర బిల్లులకు సంబంధించిన జాప్యాన్ని అరికట్టాలన్నారు. డీఈవో ఆఫీస్‌లోని ఎయిడెడ్ విభాగంలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

వక్ఫ్ చట్టంపై అపోహలు వద్దు

బీజేపీ రాష్ట్ర నేత సీతారాంనాయక్

వడ్డెపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టంపై ఆపోహాలు పెట్టుకోవద్దని బీజేపీ రాష్ట్ర నేత, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, డాక్టర్ టీ రాజేశ్వర్‌రావు, వన్నాల శ్రీరాములు అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్ చట్టానికి సంబంధించిన బిల్లు ఉభయ సభల్లో పాసైందని తెలిపారు. ఈ చట్టంపై అనేక అనుమానాలను రేకెత్తిస్తూ కొన్ని వర్గాలను రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతుందని తెలిపారు. వక్ఫ్ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు హనుమకొండ చౌరస్తాలోని ఎస్ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో 'వక్ఫ్ చట్టం అంటే ఏమిటి ?' అనే అంశంపై గోపాల్‌రావు స్మారక సమితి ప్రజ్ఞాభారతి - వరంగల్ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సుకు సీబీఐ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ, సీనియర్ జర్నలిస్టు రాకా సుధాకర్ పాల్గొంటారని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో గోపాల్‌రావు ఠాకూర్ స్మారక సమితి ప్రజ్ఞాభారతి - వరంగల్ ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ సమ్మిరెడ్డి, కో-కన్వీనర్లు బూర రాంచందర్, ప్రజ్ఞా భారతి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ప్రభాకర్‌రావు, బీజేపీ సీనియర్ నేత వీసం రమణారెడ్డి, టీ కిషన్‌రావు, జీనుగు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

డీజిల్ షెడ్ ఖ్యాతిని కాపాడాలి

సీనియర్ డీఎంఈ వెంకట కుమార్

కాజీపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఇండియర్ రైల్వేలో ఎంతో ప్రాచుర్యం పొందిన డీజిల్ షెడ్ ఖ్యాతిని కాపాడేందుకు కృషి చేయాలని సీనియర్ డీఎంఈ వెంకటకుమార్ అన్నారు. కాజీపేట డీజిల్ షెడ్‌లో సోమవారం షెడ్ 52వ ఆవిర్భావ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వెంకట కుమార్ కేక్ కట్ చేసి మాట్లాడారు. కాజీపేట డీజిల్ షెడ్‌లో పని చేసిన కార్మికులు ఇతర దేశాలకు వెళ్లి అక్కడి రైల్వే కార్మికులకు శిక్షణ ఇస్తున్న ఘనత మనకే దక్కుతుందన్నారు. ఇక్కడి రైల్వే కార్మికులు నిబద్ధతతో పనిచేయడం వల్లే అవార్డులు దక్కుతున్నాయని తెలిపారు. అనంతరం పలువురు రైల్వే కార్మికులు, అధికారులు డీజిల్ షెడ్ ప్రాధాన్యాన్ని తెలుపుతూ మాట్లాడారు. డీఎంఈ అనికేత్ ఖడ్గె, ఏడీఎంఈ నాగరాజశేఖర్, రైల్వే అధికారులు రబీంద్రకుమార్ పాల్గొన్నారు.



శానిటేషన్ సిబ్బందికి టోపీలు పంపిణీ చేసిన మేయర్, కమిషనర్

వేసవిలో ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో శానిటేషన్ సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు రక్షణ కవచాలు అవసరమని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం బల్దియా కార్యాలయంలో శానిటేషన్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. మేయర్ సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి శానిటేషన్ సిబ్బందికి టోపీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడారు. ప్రస్తుతం ఎండాకాలం రాక ముందే ఎండలు మండి పోతున్నాయని ప్రతీ శానిటేషన్ కార్మికుడు, కార్మికురాలు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ విధులు నిర్వర్తించాలని అన్నారు.

మలేరియా సిబ్బందితో సమీక్ష..

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ మలేరియా సిబ్బందితో మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సమీక్ష నిర్వహించారు. నగరంలో దోమల నివారణకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని మేయర్, కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఇంచార్జి సీపీ రవీంద్ర రాడేకర్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డితో పాటు శానిటేషన్, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య డాక్టర్
9
మంగళవారం • 22 ఏప్రిల్ 2025

సమ్మర్ కేర్

వేసవిలో చర్మం చెక్కుచెదరకుండా...



వేసవిలో చర్మ సమస్యలు సర్వసాధారణం. అలాగని వాటిని నిర్లక్ష్యం చేస్తే, ఇన్‌ఫెక్షన్లకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఎండ వేడి నుంచి చర్మాన్ని రక్షించుకునే ముందస్తు జాగ్రత్తలు పాటించాలంటున్నారు వైద్యులు.

సూర్యరశ్మిలోని పరారుణ కిరణాలు, అతినీలలోహిత కిరణాలు మన చర్మాన్ని ఎంతో కొంత దెబ్బతీస్తాయి. మరీ ముఖ్యంగా సున్నిత చర్మం కలిగిన వాళ్లకు ఈ సమస్యలు మరింత ఎక్కువ. దాంతో ఎండకు చర్మం నల్లబడడం, కమిలిపోవడం, గాయపడడం లాంటివి జరుగుతూ ఉంటాయి. వీటిని నివారించుకోవడం కోసం ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం!

చెమట పొక్కులకు విరుగుడు

ఈ కాలంలో దురదలు, ఉబ్బెత్తు పొక్కులతో చెమట పొక్కులు వేధించడం సహజం. ఎక్కువ చెమట పడుతున్నా, చెమట శరీరం మీదే ఆరిపోయినా, చెమట పీల్చుకోలేని, బిగుతైన దుస్తులు వేసుకున్నా చెమట పొక్కులు తప్పవు. మెడ, బాహుమూలలు, ఛాతీ, వెన్నులో ఎక్కువగా చెమట పొక్కులు తలెత్తుతూ ఉంటాయి. మరీ ముఖ్యంగా సూర్యరశ్మిని తట్టుకోలేని సున్నిత చర్మం కలిగి ఉన్నవారికి ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ సమస్యకు గురి కాకుండా ఉండాలంటే....

- గాలి చొరబడే, చెమట పీల్చే నూలు దుస్తులు వేసుకోవాలి
- రోజుకు రెండు నుంచి మూడు సార్లు చల్లనీటి స్నానం చేయాలి
- చర్మం మీద చెమట ఆరిపోకుండా చూసుకోవాలి
- ప్రతిసారీ సబ్బుతో రుద్ది స్నానం చేయకుండా ఒకట్రెండు సార్లు చల్ల నీళ్లతో ఒంటిని శుభ్రం చేసుకోవాలి
- బిగుతైన దుస్తులు వేసుకోకూడదు
- లేత రంగు దుస్తులే ఎంచుకోవాలి
- శరీర శుభ్రత పాటించాలి



చికిత్స ఇలా...

మందుల షాపుల్లో దొరికే క్యాలమైన్ లోషన్‌ను పైపూతగా వాడుకోవచ్చు. అలాగే దురదలు పెడుతున్నప్పుడు గోళ్లతో గోక్కోకూడదు. ఇలా చేస్తే ఇన్‌ఫెక్షన్‌గా మారే ప్రమాదం ఉంటుంది. ఒకవేళ చెమట పొక్కులు అదుపులోకి రాకుండా పెద్ద పుండ్లుగా మారితే చర్మ వైద్యులను ఆశ్రయించాలి. దురదను తగ్గించే లోషన్లు, యాంటీ హిస్టమిన్ మందులతో చెమట పొక్కులు సులువుగా అదుపులోకొస్తాయి.

సున్నిత చర్మంతో సమస్యలు

సాధారణంగా సున్నిత చర్మం కలిగిన వాళ్లు వేసవి వేడి, ఎండలకు మరింత ఇబ్బంది పడిపోతూ ఉంటారు. ఈ కోవకు చెందిన వాళ్లు వేసవిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఎండకు బహిర్గతం కాకుండా చూసుకోవాలి. ఒకవేళ ఈ సమయాల్లో ఎండలోకి వెళ్తే నుదురు, మెడ, ఛాతీ, ముంజేతులు ఇలా ఎండకు బహిర్గతమయ్యే ప్రదేశాల్లో చర్మం కమిలిపోతుంది. దురద కూడా వేధిస్తుంది. ఇలాంటివారు ఈ జాగ్రత్తలు పాటించాలి

- ముంజేతులు, మెడలను కప్పి ఉంచే దుస్తులు వేసుకోవాలి
- ఆరుబయట తిరిగే సమయాలను తగ్గించుకోవాలి
- ఆరుబయట ఈతకొలనుల్లో ఈతకు వెళ్లేటప్పుడు వాటర్ రెసిస్టెంట్ సన్‌స్క్రీన్స్ వాడుకోవాలి
- బయటకు వెళ్లేటప్పుడు 30 ఎస్‌పిఎఫ్ మించిన సన్‌స్క్రీన్స్ వాడుకోవాలి
- ప్రతి నాలుగు గంటలకూ సన్‌స్క్రీన్స్ పూసుకుంటూ ఉండాలి
- తలకు టోపీ, కళ్లకు చలువ కళ్లద్దాలు, గొడుగు వాడుకోవాలి

పిగ్మెంటేషన్ సమస్యలు

వేసవిలో ఎండకు ముందు నుంచీ ఉన్న మంగు సమస్య మరింత తీవ్రమవుతుంది. లేదంటే కొత్తగా మంగు సమస్య తలెత్తుతుంది. కాబట్టి ఈ కాలంలో తప్పనిసరిగా తగిన రక్షణ చర్యలు పాటించాలి. కళ్ల చుట్టూ చర్మం నల్లబడిపోకుండా చలువ కళ్లద్దాలు ఉపకరిస్తాయి.

ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు

ఈ కాలంలో కటి ప్రదేశంలో ఫంగల్ ఇన్‌ఫెక్షన్ ముప్పు కూడా ఎక్కువే! ప్రత్యేకించి ఎక్కువ సమయాల పాటు ఆరుబయట గడిపేవారు, వ్యాయామాలు చేసేవారు ఇంటికి వచ్చిన వెంటనే స్నానం చేయకుండా సేద తీరుతూ ఉండిపోతారు. ఇలాంటి సందర్భాల్లో, చెమట పట్టిన ప్రదేశాల్లో ఫంగస్ పెరిగే ప్రమాదం ఉంటుంది. అలాగే చర్మ రంధ్రాల నుంచి వెలువడే చర్మపు నూనెలు, చెమట కలిసి ఎగ్జిమా సమస్యను కూడా పెంచుతాయి.

వేసవి ఆహారం

ఈ కాలంలో చర్మపు ఆరోగ్యం కోసం పైపూతలు, ఎండను, వేడిని అడ్డుకునే జాగ్రత్తలు పాటించడంతో పాటు తగిన ఆరోగ్య నియమాలు కూడా పాటించాలి. అవేంటంటే...

- దానిమ్మ, గుమ్మడి, పుచ్చ, క్యారెట్, క్యాప్సికమ్ లాంటి ఎరుపు, నారింజ రంగు పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినాలి
- నీళ్లకే పరిమితం కాకుండా కొబ్బరినీళ్లు, మజ్జిగ, నిమ్మరసం తాగాలి
- పండ్ల రసాలకు బదులుగా పండ్లు తినడం అలవాటు చేసుకోవాలి
- శీతల పానీయాలు, చక్కెర కలిసిన పండ్ల రసాలు తాగకూడదు
- నూనెలో వేయించిన పదార్థాలు బాగా తగ్గించాలి

చర్మపు అలర్జీలు

ఎగ్జిమా పొడి వాతావరణంలోనే తీవ్రమవుతూ ఉంటుంది. కానీ అరుదుగా కొందర్లో వేసవిలో ఎక్కువ చెమట పట్టినప్పుడు, ముందు నుంచీ అలర్జీ తత్వం కలిగి ఉన్నప్పుడు ఎగ్జిమా వేధిస్తుంది. ఈ సమస్యను అదుపులో ఉంచుకోవడం కోసం నాణ్యమైన మాయిశ్చరైజర్ వాడుకోవాలి. అవసరానికి మించి సబ్బును ఉపయోగించడం వల్ల సహజసిద్ధ చర్మపు నూనెలు తొలగిపోతాయి కాబట్టి సబ్బు పరిమితంగా వాడుకోవాలి. అలాగే స్నానం చేసిన తర్వాత తడి లేకుండా టవల్‌తో శుభ్రంగా తుడుచుకున్న తర్వాతే దుస్తులు వేసుకోవాలి. మరీ ముఖ్యంగా కాలి వేళ్లు, బాహుమూలలు, కటి ప్రదేశాల్లో తడి లేకుండా చూసుకోవాలి.





డాక్టర్ హర్షిత రెడ్డి బొందుగుల
కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్,
అపోలో హాస్పిటల్స్,
జూబ్లీ హిల్స్ హైదరాబాద్

తెలుసుకుందాం



అరటితో బిపి దూరం

అధిక రక్తపోటున్న వాళ్లు రోజుకొక అరటిపండు తినాలంటున్నారు వైద్యులు. ఎందుకో తెలుసుకుందాం!

అరటిపండ్లలో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. ఒక అరటిపండులో దాదాపు 400 నుంచి 450 మిల్లీగ్రాముల పొటాషియం ఉంటుంది. అది మన దైనందిన పొటాషియం పరిమాణంలో పది శాతంతో సమానం. ఇంతకూ రక్తపోటుకూ పొటాషియంకూ సంబంధం ఏంటో తెలుసుకుందాం! పొటాషియం శరీరంలోని సోడియం దుష్ప్రభావాలను కుంటు పరుస్తుంది. ప్రాసెస్డ్ పదార్థాలు, చిరుతిళ్లు, నిల్వ పచ్చళ్లు, హోటల్ భోజనాల ద్వారా మనం అవసరానికి మించి ఉప్పు తింటూ ఉంటాం. ఈ సోడియం శరీరంలో నీటి నిల్వను పెంచుతుంది. ఫలితంగా రక్తపు పరిమాణం పెరిగి, రక్తపోటు పెరుగుతుంది. ఈ అదనపు సోడియంను మూత్రం ద్వారా బయటకు పంపించడంలో పొటాషియం సహాయపడుతుంది. కాబట్టి ఉదయం అల్పాహారానికీ, మధ్యాహ్న భోజనానికీ మధ్య ఒక అరటిపండు తినడం అలవాటు చేసుకోవాలి. ఈ పండుతో పాటు గ్లాసుడు నీళ్లు, గుప్పెడు నట్స్ కూడా తీసుకోవడం ఆరోగ్యకరం.

వ్యాయామం

చేతులు బలంగా!

ముంజేతులు చక్కని ఆకృతి సంతరించుకోవాలంటే ప్రత్యేకించి కొన్ని వ్యాయామాలు చేయాలి. వాటిలో చెప్పుకోదగినది 'ఛెయిర్ డిప్స్'. ఈ వ్యాయామం కోసం...


- దృఢంగా ఉండే కుర్చీని ఎంచుకోవాలి.
- కుర్చీని ఆనుకుని నేల మీద కూర్చుని, కాళ్లను పొడవుగా చాపి, రెండు చేతులను కుర్చీ మీద ఉంచి, చేతుల సహాయంతో శరీరాన్ని పైకి లేపాలి.
- పైకి లేచి, కిందకి కుంగేటప్పుడు కాళ్లు రెండు మోకాళ్ల దగ్గర వంచాలి.
- ఇలా చేస్తున్నప్పుడు పూర్తి శరీర బరువు చేతుల మీద పడుతుంది.
- ఇలా 20 సార్లు, వరుసగా 3 సెట్లు చేయాలి.
- ఈ వ్యాయామం వల్ల భుజాలు, వెన్ను, చేతుల్లోని కండరాలు బలపడతాయి.



నికొటిన్ చేటు

ఇ సిగరెట్స్ కూడా వ్యసనమే!

పొగ, దుర్గంధం సమస్య లేకుండా, చూపులకు ఆకర్షణీయంగా ఉంటుందనే ఉద్దేశంతో ఇటీవలి కాలంలో స్మోకింగ్‌కు బదులుగా 'ఇ సిగరెట్స్' విపరీతంగా ఊపందుకుంటోంది. అయితే ఈ అలవాటు కూడా ప్రమాదకరమేనని హెచ్చరిస్తున్నారు వైద్యులు.



ధూమపాన వ్యసనపరులకున్న ఆ దురలవాటును మాన్పించడం కోసం ఆవిష్కరించిన ఆధునిక ప్రత్యామ్నాయమే 'ఇ సిగరెట్స్'! నికొటిన్‌కు అలవాటు పడిన వాళ్లు అకస్మాత్తుగా ధూమపానాన్ని మానుకోవడం వల్ల విత్‌డ్రాయల్ లక్షణాలతో బాధపడవలసి వస్తుంది. కాబట్టి ప్రారంభంలో తక్కువ నికొటిన్‌ను కలిగి ఉండే ఇ సిగరెట్స్‌ను వైద్యులు సూచిస్తూ ఉంటారు. ఆ తర్వాత క్రమేపీ ఆ అలవాటును కూడా మాన్పించేస్తూ ఉంటారు. అయితే క్రమేపీ ఇ సిగరెట్స్ కూడా ఒక వ్యసనంగా మారిపోతూ ఉండడంతో ప్రభుత్వం ఇ సిగరెట్స్ పరికరాలను బహిష్కరించింది. అయినప్పటికీ విదేశాల నుంచి వీటిని దిగుమతి చేసుకుని వాడుకుంటున్న వారు లేకపోలేదు.

వేప్ అనర్థాలు ఇవే!

ఇ సిగరెట్స్‌గా పేరు పొందిన వేప్ పెన్స్, వేప్ జ్యూస్ అనే ఈ పరికరాల్లో ప్రొపైలీన్ గ్లైకాల్, ఫ్లేవరింగ్ ఏజెంట్లు, నికొటిన్ పైపూత కలిగిన ద్రవాలు ఉంటాయి. ధూమపానానికి మించి ఇ సిగరెట్స్ పట్ల ఆదరణ పెరగడానికి ప్రధాన కారణం, దీన్నుంచి పొగ వెలువడకపోవడమే! అలాగే మధురమైన వాసన కలిగి ఉండే ఇ సిగరెట్స్ చూపులకు స్టైల్‌గా కనిపిస్తూ ఉంటుంది. దీని వాడకంతో దంతాల రంగు మారే ప్రమాదం కూడా ఉండదు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో, కార్లలో, ఇంట్లో.. ఇలా ఎక్కడైనా ఉపయోగించే వీలు ఉండడంతో ఇ సిగరెట్స్ అన్ని వయసుల వారినీ ఆకట్టుకుంటోంది. అయితే ఇ సిగరెట్స్‌తో మెదడు, గుండె, ఊపిరితిత్తులు, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందనే విషయం గుర్తు పెట్టుకోవాలి.

అపోహలు వీడాలి

ఇ సిగరెట్స్ వాడకంతో ఊపిరితిత్తులు దెబ్బతింటున్న సందర్భాలు పెరుగుతూ ఉండడంతో ప్రపంచ దేశాలన్నీ అప్రమత్తమవడం మొదలుపెట్టాయి. ఇ సిగరెట్స్ అలవాటు, ధూమపాన వ్యసనాన్ని మించినది. దీన్ని మానుకోవడం చాలా కష్టం. దీన్ని ఉపయోగించడం మొదలుపెట్టిన వాళ్లు నికొటిన్‌కు మరింత అలవాటు పడడమే కాకుండా, తిరిగి ధూమపానానికి మళ్లే ప్రమాదం కూడా ఉంది. కాబట్టి ధూమపానం మానుకోవడం కోసం ఇ సిగరెట్స్ మీద ఆధారపడడం సరి కాదు. ఇ సిగరెట్స్‌తో ధూమపానం కోరిక మరింత పెరుగుతుంది. కాబట్టి ఈ దురలవాటును మానుకోవాలనుకునేవారు వైద్యులను కలిసి థెరపీ తీసుకోవాలి.

ప్యాచ్‌లు, చూయింగ్ గమ్‌లతో...

ఇ సిగరెట్స్ పరికరాలు బ్యాటరీతో పని చేస్తాయి. కాబట్టి దీర్ఘకాలంలో వీటి ప్రభావం శరీరం మీద ఏ మేరకు ఉండబోతున్నది ఎవరికీ తెలియదు. ఇ సిగరెట్స్‌తో ఒరిగే దీర్ఘకాలిక ఆరోగ్య దుష్ప్రభావాల గురించి మరింత లోతుగా అధ్యయనాలు జరగవలసిన అవసరం కూడా ఉంది. ఇ సిగరెట్స్‌తో నికొటిన్ మీద ఆధారపడే స్వభావం పెరుగుతుంది. కాబట్టి మొత్తంగా నికొటిన్ మీద ఆధారపడే స్వభావాన్ని తగ్గించుకోవాలి. దాన్నుంచి పూర్తిగా బయటపడడం కోసం కౌన్సెలింగ్‌ను ఆశ్రయించాలి. అలాగే నికొటిన్ అలవాటును క్రమేపీ తగ్గించుకోవడం కోసం నికొటిన్ ప్యాచ్‌లు, చూయింగ్ గమ్స్ వాడుకోవచ్చు. ధూమపానాన్ని ప్రేరేపించే అంశాలకు దూరంగా ఉండడం ద్వారా ఈ దురలవాటును పూర్తిగా వదులుకోవచ్చు.



డాక్టర్ ఎ. రఘుకాంత్
సీనియర్ కన్సల్టెంట్
ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైదరాబాద్.

పరిశోధన

నొప్పితో కుంగుబాటు

మూడు నెలలకు మించి తీవ్రమైన నొప్పి వేధిస్తూ ఉంటే, అంతిమంగా అది మానసిక కుంగుబాటుకు దారి తీస్తుందని పరిశోధనలో తేలింది. సైన్స్ అడ్వాన్సెస్‌లో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో శరీరంలోని వేర్వేరు ప్రాంతాల్లో తలెత్తే నొప్పుల వల్ల, సదరు వ్యక్తుల్లో మానసిక కుంగుబాటుకు గురయ్యే ముప్పు కూడా పెరుగుతూ ఉంటుందని పేర్కొనడం జరిగింది. మరిన్ని వివరాలు....



ప్రపంచవ్యాప్తంగా 30% మంది తీవ్రమైన నడుము నొప్పి, మైగ్రెయిన్ తదితర సమస్యలతో బాధపడుతున్నారు. వీళ్లలో ప్రతి ముగ్గురిలో ఒకరికి ఈ బాధలకు ఇతరత్రా నొప్పులు కూడా తోడవుతూ ఉంటాయి. నిజానికి నొప్పి శరీరానికే పరిమితం కాదు. భౌతిక బాధలు మానసిక ఆరోగ్య పరిణామాలకు దారి తీస్తాయి. ఈ విషయాన్ని నిర్ధారించడం కోసం యేల్ బృందం, యుకెలో బయోబ్యాంక్ దీర్ఘకాల అధ్యయనానికి పూనుకున్నాయి. దాన్లో భాగంగా 14 ఏళ్ల పాటు 4 లక్షల మందికి చెందిన ఆరోగ్య సమాచారాన్ని సేకరించి పరిశీలించినప్పుడు, తల, ముఖం, మెడ, వెన్ను, పొట్ట, పిరుదులు, మోకాళ్లు... ఇలా వేర్వేరు ప్రదేశాల్లో దీర్ఘకాల నొప్పులతో బాధపడేవారు మానసిక కుంగుబాటుకు కూడా గురవుతున్నట్టు తేలింది. అలాగే శరీరంలోని వేర్వేరు ప్రదేశాల్లో వేర్వేరు నొప్పులతో బాధపడేవారిలో మానసిక కుంగుబాటు తీవ్రత ఎక్కువగా ఉంటున్నట్టు కూడా పరిశోధకులు కనిపెట్టారు. ఇందు కోసం యేల్ పరిశోధకులు నొప్పితో బాధపడే వ్యక్తుల రక్తంలోని ఇన్‌ఫ్లమేటరీ మార్కర్లు, సి రియాక్టివ్ ప్రొటీన్స్, ప్లేట్‌లెట్లు, తెల్ల రక్త కణాలను పరిశీలించారు. వీటి ద్వారా నొప్పిని, మానసిక కుంగుబాటుతో ముడిపెట్టే ప్రాథమిక ఆధారాలను వాళ్లు కనిపెట్టగలిగారు. ఈ పరిశోధన ఆధారంగా భౌతిక ఆరోగ్యానికీ, మానసిక ఆరోగ్యానికీ మధ్య నెలకొని ఉన్న బంధాన్ని లోతుగా అర్థం చేసుకోవడం ద్వారా, నొప్పితో ముడిపడి ఉండే మానసిక కుంగుబాటును అరికట్టే దిశగా మరింత వినూత్నమైన వ్యూహాలను అభివృద్ధి చేయడం సాధ్యపడుతుందని పరిశోధకులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పిల్లల ఆరోగ్యం

సాధారణ ప్రసవంతో బిడ్డకు రక్ష



భారతదేశంలో ఐదో వంతు ప్రసవాలు సి సెక్షన్ ద్వారానే జరుగుతున్నాయి. నేషనల్ ఫ్యామిలీ సర్వేలో వెల్లడైన గణాంకాల ప్రకారం మన దేశంలో 2019 నుంచి 2021 మధ్య కాలంలో ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సి సెక్షన్లు 40.6 శాతం నుంచి 47.4 శాతానికి పెరిగాయి. అయితే సాధారణ ప్రసవం, సి సెక్షన్ ప్రసవాల్లో పుట్టిన పిల్లల పోషకావసరాలు ఒకేలా ఉంటాయని చాలా మంది తల్లితండ్రులు భావిస్తూ ఉంటారు. కానీ ఇది నిజం కాదని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. పిల్లల పేగుల్లోని బ్యాక్టీరియా, వ్యాధినిరోధక వ్యవస్థలు, దీర్ఘకాలికి ఆరోగ్యాలు వాళ్లు పుట్టిన తీరు మీదే ఆధారపడతాయి. సాధారణ ప్రసవంలో పుట్టిన పిల్లలు తల్లి బర్త్ కెనాల్ నుంచి ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను పొందుతారు. ఈ రకమైన ప్రసవం పేగుల్లోని బ్యాక్టీరియాను ప్రభావితం చేస్తుంది. కానీ సి సెక్షన్‌లో పుట్టిన పిల్లలు ఈ బ్యాక్టీరియాను పొందకపోగా, ఆస్పత్రి పర్యావరణం, తల్లి చర్మాల నుంచి మొట్టమొదటి మైక్రోబ్స్‌ను స్వీకరిస్తారు. సూక్ష్మజీవులకు బహిర్గతమవడంలో ఉన్న ఈ వ్యత్యాసాలు పిల్లల వ్యాధినిరోధక అభివృద్ధినీ, పేగుల ఆరోగ్యాన్నీ ప్రభావితం చేస్తాయి. సిజేరియన్‌తో పుట్టిన పిల్లల పేగుల బ్యాక్టీరియాలోని అవకతవకల వల్ల, ఈ పిల్లలు తేలికగా అలర్జీలు, ఇన్‌ఫెక్షన్లకు గురవుతూ ఉంటారు. దీర్ఘకాలంలో ఒబేసిటీ, టైప్1, టైప్2 మధుమేహాలు, నాడీసంబంధ రుగ్మతలు, ఆటిజం ముప్పు కూడా ఈ పిల్లలకు పొంచి ఉంటుంది. అయితే సాధారణ ప్రసవంలో పుట్టిన పిల్లల్లా ఈ పిల్లలు కూడా పూర్తి ఆరోగ్యాన్ని పొందాలంటే, ఘనాహారాన్ని పరిచయం చేసే తొలి రోజుల నుంచి ఆరోగ్యకరమైన పోషకాహారాన్ని పిల్లలకు అందించాలి.

ద్వంద్వ పిండిపదార్థాలు

మర్మం పిండిపదార్థాల్లోనే

ఎంత వ్యాయామం చేసినా, ఎన్ని ఆహార నియమాలు పాటించినా బరువు తగ్గడం లేదంటే అసలు సమస్య మనం తీసుకునే పిండిపదార్థాల్లోనే దాగి ఉంటుంది. అదెలాగంటే...



ఎక్కువ సందర్భాల్లో మనం రెండు రకాల పిండిపదార్థాలను కలిపి తింటూ ఉంటాం! దీన్నే డబుల్ కార్బింగ్ అంటున్నారు ఫిటెలోలో డైట్ కంపెనీలో పని చేస్తున్న ప్రముఖ డైటీషియన్ ఉమంగ్ మల్హోత్రా. అన్నం, బంగాళాదుంపల కూర, చపాతీ, పులావ్, పప్పు లేదా పాస్తా, బ్రెడ్... ఇలా ఒకే భోజనంలో రెండు రకాల పిండి పదార్థాలను కలిపి తినడం వల్ల భోజనంలోని పిండిపదార్థాల మోతాదు పెరిగిపోతుందనీ, దాంతో పాటే పోషకాల సంతులనం లేని క్యాలరీలు శరీరానికి తోడవుతూ ఉంటాయనీ అంటున్నారాయన. ఈ అదనపు పిండిపదార్థాల వల్ల రక్తంలో చక్కెర మోతాదులు త్వరితంగా పెరిగి, వాటితో పాటు ఇన్సులిన్ మోతాదులు పెరిగి, కొవ్వు పేరుకుపోతుందని హెచ్చరిస్తున్నారు. అత్యధిక పిండిపదార్థాలతో కూడిన ఆహారం తినడం ద్వారా శరీరంలో పెరిగే ఇన్సులిన్, పేరుకున్న కొవ్వును శరీరం కరిగించుకునే సామర్థ్యాన్ని కుంటుపరుస్తుందనీ, దాంతో బరువు తగ్గడం మరింత కష్టమవుతుందనీ హెచ్చరిస్తున్నారాయన. కాబట్టి ఒకే భోజనంలో రెండు పిండిపదార్థాలను ఎంచుకోడానికి బదులుగా అత్యధిక పీచు కలిగిన కూరగాయలు, లేదా ప్రొటీన్‌తో పిండిపదార్థాలను జోడించుకోవాలి. ఉదాహరణకు సోయా పులావ్ తింటున్నప్పుడు దాంతో పాటు కూరగాయల వేపుడు ఎంచుకోవాలి.

కృత్రిమ మేధతో ఉద్యోగాల ఊచకోత

» ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఉద్యోగాలు పోతాయి

» ఏఐపై బిల్‌గేట్స్, బరాక్ ఒబామా ఆందోళన



న్యూయార్క్, ఏప్రిల్ 21: స్మార్ట్‌ఫోన్ల ద్వారా సామాన్యుల చేతుల్లోకి సైతం వచ్చేసిన కృత్రిమ మేధ (ఏఐ) దెబ్బకు.. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఉద్యోగాలు పోతాయని మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు బిల్‌గేట్స్, అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సంక్షోభం ఏ స్థాయిలో ఉంటుందంటే.. గత వందేళ్లలో ఎప్పుడూ చూడనంత భారీగా ఉంటుందని వారు వేర్వేరు వేదికలపై నుంచి హెచ్చరించారు. సమీప భవిష్యత్తులో వైద్యసేవలు, బోధన వంటివి కూడా ఏఐ ద్వారా సామాన్యులకు ఉచితంగా అందుబాటులోకి వస్తాయని బిల్‌గేట్స్ జోస్యం చెప్పారు. రానున్న కాలంలో అనేక సమస్యలను కృత్రిమ మేధ పరిష్కరిస్తుందని, నవకల్పనలకు ఊతమిస్తుందని పేర్కొన్న ఆయన.. ఏఐ కారణంగా భవిష్యత్తులో ఏం జరగొచ్చో కచ్చితంగా చెప్పలేని అనిశ్చితి ఉందని, అదే చాలా భయం కలిగిస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. ఇక.. గతంలో ఏ సాంకేతిక పరిజ్ఞానం వల్ల వచ్చిన మార్పులూ చూపనంత ప్రభావాన్ని ఏఐ చూపుతుందని ఒబామా అన్నారు. ఏఐ ఆధారిత ఆటోమేషన్ వేగం పుంజుకుని, అన్ని రంగాల్లోనూ ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం పడుతుందని.. దీంతో ప్రజలు తమ జీవనోపాధి గురించి వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆందోళన వెలిబుచ్చారు. ఉదాహరణకు.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏఐ మోడళ్లు 60-70% మంది సాఫ్ట్‌వేర్ డెవలపర్ల కన్నా మిన్నగా కోడింగ్ చేయగలుగుతున్నాయని, త్వరలో వారి పని చాలావరకూ కృత్రిమమేధ పరమవుతుందని ఆయన హెచ్చరించారు. తమ పనితీరును మెరుగుపరచుకోవడానికి ఏఐను వాడే అత్యున్నతస్థాయి నైపుణ్యం కలిగిన వారి ఉద్యోగాలు తప్ప.. మిగతావారి ఉద్యోగాలు పోతాయని పేర్కొన్నారు. మరోవైపు, భారతదేశంలో మధ్యతరగతి వర్గానికి ఇన్నాళ్లుగా వెన్నెముకగా నిలిచిన వైట్ కాలర్ ఉద్యోగాల సంఖ్య భారీగా తగ్గిపోతోందని ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ సౌరభ్ ముఖర్జియా హెచ్చరించారు. పెరుగుతున్న ఆటోమేషన్, కృత్రిమ మేధ వంటివాటి కారణంగా సంప్రదాయ ఉద్యోగావకాశాలకు క్రమేపీ కోత పడుతోందని 'బియాండ్ పేచెక్: ఇండియాస్ ఆంత్రప్రెనరల్ రీబర్త్' పేరిట నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో ఆయన వ్యాఖ్యానించారు. వైట్ కాలర్ ఉద్యోగాలు ఎక్కువగా ఉండే ఐటీ, మీడియా, ఫైనాన్స్ రంగాల గురించి ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. తమ కోడింగ్ అవసరాల్లో 33% మేర కృత్రిమ మేధ తీరుస్తోందన్న గూగుల్ ప్రకటనను ఉటంకించారు. భారతీయ టెక్ కంపెనీల్లోనూ త్వరలో అదే ట్రెండ్ మొదలవుతుందని సౌరభ్ అంచనా వేశారు.

ఇన్‌స్టాలో మైనర్ల ఖాతాలపై ఏఐతో నిఘా

వాషింగ్టన్, ఏప్రిల్ 21: తప్పుడు వయసు చూపి ఇన్‌స్టాగ్రామ్ వాడుతున్న మైనర్ల ఖాతాలను కృత్రిమ మేధను ఉపయోగించి గుర్తించే ప్రయత్నం చేస్తున్నామని ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ మెటా తెలిపింది. యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకునే సమయంలో కొందరు మైనర్లు తమ వయసును ఎక్కువగా చూపుతున్నారని ఇన్‌స్టాగ్రామ్ అనుమానిస్తోంది. అలాంటి అకౌంట్లను గుర్తించడానికి క్రియాశీలకంగా వ్యవహరించాలని ఇన్‌స్టాగ్రామ్ నిర్ణయించింది. అటువంటి అకౌంట్లను గనక తాము గుర్తిస్తే, వాటిని మరిన్ని ఆంక్షలు కలిగిన మైనర్ అకౌంట్లుగా మారుస్తామని తెలిపింది. అకౌంట్ ఎప్పుడు క్రియేట్ చేశారు, అకౌంట్ ప్రొఫైల్, దానికి సంబంధించిన కంటెంట్ ఆధారంగా యూజర్ల వయసును నిర్ధారించే ప్రయత్నం చేస్తున్నామని సంస్థ తెలిపింది.

బంగారం.. లకారం!

రూ.లక్షకు చేరువైన పసిడి ధర.. ఆల్‌టైం రికార్డు గరిష్ఠానికి చేరిక

» అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం, బలహీన డాలరే ప్రధాన కారణాలు

» మున్ముందు ధరలు మరింత పైపైకే..!

» ఏడాది చివరి నాటికి భారత్‌లో రూ.1.23 లక్షలకు చేరే చాన్స్



10 గ్రాముల మేలిమి బంగారం రేటు

నగరం	(రూ.)
ఢిల్లీ	99,800
ముంబై	96,670
హైదరాబాద్	98,350

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇంట్లో పెళ్లి పెట్టుకున్న వారికి ముచ్చెమటలు పడుతున్నాయి. ఎందుకంటే, బయట ఎండలు.. నగల షాపుల్లో బంగారం భగ్గుమంటున్నాయి. పసిడి ధరలు సోమవారం సరికొత్త జీవితకాల రికార్డు గరిష్ఠానికి చేరాయి. 10 గ్రాముల బంగారం లకారాని (రూ.లక్ష)కి చేరువైంది. సోమవారం ఢిల్లీ మార్కెట్లో మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం మరో రూ.1,650 పెరిగి రూ.99,800కు చేరింది. అంటే, రూ.లక్ష మైలురాయికి కేవలం రూ.200 దూరంలో ఉంది. 99.5 శాతం స్వచ్ఛత లోహం రేటు కూడా రూ.1,600 పెరుగుదలతో రూ.99,300 పలికింది. పన్నులతో కలిపి లక్ష దాటింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు తులం బంగారం రూ.20,850 లేదా 26.41 శాతం పెరిగింది. కాగా, పుత్తడితోపాటు వెండి కూడా ఎగబాకుతోంది. కిలో వెండి రూ.500 పెరిగి రూ.98,500 ధర పలికింది. అంతర్జాయ మార్కెట్లో వీటి ధరలు అమాంతం పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని బులియన్ వర్గాలు వెల్లడించాయి. పెళ్లిళ్ల సీజన్ కావడంతో దేశీయంగానూ ఈ విలువైన లోహానికి డిమాండ్ పెంచింది.

గోల్డెన్ ర్యాలీ

ఇంటర్నేషనల్ స్పాట్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి 3,397.18 డాలర్లకు ఎగబాకింది. గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు ధరైతే ఏకంగా 80 డాలర్లు (2.4 శాతం) పెరిగి బులియన్ చరిత్రలో తొలిసారిగా 3,400 డాలర్ల మైలురాయిని దాటేసింది. ఔన్స్ సిల్వర్ సైతం 32.85 డాలర్లకు ఎగబాకింది. అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రతరం కావడంతో పాటు డాలర్ బలహీనపడుతుండటం, ఆర్థిక మాంద్యం భయాలు ఈ విలువైన లోహాల ధరలను మరింత ఎగదోశాయి. అంతర్జాతీయ అనిశ్చితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న బంగారంలోకి ఇన్వెస్టర్లు పెట్టుబడులను పెద్ద ఎత్తున మళ్లిస్తున్నారు. ఆయా దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు సైతం పసిడి నిల్వలను భారీగా పెంచుకుంటుండటం ఈ గోల్డెన్ ర్యాలీకి మరో కారణం.

పసిడి పరుగు ఎందాకా..?

వాణిజ్య యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితులు, మాంద్యం, ధరల పెరుగుదల వంటి భయాందోళనల నేపథ్యంలో బంగారం మరింత పెరగనుందని యూబీఎస్, గోల్డ్‌మన్ శాక్స్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, సిటీ గ్రూప్, మాక్వైరీ వంటి అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థలు భావిస్తున్నాయి. ఈ ఏడాది చివరి నాటికి ఔన్స్ గోల్డ్ 4,500 డాలర్ల వరకు పెరిగే అవకాశాల్లేకపోలేవని గోల్డ్‌మన్ శాక్స్, అంతర్జాతీయ ఆర్థిక సలహాల సంస్థ డెవేర్ గ్రూప్ అంచనా వేశాయి. అంటే, దేశీయంగా తులం బంగారం రూ.1.23 లక్షలకు చేరే అవకాశం ఉందన్నమాట. అయితే, దీర్ఘకాలికంగా గోల్డ్ బుల్లిష్‌గానే కన్పిస్తున్నప్పటికీ స్వల్ప, మధ్యకాలికంగా భారీ దిద్దుబాటుకు లోనుకావచ్చన్న అంచనాలూ ఉన్నాయి. వినియోగ డిమాండ్‌తో సంబంధం లేకుండా బంగారం ధర ఈ ఏడాదిలో అతివేగంగా పెరుగుతూ వచ్చిందని పేస్ 360 చీఫ్ గ్లోబల్ స్ట్రాటజిస్ట్ అమిత్ గోయల్ అన్నారు. వచ్చే 6-10 నెలల్లో ఔన్స్ గోల్డ్ ధర మళ్లీ 2,500 డాలర్ల వరకు పడిపోయే అవకాశాలున్నాయని ఆయన అంచనా వేశారు.

మధ్యతరగతిపై భారం

బంగారం మన ఆచార సంప్రదాయాల్లో భాగం. పండగలు, పెళ్లిళ్ల ఇతర శుభకార్యాలప్పుడు ఎంతో కొంత పసిడి కొనుగోలు చేస్తుంటారు భారతీయులు. గడిచిన ఏడాదిన్నర కాలంలో ధర చాలా వేగంగా పెరుగుతూ వచ్చింది. 2020 నాటి స్థాయితో పోలిస్తే దాదాపు రెట్టింపైంది. దాంతో మధ్యతరగతి వారికి బంగారం కొనుగోలు భారంగా మారింది. తక్కువ గ్రాముల్లో కొనుగోలు చేస్తున్నారు. దాంతో తేలికపాటి ఆభరణాలకు గిరాకీ పెరిగిందని వర్తకులంటున్నారు. అలాగే, చాలా మంది కస్టమర్లు 24-22 క్యారెట్లకు బదులు 18, 14 క్యారెట్ గోల్డ్ జువెలరీకి మొగ్గుచూపుతున్నారు. పసిడి కొండెక్కడం చిన్న నగల షాపుల యజమానులకు సంకటంగా మారింది. ధర అనూహ్యంగా పెరగడంతో గిరాకీ బాగా తగ్గిందని, వ్యాపారం 20-25% వరకు తగ్గిందని వారన్నారు. ఇందుకు తోడు బడా జువెలరీ షోరూమ్‌లు కస్టమర్లను ఆకర్షించేందుకు ప్రత్యేక ఆఫర్లు, డిస్కౌంట్లు ఆఫర్ చేస్తుండటంతో తమ వ్యాపారం మరింతగా దెబ్బతింటోందని వారు వాపోతున్నారు.

పాత బంగారం మార్చుకుంటున్నారు..

ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో చాలా మంది కస్టమర్లు తమ పాత బంగారు ఆభరణాలను కొత్త వాటితో మార్చుకుంటున్నారు. ప్రస్తుత కొనుగోళ్లలో 40-45 శాతం పాత బంగారం మార్పిడి ద్వారానే జరుగుతున్నాయని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంటోంది.

2000-2025 మధ్యకాలంలో బంగారం ధరలు

సంవత్సరం	(రూ.)
2025	99,800
2024	78,245
2023	63,203
2022	55,017
2021	48,099
2020	50,151
2015	24,931
2010	20,728
2005	7,638
2000	4,400

భారత మహిళల వద్ద 249.50 లక్షల కోట్ల పసిడి

ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) డేటా ప్రకారం భారత నారీమణులు దాదాపు 25,000 టన్నుల బంగారాన్ని కలిగి ఉన్నారు. ప్రస్తుత ధర ప్రకారం..ఆ బంగారం మొత్తం విలువ రూ.249.50 లక్షల కోట్లు. ప్రపంచవ్యాప్త స్వర్ణాభరణాల్లో 11% భారతీయ మహిళల వద్దే ఉన్నాయి. అంతేకాదు, మన మహిళల వద్ద ఉన్న బంగారం ఐదు అతిపెద్ద దేశాల వద్దనున్న మొత్తం నిల్వల కంటే అధికం. అగ్రరాజ్యం అమెరికా 8,000 టన్నులు, జర్మనీ 3,000 టన్నులు, ఇటలీ 2,450 టన్నులు, ఫ్రాన్స్ 2,400 టన్నులు, రష్యా 1,900 టన్నుల బంగారం నిల్వలను కలిగి ఉన్నాయి. భారత మహిళల్లో దక్షిణాది వారికి పసిడిపై అధిక ప్రీతి. దేశీయ స్వర్ణాభరణ నిల్వల్లో 40% దక్షిణాది మహిళలవే. తమిళనాడు వారి వాటా 28%. మన చట్టం ప్రకారం.. పెళ్లయిన ఆడవారు ఎలాంటి పన్ను చెల్లించనవసరం లేకుండా 500 గ్రాముల వరకు బంగారం కలిగి ఉండవచ్చు. పెళ్లి కానివారు 250 గ్రాములు, మగవారు 100 గ్రాముల వరకు పసిడిని కలిగి ఉండవచ్చు.



జస్టిస్ పెరుగు శ్రీసుధ



జస్టిస్ కాసోజు సురేందర్

తెలంగాణ హైకోర్టు నుంచి ఇద్దరు న్యాయమూర్తుల బదిలీ

» జస్టిస్ పెరుగు శ్రీసుధ కర్ణాటక హైకోర్టుకు

» జస్టిస్ కాసోజు సురేందర్ మద్రాస్‌కు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఏడుగురు హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం తీసుకుంది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం ఏప్రిల్ 15 నుంచి 19 వరకు జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. బదిలీ అయిన వారిలో కర్ణాటక హైకోర్టుకు చెందిన నలుగురు, తెలంగాణ హైకోర్టు నుంచి ఇద్దరు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఒకరు ఉన్నారు. కర్ణాటక హైకోర్టుకు చెందిన జస్టిస్ హేమంత్ చందన్ గౌడర్‌ను మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ కృష్ణన్ నటరాజన్‌ను కేరళ హైకోర్టుకు, జస్టిస్ నెరనహళ్లి శ్రీనివాసన్ సంజయ్ గౌడను గుజరాత్ హైకోర్టుకు, జస్టిస్ దీక్షిత్ కృష్ణ శ్రీపాద్‌ను ఒడిశా హైకోర్టుకు బదిలీ చేశారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పెరుగు శ్రీ సుధను కర్ణాటకకు, జస్టిస్ కాసోజు సురేందర్‌ను మద్రాస్ హైకోర్టుకు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావును కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలీజియం నిర్ణయం తీసుకుంది.

500 నోట్లతో జాగ్రత్త!

» స్పెల్లింగ్ దోషంతో మార్కెట్లోకి నకిలీ నోట్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: అత్యాధునిక టెక్నాలజీ వినియోగించి నేర ముఠాలు తయారు చేసిన నకిలీ 500 రూపాయల నోట్లు మార్కెట్లోకి వచ్చాయని కేంద్ర హోం శాఖ హెచ్చరించింది. దాదాపుగా అసలు నోట్లను పోలి ఉన్న నకిలీ నోట్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నాణ్యత, ముద్రణపరంగా ఒరిజనల్ నోట్లను పోలి ఉన్నాయని, చాలా పరీక్షగా గమనిస్తే తప్ప తేడా తెలియని విధంగా నకిలీ నోట్లు ఉన్నాయని పేర్కొంది. అసలు నోట్లకు, నకిలీ నోట్లకు మధ్య చిన్న స్పెల్లింగ్ దోషం మాత్రమే తేడా ఉందని, నకిలీ నోట్లను గుర్తించడంలో ఇదే కీలకమని వెల్లడించింది. కరెన్సీ నోట్లపై RESERVE BANK OF INDIA అని ఉంటుందని, అయితే నకిలీ 500 రూపాయల నోట్లపై RESERVE అనే పదంలో E కి బదులుగా A అని ఉంటుందని.. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ స్పష్టంగా పరిశీలించాలని అప్రమత్తం చేసింది. ఈ సూక్ష్మమైన తేడాను నిశితంగా పరిశీలించకపోతే నకిలీ నోట్లను గుర్తించడం కష్టమని, ఇవి అత్యంత ప్రమాదకరమైనవని ఓ సీనియర్ అధికారి అన్నారు. నకిలీ నోట్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, సంబంధిత సంస్థలను అలర్ట్ చేసినట్టు కేంద్ర హోం శాఖ వెల్లడించింది. ఇప్పటికే పెద్ద మొత్తంలో మార్కెట్‌లోకి వచ్చి ఉండొచ్చని పేర్కొంది.

చిత్రజ్యోతి

SINCE 1965

సంగీత మహోత్సవం



మధుర గాయని కె.ఎస్.చిత్ర తన 45 ఏళ్ల సినీ సంగీత పయనంలో ఎన్నో అద్భుత గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా జూన్ 14న 'చిత్రామృతం 2.0' పేరుతో సంగీత మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను గాయకుడు, నటుడు ఎస్.పి. చరణ్, గీత రచయిత చంద్రబోస్ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా చరణ్ మాట్లాడుతూ 'కాలాన్ని దాటి మనసుల్ని తాకే శక్తి చిత్రగారి గానానికి ఉంది. మా నాన్న బాలుగారితో కలసి పాడిన ఎన్నో అద్భుత గీతాలు మరచిపోలేని జ్ఞాపకాలు' అని చెప్పారు. చంద్రబోస్ మాట్లాడుతూ 'నేను రాసిన ఎన్నో పాటలకు చిత్రగారు ప్రాణం పోశారు. పాటల మాటలకు జీవం పోసే మధురమైన గొంతు ఆవిడది' అన్నారు. జూన్ 14న 'చిత్రామృతం 2.0' కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఎక్కడ నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామని నిర్వాహకులు చెప్పారు.

అందుకే ఆ పోస్ట్‌కు లైక్ కొట్టిందా!



సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉండే తారల్లో సమంత ఒకరు. ఆరోగ్యం, వ్యక్తిత్వం, మహిళా సాధికారత, వర్క్‌లైఫ్ తదితర విషయాలను తరచూ ఇన్‌స్టా పోస్ట్ లేదా స్టోరీస్ ద్వారా షేర్ చేస్తుంటారు ఆమె. తాజాగా, ఓ ఇన్‌స్టా పేజీలోని పోస్ట్‌ను ఆమె లైక్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఓ సర్వే ఆధారంగా భార్యభర్తల మధ్యనున్న అనుబంధాన్ని తెలిపే పోస్ట్ అది. 'జీవిత భాగ్యస్వామి అనారోగ్యానికి గురైతే భర్త ఆమెను వది లేయడానికి సిద్ధపడుతున్నాడు. కానీ, భార్య అలా కాదు. భర్తకు ఎలాంటి అనారోగ్యం ఉన్నా, అతన్ని వదులుకోవడానికి ఇష్టపడదు. భార్యతో ఎమోషనల్ అటాచ్‌మెంట్ లేకపోవడం వల్లే భర్త ఇలాంటి నిర్ణయం తీసుకుంటున్నాడు' అన్నది ఆ పోస్ట్ సారాంశం. ఇది చూసిన నెటిజన్లు ఆమె వ్యక్తిగత జీవితంతో ఈ పోస్ట్‌కు ముడిపెడుతున్నారు. కాగా, నిర్మాతగా సమంత రూపొందించిన తొలి చిత్రం 'శుభం' మే 9న విడుదల కానుంది.



అందరినీ హాయిగా నవ్విస్తుంది

- శివలెంక కృష్ణప్రసాద్



"జెంటిల్‌మెన్, 'సమ్మోహనం' తర్వాత ఇంద్రగంటి మోహన కృష్ణ- నా కాంబినేషన్‌లో హ్యాట్రిక్ హిట్ రాబోతోంది. మోహన్‌కృష్ణ కథ, కథనం అందరినీ ఆకట్టుకుంటాయి. సినిమా హాయిగా నవ్విస్తుంది' అని అన్నారు నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్. ప్రియదర్శి, రూప కొడువాయుర్ జంటగా ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో 'సారంగపాణి జాతకం' సినిమాను శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ప్రియదర్శి అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో అందరినీ నవ్విస్తారు. పూర్తి వినోదాన్ని అందిస్తూ పైసా వసూల్ అని అనిపించేలా సినిమాను అద్భుతంగా తెరకెక్కించాం. జంధ్యాల, ఈవీవీ స్టయిల్‌తో ఇంద్రగంటి మార్క్‌ను మేళవించి ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా ఈ చిత్రాన్ని రూపొందించాం. ఏప్రిల్ 18న థియేటర్లు దొరక్కపోవడంతో విడుదల తేదీని ఏప్రిల్ 25కి మార్చాం. దేశవ్యాప్తంగా భారీ ఎత్తున, ఓవర్సీస్‌లో 220కి పైగా థియేటర్లలో విడుదల చేస్తున్నాం' అని చెప్పారు.

నన్నే టార్గెట్ చేస్తున్నారు



షైన్ టామ్‌చాకో

'నేనొక్కడినే డ్రగ్స్ తీసుకోవట్లేదు. నాతో పాటు చాలా మంది ఇండస్ట్రీలో ఆ పని చేస్తున్నారు. కానీ, నన్ను, మరో నటుడ్ని మాత్రమే టార్గెట్ చేస్తున్నారు' అని మలయాళ నటుడు షైన్ టామ్‌చాకో వాపోయారు. డ్రగ్స్ వాడాడన్న ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఇటీవలె ఆయనను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. దాదాపు నాలుగు గంటల పాటు జరిగిన పోలీసు విచారణలో భాగంగా ఆయన పలు విషయాలు వెల్లడించారు. 'నేను ఆ రోజు హోటల్‌కు తెలిసిన అమ్మాయిని కలవడానికి వెళ్లాను. నేను పోలీసులు నుంచి తప్పించుకొని పారిపోవడానికి భవంతి దూకి వెళ్లలేదు. నాకు ఓ చిత్రబృందంతో గొడవ జరిగింది. ఆ కారణంగానే భయంతో అలా పారిపోవాల్సి వచ్చింది. నేను నటి విన్సీసోనీతో అసభ్యంగా ప్రవర్తించలేదు. డ్రగ్స్‌ను కొందరు మధ్యవర్తులు అమ్మేవారు. వారే సెట్స్‌కు కూడా తెచ్చి ఇచ్చేవారు" అని పేర్కొన్నారు. ఈ విచారణలో భాగంగా ఆయన ఫోన్‌లోని బ్యాంక్ లావాదేవీలను తనిఖీ చేశారు పోలీసులు. అందులో ఆయన 14మందికి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు గుర్తించారు. దీని గురించి ఆయనను ప్రశ్నించగా, అప్పుగా ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం బెయిలుపై ఉన్న ఆయనను త్వరలోనే పోలీసులు మరోసారి విచారించనున్నారు. ఇదిలా ఉంటే నటి విన్సీసోనీ అలోషియస్ ఇటీవలె షైన్ టామ్‌చాకో పేరు ప్రస్తావించకుండా ఓ నటుడు లైంగిక వేధింపులు చేశాడంటూ ఆరోపిస్తూ కేరళ ఫిల్మ్‌ఛాంబర్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా, ఈ విషయంపై ఆమె మీడియాతో మాట్లాడారు. 'నేను ఫిల్మ్ ఛాంబర్‌లో చేసిన ఫిర్యాదులో ఆ వ్యక్తి పేరు బహిర్గతం చేయొద్దని అధికారులను కోరాను. నేను ఆయనపై చట్టపరంగా ఎలాంటి యాక్షన్ తీసుకోవాలనుకోవట్లేదు. ఇది ఇండస్ట్రీలో ఉత్పన్నమైన సమస్య. దీనికి ఇండస్ట్రీలోనే పరిష్కారం దొరకాలి. మలయాళ చిత్ర పరిశ్రమలో నేను మార్పుని చూడాలనుకుంటున్నాను. అందుకే ఫిర్యాదు చేశా. నేను చేసిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలనుకోవడం లేదు" అని పేర్కొన్నారు.

అందరినీ మెప్పిస్తుంది



జేపీ నవీన్, శ్రావణి శెట్టి జంటగా నటించిన చిత్రం 'ఏ.ఎల్.సి.సి' (ఓ యూనివర్సల్ బ్యాచిలర్). లేలేధర్‌రావు కోలా స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ నెల 25న సినిమాను విడుదల చేస్తున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు లేలేధర్‌రావు మాట్లాడుతూ "సినిమా అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుంది. చిత్రం కోసం టీమ్ ప్రాణం పెట్టి పనిచేసింది" అని అన్నారు. "ఈ సినిమాకు కథ, విజువల్స్, సంగీతం ప్రధానాకర్షణ" అని హీరో జేపీ నవీన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్శకులు సముద్ర, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సహనటితో హాలీవుడ్ హీరోయిన్ పెళ్లి



స్క్రీన్‌ప్లే రచయిత్రి, నటి డైలాన్ మేయర్‌తో ఆరేళ్లుగా రిలేషన్‌లో ఉన్న అమెరికన్ హీరోయిన్, 'ట్విలైట్' ఫేమ్ క్రిస్టిన్ స్టీవార్ట్ ఆదివారం నాడు ఆమెను పెళ్లి చేసుకున్నారు. వీరిద్దరి వివాహానికి సమ్మతిస్తూ అక్కడి ప్రభుత్వం ఇచ్చిన సర్టిఫికెట్ చేతికందాక వీరి వివాహం జరగడం గమనార్హం. లాస్ ఏంజెల్స్‌లో వీరిద్దరూ ఉంటున్న ఇంట్లోనే జరిగిన ఈ వివాహానికి అతికొద్ది మంది మాత్రమే హాజరయ్యారు. స్టీవర్ట్‌కు ఇది రెండో వివాహం. అంతకుముందే ఇద్దరితో డేటింగ్ చేసిన ఈ అమెరికన్ నటి 2012లో తనకంటే 19 ఏళ్లు పెద్దవాడైన దర్శకుడు రూబర్ట్ శాండర్స్‌ను పెళ్లి చేసుకున్నారు. అయితే ఏడాది కాలంలోనే వీరిద్దరూ విడిపోయారు. 2019లో డైలాన్ మేయర్ పరిచయం కావడం, ప్రేమలో పడడం జరిగాయి. 2021లో వీరి ఎంగేజ్‌మెంట్ జరిగినా, ప్రభుత్వపరమైన అనుమతి రాకపోవడంతో పెళ్లి ఆలస్యమైంది.

విభిన్న తరహా ప్రేమకథ



రవిప్రకాశ్ రెడ్డి, సమీర్ దత్త, రమ్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం '6 జర్నీ'. బసీర్ ఆలూరి దర్శకత్వంలో పాల్యం రవిప్రకాశ్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు బసీర్ మాట్లాడుతూ "సినిమా తప్పకుండా అందర్నీ మెప్పిస్తుంది" అని అన్నారు. "ఇదో విభిన్న తరహా ప్రేమకథ గల చిత్రం" అని హీరో సమీర్ దత్త చెప్పారు.

సరికొత్త ప్రేమ కథ



బిగ్ బాస్ ఫేమ్ అమర్‌దీప్ చౌదరి హీరోగా, సైలీ చౌదరి హీరోయిన్‌గా నూతన దర్శకుడు ఎం.ఎం.నాయుడు తెరకెక్కిస్తోన్న సినిమా 'సుమతీ శతకం' సోమవారం అమరావతిలో ప్రారంభమైంది. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మిస్తున్నారు. ముహూర్తం షాట్‌కు పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ క్లాప్ కొట్టగా, వెన్నా సాంబశివారెడ్డి కెమెరా స్విచ్చాన్ చేశారు. సరికొత్త ప్రేమ కథగా తెరకెక్కనున్న ఈ చిత్రానికి బండారు నాయుడు కథను అందించగా, సుభాశ్ ఆనంద్ సంగీతం సమకూర్చుతున్నారు.

ఇక నేరుగా సెబీ మధ్యవర్తిత్వం!

న్యూఢిల్లీ: ఎంపిక చేసిన కొన్ని కేసుల్లో ఇక నేరుగా మధ్యవర్తిత్వానికి దిగాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ యోచిస్తోంది. దీనికి సంబంధించి ఒక చర్చా పత్రం విడుదల చేసింది. సంబంధిత పార్టీలు వచ్చే నెల 12లోగా ఈ చర్చా పత్రంపై తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. అయితే ఏ కేసుల్లో పడితే ఆ కేసుల్లో గాకుండా కనీసం రూ.10 కోట్లు లేదా అంతకు మించిన వివాదాలు తలెత్తే కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివాదాలు, ఒకే అంశంపై పదేపదే తలెత్తే కేసుల్లో మాత్రమే ఈ మధ్యవర్తిత్వం జరపాలని సెబీ యోచిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే ఉన్న ఆన్‌లైన్ డిస్ప్యూట్ రిసొల్యూషన్ (ఓడీఆర్) వ్యవస్థనీ సమూలంగా మార్చేయాలని సెబీ యోచిస్తున్నట్టు సమాచారం.

పక్కాగా ఇన్‌సైడర్ నిబంధనలు: లిస్టెడ్ కంపెనీల షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌ను కట్టడి చేసేందుకు సెబీ మరో కీలక చర్య తీసుకుంది. ఈ నిషేధం పరిధిలోకి వచ్చే వ్యక్తుల జాబితాను మరింత విస్తరించింది. లిస్టెడ్ కంపెనీల ప్రమోటర్లు, బోర్డు సభ్యులు, కీలక ఉద్యోగులు, ఆడిటర్లతో పాటు వారి సమీప బంధువులను కూడా ఈ జాబితాలో చేర్చింది. కంపెనీలు వీరి వివరాలను ఆయా కంపెనీల షేర్ల ట్రేడింగ్ విండో క్లోజ్ చేసేందుకు రెండు మూడు రోజుల ముందే డిపాజిటరీలకు తెలియజేయాలని స్పష్టం చేసింది. ఈ నిషేధాన్ని రెండు దశల్లో అమలు చేస్తారు. మొదటి దశ జూలై 1 నుంచి టాప్-500 లిస్టెడ్ కంపెనీల షేర్లకు, అక్టోబరు 1 నుంచి మిగతా కంపెనీల షేర్లకు అమలు చేస్తారు.

5 రోజులు రూ.32 లక్షల కోట్లు

మార్కెట్ ర్యాలీలో భారీగా పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

ముంబై: ఈక్విటీ మార్కెట్ అద్భుతమైన ర్యాలీలో అప్రతిహతంగా దూసుకుపోతోంది. ఫలితంగా ఐదు వరుస ట్రేడింగ్ సెషన్లలో బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ ఐదు సెషన్లలో నికరంగా రూ.32,03,295.80 కోట్లు పెరిగి రూ.4,25,85,629.02 కోట్లకు (5 లక్షల కోట్ల డాలర్లు) చేరింది. సోమవారం సర్వత్రా నెలకొన్న సానుకూల సంకేతాల నేపథ్యంలో సెన్సెక్స్ 855.30 పాయింట్లు లాభపడి 79,408.50 వద్ద ముగిసింది. నిఫ్టీ 273.90 పాయింట్లు లాభపడి 24,125.55 వద్ద క్లోజయింది. ఐదు వరుస ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 5,561.35 పాయింట్లు, నిఫ్టీ 1,726.40 పాయింట్లు లాభపడ్డాయి. బ్యాంకింగ్ షేర్లలో సాగిన కొనుగోళ్ల మద్దతుతో బ్యాంక్ నిఫ్టీ సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయి 55,200 వరకు దూసుకుపోయింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ పైన, ట్రంప్ అస్తవ్యస్త టారిఫ్ విధానం పైన విశ్వాసం కోల్పోయిన విదేశీ ఇన్వెస్టర్లు తిరిగి భారత మార్కెట్‌పై దృష్టి సారించారు. గత వారంలో ట్రేడింగ్ జరిగిన మూడు రోజుల్లో ఎఫ్‌పీఐలు నికరంగా రూ.8,472 కోట్ల విలువ గల కొనుగోళ్లు నిర్వహించారు. మార్కెట్‌పై బుల్స్ పట్టు సాధించాయని, మూడు నెలల కాలంలో జరిగిన మూడో ప్రయత్నంలో నిఫ్టీ 24,000 కన్నా పైన ముగిసిందని, బ్యాంక్ నిఫ్టీ కూడా కొత్త రికార్డు స్థాయిలో ముగిసిందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు.

- సోమవారం నాటి ర్యాలీ అన్ని రంగాలకు విస్తరించింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 2.20%, స్మాల్‌క్యాప్ సూచీ 1.67% లాభపడ్డాయి. బీఎస్ఈలోని రంగాల వారీ సూచీలన్నీ కూడా 2% పైబడి లాభపడ్డాయి.
- గత వారంలో ఆర్థిక ఫలితాలు ప్రకటించిన నేపథ్యంలో ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ షేరు బీఎస్ఈలో 2.13% లాభపడి రూ.1,450.45 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.12,563.63 కోట్ల మేరకు పెరిగి రూ.6,02,410.10 కోట్ల వద్ద స్థిరపడింది.
- బీఎస్ఈలో ఐసీఐసీఐ బ్యాంక్ షేరు ఇంట్రాడేలో 2.15% మేరకు లాభపడి 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.1,437ని తాకినప్పటికీ చివరికి 0.20% లాభంతో రూ.1,409.40 వద్ద ఫ్లాట్‌గా ముగిసింది.
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 1.10% లాభంతో రూ.1,927.55 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేరు 2.27% లాభంతో 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.1,950ని తాకింది.



రూపాయిదీ అదే ర్యాలీ

ఈక్విటీ మార్కెట్ తరహాలోనే ఫారెక్స్ మార్కెట్లో కూడా డాలర్ మారకంలో రూపాయి అద్భుతమైన ర్యాలీని సాధించింది. ఐదో రోజు కూడా ర్యాలీని కొనసాగించిన రూపాయి డాలర్ విలువతో పోల్చితే 23 పైసలు లాభపడి 85.15 వద్ద ముగిసింది. డాలర్ ఇండెక్స్ బలహీనపడి మూడు సంవత్సరాల కనిష్ఠ స్థాయి 99ని బ్రేక్ చేయడం ఇందుకు దోహదపడిందని ఫారెక్స్ విశ్లేషకులంటున్నారు. ఈ నెల 9వ తేదీన 86.68 వద్ద ముగిసిన రూపాయి ఆ తర్వాత 5 వరుస ట్రేడింగ్ సెషన్ల ర్యాలీలో 155 పైసలు బలపడింది. డాలర్ బలహీనపడిన కారణంగా సమీప భవిష్యత్తులో రూపాయి 84.80-8535 మధ్యన ట్రేడ్ కావచ్చని విశ్లేషకులంటున్నారు.

బీఓబీలో వాటా పెంచుకున్న ఎల్ఐసీ

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ)లో వాటాను 2% మేరకు పెంచుకోవడంతో ప్రస్తుతం అది 7.05 శాతానికి చేరింది. గత ఏడాదిన్నర కాలంలో బీఓబీకి చెందిన 10.45 కోట్ల షేర్లను కొనుగోలు చేసినట్టు ఎల్ఐసీ తెలిపింది.

రామ్‌రాజ్ కాటన్ నుంచి 'మృదు టవల్స్'

ప్రచారకర్తగా మీనాక్షి చౌదరి



చెన్నై (ఆంధ్రజ్యోతి): సాంప్రదాయ, ఎథ్నిక్ వేర్ కంపెనీ రామ్‌రాజ్ కాటన్.. ప్రీమియం హోమ్ టెక్స్‌టైల్ విభాగంలోకి ప్రవేశించింది. 'మృదు టవల్స్' తో రామ్‌రాజ్ ఈ విభాగంలోకి అడుగుపెట్టింది. ఈ టవల్స్ కోసం ప్రముఖ సినీ నటి మీనాక్షి చౌదరిని బ్రాండ్ అంబాసిడర్‌గా రామ్‌రాజ్ కాటన్ నియమించుకుంది. ఈ సందర్భంగా రామ్‌రాజ్ కాటన్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ ఈశ్వర్ మాట్లాడుతూ.. మృదు టవల్స్‌ను వంద శాతం కాటన్, వెదురు నారతో తయారు చేసినట్లు చెప్పారు. కస్టమర్ల అవసరాలకు తగ్గట్టుగా ఈ టవల్స్‌ను అత్యుత్తమ నాణ్యత, వినూత్నమైన డిజైన్లతో తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. కాగా రామ్‌రాజ్ మృదు టవల్స్‌కు ప్రచారకర్తగా ఎంపిక కావటం తనకెంతో ఆనందంగా ఉందని మీనాక్షి చౌదరి అన్నారు.

స్టీల్ దిగుమతులకు చెక్

12 శాతం ప్రత్యేక సుంకం విధింపు

న్యూఢిల్లీ: దేశీయ స్టీల్ పరిశ్రమ ప్రయోజనాల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం సోమవారం కీలక చర్య తీసుకుంది. హెచ్‌ఆర్ కాయిల్స్, షీట్లు, ప్లేట్లు, సీఆర్ కాయిల్స్, షీట్లు వంటి ఐదు రకాల స్టీల్ దిగుమతులపై వాటి విలువపై 12 శాతం చొప్పున సేఫ్‌గార్డ్ డ్యూటీ పేరుతో ప్రత్యేక దిగుమతి సుంకం విధిస్తున్నట్టు ప్రకటించింది. ఇందుకోసం ఈ స్టీల్ ఉత్పత్తుల కనీస దిగుమతి ధరను టన్నుకు 675 డాలర్ల నుంచి 964 డాలర్లుగా నిర్ణయించింది. ఈ ధర కంటే తక్కువ ధరకు దిగుమతి అయ్యే స్టీల్ ఉత్పత్తులకు మాత్రమే ఈ 12 శాతం సుంకం వర్తిస్తుంది. ఈ సుంకం 200 రోజుల పాటు అమల్లో ఉంటుంది. చైనాతో సహా వివిధ దేశాల నుంచి చౌకగా వచ్చిపడే దిగుమతులకు చెక్ పెట్టేందుకు కేంద్రం ఈ చర్య తీసుకుంది.

ఆయుధాల తయారీలోకి మేఘా గ్రూప్

హైదరాబాద్‌లో కారకాల్, ఐకామ్ ప్లాంట్ ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) చిన్న తరహా ఆయుధాల తయారీలోకి ప్రవేశించింది. కంపెనీ అనుబంధ సంస్థ ఐకామ్ టెలీ లిమిటెడ్, యూఏఈకి చెందిన ఎడ్జ్ గ్రూప్‌తో కలిసి ఈ ఆయుధాల తయారీ చేపట్టింది. హైదరాబాద్‌లోని ఐకామ్ సమీకృత ఇంజనీరింగ్ కేంద్రంలో ఈ చిన్న ఆయుధాల తయారీ ప్లాంట్‌ను ప్రారంభించింది. ఎడ్జ్ గ్రూప్ అనుబంధ సంస్థ కారకాల్ ఈ ఆయుధాల తయారీకి అవసరమైన పూర్తి టెక్నాలజీని ఐకామ్ టెలీకి అందిస్తోంది. ఈ టెక్నాలజీ సాయంతో ఐకామ్ తన ప్లాంట్‌లో ఈ చిన్న తరహా ఆయుధాలను తయారు చేసి భారత సైన్యం, పారా మిలిటరీ దళాలకు సరఫరా చేస్తుంది.

తగ్గిన పిట్టీ ఇంజనీరింగ్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో పిట్టీ ఇంజనీరింగ్ నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జనవరి-మార్చి త్రైమాసికానికి గాను కంపెనీ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.472.30 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.36.14 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.46 కోట్లు)తో పోల్చితే లాభం 21.43 శాతం తగ్గగా ఆదాయం మాత్రం 28.54 శాతం పెరిగింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.1,743.36 కోట్ల ఆదాయంపై రూ.122.29 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2023-24తో పోల్చితే ఆదాయం 34.87 శాతం పెరగగా లాభం 36.33 శాతం వృద్ధి చెందింది. మార్చి ముగిసే నాటికి కంపెనీ నికర రుణ భారం రూ.439.04 కోట్లుగా ఉంది. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ డైరెక్టర్ల బోర్డు రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.1.50 (30 శాతం) డివిడెండ్‌ను సిఫారసు చేసింది.

హైదరాబాద్‌లో డైఫుకు యూనిట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో మరో జపాన్ కంపెనీ తన యూనిట్‌ను ప్రారంభించింది. ఇంట్రాలాజిస్టిక్స్, మెటీరియల్ హ్యాండ్లింగ్ ఆటోమేషన్‌లో పేరొందిన డైఫుకు కంపెనీ హైదరాబాద్‌లో తన అధునాతన తయారీ, ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. డైఫుకు ఇంట్రాలాజిస్టిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరు తో కంపెనీ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. మేకిన్ ఇండియాలో భాగంగా ఈ యూనిట్ ఏర్పాటు చేసినట్టు తెలిపింది.

హైదరాబాద్ రియల్టీలోకి సెర్టస్ క్యాపిటల్

సైబర్‌సిటీ బిల్డర్స్‌లో రూ.180 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ సెర్టస్ క్యాపిటల్ తన కార్యకలాపాలను హైదరాబాద్ రియల్టీకీ విస్తరించింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన సైబర్‌సిటీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్, హైటెక్ సిటీ సమీపంలో నిర్మించే రెసిడెన్షియల్ ప్రాజెక్టులో రూ.180 కోట్లు పెట్టుబడి పెట్టింది. హైదరాబాద్ రియల్టీలో తమకు ఇదే తొలి పెట్టుబడి అని తెలిపింది.

మైనర్లూ.. మీ బ్యాంక్ అకౌంట్ మీరే ఆపరేట్ చేసుకోండి

అనుమతించిన ఆర్‌బీఐ

ముంబై: ఇక నుంచి మైనర్లు బ్యాంక్ అకౌంట్ స్వయంగా ఆపరేట్ చేసుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అనుమతించింది. 10 సంవత్సరాల వయసు పైబడిన మైనర్లందరూ తమ సహజసిద్ధమైన లేదా చట్టబద్ధమైన సంరక్షకుని ద్వారా పొదుపు/టర్మ్ డిపాజిట్ ఖాతాలు తెరుచుకునేందుకు, స్వయంగా ఆపరేట్ చేసుకునేందుకు అనుమతించాలని సూచిస్తూ బ్యాంకులకు ఆర్‌బీఐ సవరించిన ఆదేశాలు జారీ చేసింది. అంతే కాదు... వారు తల్లిని సంరక్షకురాలుగా పెట్టుకుని ఖాతాలు తెరిచేందుకు కూడా అనుమతించింది. అయితే తమ రిస్క్ నిర్వహణ విధానానికి అనుగుణంగా నిబంధనలు, ఖాతాలో నిల్వ మొత్తాన్ని బ్యాంకులు నిర్ణయించవచ్చని పేర్కొంది. ఆ నియమనిబంధనలన్నింటినీ ఖాతాదారుకి తెలియచేయాలని కూడా సూచించింది. మైనారిటీ తీరిన అనంతరం ఖాతాదారు వద్ద తాజాగా నమూనా సంతకాలు తీసుకుని రికార్డుల్లో భద్రపరచాలని తెలిపింది. మైనర్ల ఖాతాలపై ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏటీఎం/డెబిట్ కార్డు, చెక్ బుక్ వంటి అదనపు సదుపాయాలు కల్పించే విషయంలో నిర్ణయాధికారం బ్యాంకులదేనని పేర్కొంది. మైనర్ల ఖాతాల్లో కనీస నిల్వ తగినంతగా ఉండేలా చూడాలని, ఎలాంటి పరిస్థితిలోనూ ఓవర్ డ్రాకు అనుమతించవద్దని సూచించింది. బ్యాంకులన్నీ ఈ ఏడాది జూలై ఒకటవ తేదీ దాటకుండా ప్రస్తుత విధానాల్లో సవరణలు లేదా కొత్త నిబంధనల జోడింపు చేయాలని ఆదేశించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	420
వరంగల్	407	గోదావరి	400
చిత్తూరు	440	విశాఖపట్నం	425
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	122
వరంగల్	120	గుంటూరు	110
కరీంనగర్	120	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	80
కర్నూలు	120	నెల్లూరు	85
విశాఖపట్నం	111	అనంతపురం	85
గోదావరి	122		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,350 ▲	90,150 ▲	1,11,000 ▲
విజయవాడ	98,500 ▲	92,000 ▲	99,000 ▼
విశాఖపట్నం	1,00,060 ▲	90,150 ▲	1,11,000 ▲
రాజమండ్రి	98,350 ▲	90,150 ▲	98,600 ▲
ప్రొద్దుటూరు	97,000 ▲	89,240 ▲	98,700 ▲
ముంబై	96,670 ▲	88,550 ▲	96,242 ▼

స్పోర్ట్స్

రోహిత్, విరాట్ 'టాప్'లోనే..



శ్రేయాస్, ఇషాన్‌కు చాన్స్
గ్రేడ్ 'సి'లో నితీశ్, తిలక్, అభిషేక్
బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌ల విడుదల

న్యూఢిల్లీ: స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌లో తమ ఎ+ గ్రేడ్‌ను నిలబెట్టుకున్నారు. టీ20 కెరీర్‌కు వీడ్కోలు పలకడంతో వీరికి దక్కే గ్రేడ్‌పై ఉత్కంఠ నెలకొంది. తాజాగా సోమవారం 34 మందితో కూడిన ఎ+, ఎ, బి, సి కాంట్రాక్ట్ జాబితాను బోర్డు ప్రకటించింది. అయితే ఈ జాబితా 2024 అక్టోబరు 1 నుంచి ఈ ఏడాది సెప్టెంబరు 30 వరకు మాత్రమే వర్తించనుంది. దీంట్లో ఎప్పటిలాగే కెప్టెన్ రోహిత్, విరాట్‌లకు ఎ+ గ్రేడ్ దక్కింది. పేసర్ బుమ్రా, రవీంద్ర జడేజా కూడా వీరితో పాటున్నారు. జడ్డూ కూడా పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. అయితే నిబంధనల ప్రకారం మూడు ఫార్మాట్లలో అద్భుత ప్రదర్శన కనబర్చిన ప్లేయర్లకే ఎ+ గ్రేడ్‌లో చోటు దక్కుతుంది. కానీ రోహిత్, విరాట్, జడేజా ప్రస్తుతం రెండు ఫార్మాట్లకే పరిమితమయ్యారు. మరి వీరికి ఎ+లో ఎందుకు చోటు కల్పించారనే ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'గతేడాది అక్టోబరు నుంచి వర్తించే ఈ జాబితాలో 2023 ప్రదర్శన ఆధారంగానే ఆటగాళ్ల ఎంపిక ఉంటుంది. కాబట్టి వారు ఆ సమయంలో టీ20 వరల్డ్ కప్‌తో పాటు మూడు ఫార్మాట్లలోనూ ఆడారు' అని బోర్డు అధికారి పేర్కొన్నాడు. ఈ నలుగురికి ఏడాదికి రూ.7 కోట్లు అందుతాయి.



నితీశ్

శ్రేయాస్, ఇషాన్ వచ్చేశారు: దేశవాళీ క్రికెట్‌ను విస్మరించినందుకు గతేడాది కాంట్రాక్ట్ జాబితా నుంచి శ్రేయాస్, ఇషాన్‌లను బోర్డు తొలగించింది. అయితే తాజాగా శ్రేయా‌స్‌కు నేరుగా గ్రూప్ 'బి'లో చోటు దక్కగా.. ఇషాన్‌ను గ్రూప్ 'సి'లో చేర్చారు. అలాగే రిషబ్ పంత్.. అశ్విన్ స్థానంలో గ్రూప్ 'ఎ'కు ప్రమోట్ అయ్యాడు. ఇక గ్రూప్ 'సి'లో 17 నుంచి 19కి ఆటగాళ్ల సంఖ్యను పెంచారు. సర్ఫరాజ్, జురెల్‌తో పాటు ఆంధ్ర క్రికెటర్ నితీశ్‌కుమార్, అభిషేక్, హర్షిత్, వరుణ్‌లకు తొలిసారి చోటు దక్కింది. మరోవైపు గ్రేడ్ 'సి'లో ఉన్న శార్దూల్, కేఎస్ భరత్, జితేశ్, అవేశ్‌లను జాబితా నుంచి తొలగించారు. తెలుగు ఆటగాళ్లను పరిశీలిస్తే..గ్రేడ్-ఎలో సిరాజ్, గ్రేడ్-సిలో నితీశ్ కుమార్, తిలక్‌వర్మ ఉన్నారు.

వార్షిక జాబితా

గ్రేడ్ 'ఎ+' (రూ.7 కోట్లు): రోహిత్, విరాట్ కోహ్లీ, బుమ్రా, జడేజా

గ్రేడ్ 'ఎ' (రూ.5 కోట్లు): సిరాజ్, కేఎల్ రాహుల్, షమి, పంత్, గిల్, హార్దిక్

గ్రేడ్ 'బి' (రూ.3 కోట్లు): సూర్యకుమార్, శ్రేయాస్, కుల్దీప్, అక్షర్, జైస్వాల్

గ్రేడ్ 'సి' (రూ. కోటి): రింకూ, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్, నితీశ్ కుమార్, సర్ఫరాజ్, ఆకాశ్ దీప్, తిలక్ వర్మ, వాషింగ్టన్, ప్రసిద్ధ్ కృష్ణ, వరుణ్ చక్రవర్తి, రుతురాజ్, ముకేశ్ కుమార్, పటీదార్, ఇషాన్ కిషన్, శివం దూబే, శాంసన్, జురెల్, అభిషేక్, హర్షిత్ రాణా.

రమేష్‌పై చర్య తీసుకోవాలి

ఓయూ స్పోర్ట్స్ స్టూడెంట్స్ ఫెడరేషన్ డిమాండ్

హైదరాబాద్: డోపింగ్ వ్యవహారంలో 'నాడా' సస్పెండ్ చేసిన జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేష్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) స్పోర్ట్స్ స్టూడెంట్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఫెడరేషన్ నాయకులు ఆందోళన చేశారు. ఈ విషయంపై ఫెడరేషన్ కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ గతంలోనే రమేష్ శిక్షణ ఇస్తున్న అథ్లెట్లు నిషేధిత ఉత్ప్రేరకాలతో దొరకగా, తనకేమి తెలియదని మభ్యపెట్టి తప్పించుకున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఇచ్చే సీఎస్ఆర్ నిధులను దుర్వినియోగం చేశారని విమర్శించారు. సాయ్ కేంద్రంలో కేవలం 20 మంది అథ్లెట్లకు మాత్రమే శిక్షణ ఇవ్వమని రమేష్‌ను కోచ్‌గా నియమిస్తే, ఆయన అనధికారికంగా చాలా మందికి అక్కడ కోచింగ్ ఇస్తున్నారని ఆరోపించారు. రమేష్ చేసిన అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు రాజేష్, ఓయూ విద్యార్థి నాయకులు జంపన్న, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'లారెస్' విజేతలు డుప్లాంటిస్, బైల్స్

టీమిండియా స్టార్ పంత్‌కు నిరాశ



మాడ్రిడ్: ప్రతిష్ఠాత్మక లారెస్ వరల్డ్ స్పోర్ట్స్‌మన్ ఆఫ్ ద ఇయర్ అవార్డును స్వీడన్ పోల్‌వాల్టర్ మాండో డుప్లాంటిస్(25) సొంతం చేసుకొన్నాడు. సోమవారం ఇక్కడ అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఒలింపిక్ స్వర్ణాన్ని నిలబెట్టుకొన్న డుప్లాంటిస్.. తన ప్రపంచ రికార్డును తనే అధిగమించాడు. కాగా, స్పోర్ట్స్ ఉమన్ ఆఫ్ ద ఇయర్‌గా అమెరికా జిమ్నాస్ట్ సిమోన్ బైల్స్ నిలిచింది. ఇక.. 'కమ్‌బ్యాక్ ఆఫ్ ఇయర్' అవార్డు రేసులో నిలిచిన టీమిండియా క్రికెటర్ రిషభ్ పంత్‌కు నిరాశే ఎదురైంది. ఈ పురస్కారాన్ని బ్రెజిల్ జిమ్నాస్ట్ రెబెక్కా అండ్రెడె దక్కించుకొంది.

అగ్రస్థానానికి హంపి

ఫిడే: భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ఫిడే మహిళల గ్రాండ్ ప్రీ చెస్ టోర్నీలో అగ్ర స్థానానికి దూసుకొచ్చింది. సోమవారం జరిగిన ఏడో రౌండ్‌లో చైనా జీఎం ఝు జినెర్‌ను 55 ఎత్తుల్లో చిత్తు చేసింది. దాంతో ఝునెర్ (5)ను వెనక్కునెట్టిన హంపి 5.5 పాయింట్లతో టాప్‌లో నిలిచింది. ద్రోణవల్లి హారిక.. పోలినా షువలోవా (రష్యా)తో పాయింట్‌ను పంచుకుంది. 3.5 పాయింట్లతో హారిక ఐదో స్థానంలో ఉంది. ముంగున్‌తూల్ (మంగోలియా)పై నెగ్గిన దివ్యా దేశ్‌ముఖ్ (5) రెండో స్థానానికి చేరింది.


సిమ్రన్‌ప్రీత్‌కు రజతం

లిమా (పెరూ): ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్‌లో భారత షూటర్ల పతక జోరు సోమవారం కూడా కొనసాగింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో సిమ్రన్‌ప్రీత్ కౌర్ రెండోస్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకుంది. చైనా షూటర్లు సన్ యుజీ, యావో కియాన్‌గ్జున్ స్వర్ణ, కాంస్యాలు అందుకున్నారు. భారత స్టార్ మనూ భాకర్ నాలుగోస్థానానికి పరిమితమైంది.

శుభ్‌మన్.. దంచెన్

కోల్‌కతాపై గుజరాత్ ఘనవిజయం

నేటి మ్యాచ్: లఖ్‌నవూ x ఢిల్లీ — వేదిక: లఖ్‌నవూ — రా.7.30 నుంచి



శుభ్‌మన్ గిల్ (55 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 90)

కోల్‌కతా: గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (55 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 90) అదరగొట్టాడు. మరోవైపు బౌలర్లు సమష్టిగా రాణించడంతో కోల్‌కతా నైట్‌రైడర్స్ విలవిల్లాడింది. 199 పరుగుల ఛేదనలో తొమ్మిది మంది బ్యాటర్లతో బరిలోకి దిగినా కేకేఆర్ 39 రన్స్‌తో ఓడింది. అంతకుముందు బౌలింగ్‌లోనూ కేకేఆర్ పూర్తిగా తేలిపోయింది. ఈ విజయంతో టైటాన్స్ 12 పాయింట్లతో తమ అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠ పర్చుకుంది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 198 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (36 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 52) అర్ధసెంచరీ సాధించగా బట్లర్ (23 బంతుల్లో 8 ఫోర్లతో 41 నాటౌట్) వేగం చూపాడు. ఛేదనలో కోల్‌కతా 20 ఓవర్లలో 8 వికెట్లకు 159 పరుగులు చేసి ఓడింది. రహానె (50), రఘువంశీ (27 నాటౌట్) రస్సెల్ (21) మాత్రమే రాణించారు. రషీద్, ప్రసిద్ధ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా గిల్ నిలిచాడు.

పోరాటమే లేకుండా..: ఈ పిచ్‌పై సవాల్‌గా మారిన ఛేదనకు బరిలోకి దిగిన కోల్‌కతా పేలవ ప్రదర్శన కనబర్చింది. కెప్టెన్ రహానె కాస్త పోరాడినా ఫలితం లేకపోయింది. బంతి బ్యాట్‌పైకి రాకపోవడంతో కేకేఆర్ బ్యాటర్లు భారీ షాట్లు ఆడేందుకు సాహసించలేదు. దీంతో వీరి ఇన్నింగ్స్ నత్తనడకన సాగిం ది. అటు చేయాల్సిన రన్‌రేట్ కష్టంగా మారడంతో కేకేఆర్ చేసేదేమీ లేకపోయింది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ గుర్బాజ్ (1)ను సిరాజ్ అవుట్ చేశాడు. మరో ఓపెనర్ నరైన్ (17) పవర్‌ప్లేలోనే వెనుదిరగ్గా, రెండో వికెట్‌కు రహానెతో కలిసి 41 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ స్థితిలో వెంకటేశ్ అయ్యర్‌తో కలిసి రహానె ఆదుకునే ప్రయత్నం చేశాడు. కానీ ఇద్దరూ జాగ్రత్తగా ఆడడంతో 6-10 ఓవర్ల మధ్య ఒక్క ఫోర్ కూడా రాలేదు. 11వ ఓవర్‌లో రహానె 4,6తో స్కోరులో కదలిక వచ్చింది. కానీ తర్వాతి వరుస రెండు ఓవర్లలో ఈ ఇద్దరూ అవుటవడంతో ఆశలు ఆవిరయ్యాయి. రస్సెల్ జోరు కాసేపే అయ్యింది. 17వ ఓవర్‌లో రమణ్‌దీప్ (1), మొయిన్ అలీ (0) వికెట్లను తీసి ప్రసిద్ధ్ మరింత దెబ్బకొట్టాడు. చివర్లో రఘువంశీ ధాటిగా ఆడినా కేకేఆర్ ఓటమి లాంఛనమే అయ్యింది.

టాపార్డర్ అదుర్స్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు గిల్, సుదర్శన్ నిలకడగా ఆడారు. అలాగే వన్‌డౌన్ బ్యాటర్ బట్లర్ ఈడెన్‌లో తన సూపర్ ఫామ్‌ను కొనసాగించాడు. అతడి రెండు క్యాచ్‌లను కేకేఆర్ వదిలేయడం కూడా టైటాన్స్‌కు లాభించింది. అయితే స్లో వికెట్ కావడంతో ఆరంభంలో గిల్ ఆచితూచి ఆడగా, సుదర్శన్ కాస్త వేగం కనబర్చాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 45 పరుగులతో ఓ మాదిరి స్కోరందుకుంది. అయితే ఏడో ఓవర్‌లో గిల్ 6,4,4తో చెలరేగడంతో 17 రన్స్ సమకూరాయి. 11వ ఓవర్‌లో సుదర్శన్ 4,6తో 33 బంతుల్లో ఫిఫ్టీ సాధించగా, గిల్ కూడా అదే ఓవర్‌లో సింగిల్‌తో 34 బంతుల్లో ఈ ఫీట్ పూర్తి చేశాడు. ముఖ్యంగా స్పిన్నర్లను వీరు అద్భుతంగా అడ్డుకోగలిగారు. అయితే కేకేఆర్‌ను విసిగిస్తున్న ఈ జోడీని రస్సెల్ విడదీశాడు. 13వ ఓవర్‌లో కీపర్ గుర్బాజ్‌కు సుదర్శన్ క్యాచ్ ఇవ్వడంతో తొలి వికెట్‌కు 114 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. కానీ అదే ఓవర్‌లో బట్లర్ వచ్చీ రాగానే హ్యాట్రిక్ ఫోర్లతో అలరించాడు. హర్షిత్ ఓవర్‌లోనూ తను రెండు ఫోర్లు బాదగా.. 16వ ఓవర్‌లో గిల్ రెండు ఫోర్లతో స్కోరు 150 దాటింది. సెంచరీకి సమీపంలో మరింత జోరు పెంచిన గిల్ పేసర్ వైభవ్ ఓవర్‌లో 6,4 బాది వెంటనే రింకూకు క్యాచ్ ఇచ్చాడు. మరోవైపు రూథర్‌ఫోర్డ్‌కన్నా ముందే క్రీజులోకి వచ్చిన తెవాటియా డకౌట్‌గా వెనుదిరిగాడు. చివరి ఓవర్‌లో బట్లర్ 4,4 షారుక్ (11 నాటౌట్) 6తో 18 రన్స్ రాబట్టిన టైటాన్స్ 200కి సమీపంలోకి రాగలిగింది. మొత్తంగా ఆఖరి 5 ఓవర్లలో జీటీ 59 రన్స్ కారణంగా భారీ స్కోరందుకుంది.

స్కోరుబోర్డు

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) గుర్బాజ్ (బి) రస్సెల్ 52, గిల్ (సి) రింకూ (బి) వైభవ్ 90, బట్లర్ (నాటౌట్) 41, తెవాటియా (సి) రమణ్‌దీప్ (బి) హర్షిత్ 0, షారుక్ (నాటౌట్) 11, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 198/3; వికెట్ల పతనం:** 1-114, 2-172, 3-177; **బౌలింగ్:** వైభవ్ అరోరా 4-0-44-1, మొయిన్ అలీ 3-0-27-0, హర్షిత్ రాణా 4-0-45-1, వరుణ్ 4-0-33-0, నరైన్ 4-0-36-0, రస్సెల్ 1-0-13-1.

కోల్‌కతా: గుర్బాజ్ (ఎల్బీ) సిరాజ్ 1, నరైన్ (సి) తెవాటియా (బి) రషీద్ 17, రహానె (స్టంప్డ్) బట్లర్ (బి) వాషింగ్టన్ 50, వెంకటేశ్ అయ్యర్ (సి) వాషింగ్టన్ (బి) సాయి కిషోర్ 14, రింకూ (సి) గిల్ (బి) ఇషాంత్ 17, రస్సెల్ (స్టంప్డ్) బట్లర్ (బి) రషీద్ 21, రమణ్‌దీప్ (సి అండ్ బి) ప్రసిద్ధ్ 1, అలీ (సి) షారుక్ (బి) ప్రసిద్ధ్ 0, రఘువంశి (నాటౌట్) 27, హర్షిత్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 159/8; వికెట్ల పతనం:** 1-2, 2-43, 3-84, 4-91, 5-118, 6-119, 7-119, 8-151; **బౌలింగ్:** సిరాజ్ 4-0-32-1, ఇషాంత్ 2-0-18-1, ప్రసిద్ధ్ 4-0-25-2, రషీద్ 4-0-25-2, వాషింగ్టన్ 3-0-36-1, సాయి కిషోర్ 3-0-19-1.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	8	6	2	0	12	1.104
ఢిల్లీ	7	5	2	0	10	0.589
బెంగళూరు	8	5	3	0	10	0.472
పంజాబ్	8	5	3	0	10	0.177
లఖ్‌నవూ	8	5	3	0	10	0.088
ముంబై	8	4	4	0	8	0.483
కోల్‌కతా	8	3	5	0	6	0.212
రాజస్థాన్	8	2	6	0	4	-0.633
హైదరాబాద్	7	2	5	0	4	-1.217
చెన్నై	8	2	6	0	4	-1.392

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ముస్లిం రిజర్వేషన్లకు కాంగ్రెస్ కుట్ర

- రిజర్వేషన్లను వ్యతిరేకించిన చరిత్ర ఆ పార్టీది
- రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితి దుర్భరం: బండి సంజయ్



కరీంనగర్/వేములవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రిజర్వేషన్లను వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ.. ఓట్ల కోసం ముస్లింలకు మతపరమైన రిజర్వేషన్లు కల్పించేందుకు కుట్ర చేసిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మైనారిటీల మెప్పు కోసం మైనారిటీ విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను నిషేధించిందన్నారు. సోమవారం కరీంనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో సంజయ్ మాట్లాడారు. అంబేడ్కర్ రిజర్వేషన్లను ప్రతిపాదిస్తే నెహ్రూ వ్యతిరేకించారని గుర్తు చేశారు. విద్య, ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే మండల కమిషన్ సిఫారసులను ఆమోదించకుండా కాంగ్రెస్ ఆ వర్గాలను అవమానించిందని మండిపడ్డారు. ఓబీసీ రిజర్వేషన్లను ప్రతిపాదించిన కాకా కలేల్కర్ కమిషన్ సిఫారసులను కాంగ్రెస్ తిరస్కరించిందని పేర్కొన్నారు. బీజేపీ పాలనలో అంబేడ్కర్‌కు భారత రత్న ఇచ్చామని తెలిపారు. అంబేడ్కర్ జయంతిని రాష్ట్రీయ సమరసతా దినంగా ప్రకటించి 120 దేశాల్లో జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలో జర్నలిస్టులు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారని బండి సంజయ్ అన్నారు. చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న జర్నలిస్టులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ ప్రెస్‌క్లబ్‌లో సంజయ్ మాట్లాడారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జర్నలిస్టులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని, జర్నలిస్టులు సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కేసీఆర్, కార్యకర్తల మధ్య వారధిగా ఉంటా

- సమస్యలను అధినేత దృష్టికి తీసుకెళ్తా: ఎమ్మెల్సీ కవిత

భద్రాచలం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ కార్యకర్తల మధ్య వారధిగా పని చేస్తానని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. కార్యకర్తల సమస్యలను అధినేత కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. భద్రాచలంలో సోమవారం తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. కాంగ్రెస్ నుంచి రాష్ట్రాన్ని కాపాడేది గులాబీ దండేనని, బీఆర్ఎస్‌తోనే రాష్ట్రానికి శ్రీరామ రక్ష అని అన్నారు. అలివి కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్.. ప్రజలను అన్ని రకాలుగా వంచిస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ర్యాలీ

మహబూబాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం జిల్లా వక్ఫ్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్ ఆఫీస్ ఎదుట ప్రారంభమైన ర్యాలీ వివేకానంద సెంటర్ వరకు కొనసాగింది. వారికి మద్దతుగా అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్, ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకురాలు, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ మాలోతు కవితతో పాటు బీజేపీయేతర పార్టీలు, కుల, ప్రజా సంఘాల నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు.

ఆ పిట్టల దొర.. మళ్లీ అధికారంలోకా?: చామల

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు కేసీఆర్ మళ్లీ సీఎం కావడం చారిత్రక అవసరమంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఘాటుగా స్పందించారు. 'లేవడానికి చేతగాని పిట్టల దొర.. మళ్లీ అధికారంలోకి రావాలంటూ తుపాకీ రాముడు అనడం హాస్యాస్పదంగా ఉంది. బుద్ధి ఉన్నోళ్లు ఎవరైనా బీఆర్ఎస్ పాలనను మళ్లీ కోరుకుంటారా?' అంటూ ధ్వజమెత్తారు. అసలు రజతోత్సవ సభ టీఆర్ఎస్‌కా.. లేక బీఆర్ఎస్ పార్టీకా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. పార్టీ నుంచి తెలంగాణ పదాన్ని తొలగించి.. రజతోత్సవ సభను ఎలా నిర్వహిస్తారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పేరుతో ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్‌లో.. బీజేపీ నేతలు మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి ఏమీ చేయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. మరో కేంద్ర మంత్రి బండి సంజయ్, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌లు సైతం మత పరంగా ప్రజల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

విచారణ పేరుతో పోలీసులు వేధిస్తున్నారు

- మానవ హక్కుల కమిషన్‌కు మన్నె క్రిశాంక్ ఫిర్యాదు

కంచ గచ్చిబౌలి భూముల కేసులో విచారణ పేరుతో పోలీసులు వేధిస్తున్నారని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ కేసు విషయంలో ఇప్పటికే మూడుసార్లు విచారణకు పిలిచారని, మళ్లీ ఈ నెల 23న మరోసారి విచారణకు రావాలని పోలీసులు నోటీసులిచ్చారని ఆయన తెలిపారు. దర్యాప్తు పేరుతో ఎలాంటి విచారణ జరపకుండా సమయాన్ని వృథా చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన హక్కులకు భంగం కలిగిస్తున్న గచ్చిబౌలి పోలీసులపై చర్యలు తీసుకోవాలని క్రిశాంక్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

రాహుల్‌జీ ఇదేం రాజకీయం?

- హెచ్‌సీయూ విధ్వంసంపై స్పందించరా?: హరీశ్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): "ఇదేం రాజకీయం రాహుల్ గాంధీజీ.. ఎప్పుడో జరిగిన పాత విషయాన్ని గుర్తుంచుకొని కన్నీళ్లు కారుస్తున్నారు.. నిన్నటి పర్యావరణ విధ్వంసంపై స్పందించరా?" అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రశ్నించారు. 2016లో జరిగిన రోహిత్ వేముల ఆత్మహత్య విషయాన్ని గుర్తుంచుకొన్నారు. ఇటీవల జరిగిన హెచ్‌సీయూ ఘటన మీకు గుర్తులేదా? అని సోమవారం 'ఎక్స్' వేదికగా ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కుల వివక్ష ఘటనలపై రోహిత్ వేముల చట్టం తీసుకురావాలని మీ పార్టీ సీఎంలకు లేఖలు రాస్తున్నారు. అదే సమయంలో మీ పార్టీ ప్రభుత్వాలు చేస్తున్న విధ్వంసకర చర్యలు, అక్రమాలపై కూడా మాట్లాడండి.. ఇప్పటికైనా మౌనం వీడండంటూ రాహుల్‌కు హరీశ్‌రావు సూచించారు. కాగా, తెలంగాణ రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు మహోత్సవ వేడుకలను జరపడం చూస్తుంటే.. చంపినోడే.. సంతాప సభ పెట్టినట్లుందని మాజీమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఆంధ్ర ప్రాంతం వారు తెలంగాణ రైతులకు వ్యవసాయం నేర్పించారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యలు చేశారంటూ.. ఆ వ్యాఖ్యలు యావత్ తెలంగాణ సమాజాన్ని అవమాన పరచినట్లేనని దుయ్యబట్టారు. రాష్ట్ర రైతులను అవమానించిన మహేశ్ గౌడ్ బేషరతుగా తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

కృత్రిమ మేధతో కలుపుతీసే యంత్రం

స్వయం ప్రతిపత్తి రోబోను ఆవిష్కరించిన గీతం విద్యార్థిని



పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కృత్రిమ మేధ(ఏఐ)తో కలుపు తీసే రోబోట్‌ను సంగారెడ్డి జిల్లా రుద్రారంలో ఉన్న గీతం విశ్వవిద్యాలయం బీటెక్ చివరి ఏడాది విద్యార్థి సి.అమూల్య, ఆమె బృంద సభ్యులు అభివృద్ధి చేశారు. ఇది హానికరమైన కలుపు మందులపై ఆధారపడటాన్ని తగ్గించడమే కాక మానవ శ్రమను గణనీయంగా తగ్గిస్తుంది. సెన్సార్ ఫ్లో లైట్ ద్వారా కలుపు మొక్కలను గుర్తించి తొలగించేలా స్వయం ప్రతిపత్తి రోబోను తమ బృందం అభివృద్ధి చేసినట్టు అమూల్య వివరించారు. దీన్ని మెరుగుపరిచి జీపీఎస్ సాయంతో, సౌరశక్తితో పనిచేసేలా, మరిన్ని పంట రకాలకు అనుకూలంగా అభివృద్ధి చేయనున్నామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు ఈఈసీఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్. ప్రవీణ్ కుమార్ మార్గదర్శనం చేయగా తన బృంద సభ్యులు కె.మణికంఠ, శివ ధనుష్ ముసునూరి సహకరించినట్లు ఆమె తెలిపారు.

నా హెలికాప్టర్ ఎగరడం లేదు

- అమ్మిన వ్యాపారిపై పోలీసులకు బుడ్డోడి ఫిర్యాదు
- సముదాయించి పంపిన సంగారెడ్డి జిల్లా కంగ్టి పోలీసులు



బొమ్మ హెలికాప్టర్ పని చేయడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాలుడు వీరారెడ్డి

కంగ్టి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఏదైనా వస్తువును కొన్న తర్వాత అది పనిచేయకపోతే దిగాలు పడడమో లేదా అమ్మిన వారిపై కాసేపు ఆగ్రహం వ్యక్తం చేసి ఊరుకోవడమో చేస్తుంటాం. అయితే ఓ పదేళ్ల బాలుడు తాను కొన్న బొమ్మ హెలికాప్టర్ పనిచేయకపోవడంతో, వ్యాపారిపై చర్యలు తీసుకోవాలంటూ ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాడు. తల్లిదండ్రులతో కలిసి కర్ణాటకలోని బర్మానాగన్‌పల్లిలో ఉంటున్న వీరారెడ్డి (10) సిద్దేశ్వర జాతర ఉత్సవాల కోసం నాలుగు రోజుల క్రితం సంగారెడ్డి జిల్లా కంగ్టిలోని అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. జాతరలో ఓ వ్యాపారి వద్ద రూ. మూడు వందలకు బొమ్మ హెలికాప్టర్‌ను కొనుగోలు చేశాడు. ఇంటికి తీసుకొని వెళ్లాక అది పని చేయలేదు. దీంతో ఆ బాలుడు దాన్ని తీసుకెళ్లి వ్యాపారికి పనిచేయడం లేదని చెప్పడంతో మొదలు తీసుకున్న దాన్ని మార్చి వేరేది ఇచ్చాడు. ఇంటికి వెళ్లాక అది కూడా పని చేయలేదు. ఇలా పలుమార్లు మార్చినప్పటికీ నాలుగోసారి మళ్లీ వచ్చిన బాలుడిపై వ్యాపారి ఆగ్రహం వ్యక్తం చేయడంతో వీరారెడ్డి నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. తనను మోసం చేసిన వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న బాలుడి తాత పోలీసులతో మాట్లాడారు. తన మనవడు ఇంతకు ముందు తనతోపాటు పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడని, అదే ధైర్యంతో బొమ్మ హెలికాప్టర్ ఎగరడం లేదని చెప్పేందుకు వచ్చి ఉంటాడని తెలిపారు. దీంతో పోలీసులు బాలుడిని సముదాయించి పంపించారు. పదేళ్ల బాలుడు వ్యాపారిపై పోలీసులకు పిర్యాదు చేసేందుకు వెళ్లడం పట్ల అతని ధైర్యాన్ని పలువురు అభినందిస్తున్నారు.

మిస్ వరల్డ్ పోటీలకు

ప్రభుత్వ ఖర్చు 2 కోట్లే!

(మొదటిపేజీ తరువాయి)

మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌కు ప్రభుత్వం 5.4కోట్లు చెల్లించాల్సి ఉంది. ఆ మొత్తాన్ని కూడా ఇప్పటివరకు చెల్లించలేదు. స్పాన్సర్లు సమకూర్చే నిధుల నుంచే దీన్ని కూడా చెల్లించనున్నారని సమాచారం. మిస్ వరల్డ్ పోటీలకు స్పాన్సరర్స్ ఇచ్చిన డబ్బును, ప్రభుత్వం పెట్టే సొమ్మును అనేక పనుల కోసం ఖర్చుచేసేందుకు అధికారులు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. పోటీల్లో పాల్గొనే 100 దేశాల సుందరీమణులకు బస, రక్షణ ఏర్పాట్లు, భోజన వసతి, పోటీల వేదికల ఏర్పాట్లు, రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రదేశాలకు వారిని తీసుకెళ్లడం, రాష్ట్ర పర్యాటక ప్రాంతాలపై ప్రచారం, చేనేతకు ప్రచారం.. వీటన్నింటికీ కలిపి రూ.27 కోట్ల దాకా ఖర్చవుతుందని లెక్కతేల్చారు. మే 7న మొదలుపెడితే.. జూన్ 2న గవర్నర్‌ను, సీఎంను పోటీదారులు కలిసేవరకు.. మొత్తం 24 కార్యక్రమాలు జరగనున్నాయి. ఒక్కో కార్యక్రమానికీ ఒక్కో స్పాన్సరర్ చొప్పున 24మందిని ఎంపికచేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. ఒకవేళ స్పాన్సరర్లు తగ్గితే ఒక్కొక్కరికి ఒకటి, రెండు కార్యక్రమాలు కూడా ఇవ్వొచ్చు. ఆయా కార్యక్రమాల్లో సదరు స్పాన్సరర్లకు సంబంధించిన ప్రకటనలు, పేర్లను వేసేలా ఒప్పందం ఉండనుంది.

మెరిసిపోనున్న పర్యాటక హోటళ్లు..

మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో.. రాష్ట్రంలోని పలు పర్యాటక హోటళ్లు, పర్యాటక ఆస్తులకు కొత్త సొబగులు అద్దనున్నారు. నాగార్జునసాగర్, ములుగు, రామప్ప తదితర చోట్ల ఉన్న పర్యాటక హోటళ్లను ఆధునికీకరించనున్నారు. ఆయా ప్రదేశాల్లో థీమ్ ఈవెంట్లను కూడా పర్యాటక శాఖ ఏర్పాటుచేసింది. రామప్ప పర్యాటక ప్రాశస్త్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేసేందుకు అక్కడ ఒక కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే, నాగార్జునసాగర్ వద్ద ఉన్న బుద్ధవనానికి.. బుద్ధపూర్ణిమ రోజున పోటీదారులను తీసుకెళ్లనున్నారు. హోటళ్ల ఆధునికీకరణ పనుల పర్యవేక్షణకు పర్యాటక శాఖ కొందరు రిటైర్డ్ సీనియర్ ఇంజనీర్లను కూడా తీసుకుంది.

పటిష్ఠ భద్రత ఏర్పాట్లు..

మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే సుందరీమణుల రక్షణపై పర్యాటక శాఖ తీవ్ర కసరత్తు చేస్తోంది. పోటీదారుల వ్యక్తిగత రక్షణ, వారు బస చేసే చోటు నుంచి పోటీల వేదికలకు వెళ్లే మార్గంలో రక్షణతో పాటు.. పోటీ జరిగే వేదికల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేయడానికి పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటోంది. తమ దేశ పోటీదారులకు ప్రత్యేక రక్షణ కల్పించాలంటూ రష్యా, ఇజ్రాయెల్ తదితర దేశాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు.. వారికి ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేయనున్నారు. దీనిపై త్వరలోనే డీజీపీ-పర్యాటక శాఖ అధికారులు భేటీ కానున్నారు.

స్థానికులకూ స్వాగతం..

మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించే ఈవెంట్లతో పాటు.. రామప్ప, నాగార్జునసాగర్, పోచంపల్లి తదితర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమాలకు స్థానికులను సైతం ఆహ్వానించనున్నారు. కొన్నిచోట్ల ఓపెన్ ఎయిర్ కార్యక్రమాలు ఏర్పాటుచేయనున్నారు. ఈ కార్యక్రమాలన్నీ కూడా సాయంత్రం పూట ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటుచేసి డిన్నర్ కూడా అక్కడే ఏర్పాటుచేయనున్నారు. ఒక్కో కార్యక్రమం దగ్గర 500ల మంది స్థానిక ముఖ్యులు పాల్గొనేలా సీటింగ్ ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. బుద్ధవనం సందర్శన రోజున.. పేరిణి నృత్యం, బ్యాలే డ్యాన్స్ వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే(ముగింపు రోజు) వేడుకకు 3,500ల మందికి పాస్‌లు ఇవ్వనున్నారు.

వారి ఖర్చులు వారివే!

మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సీఈవో జూలియా ఇటీవల కాలంలో నాలుగుసార్లు రాష్ట్రానికి వచ్చి వెళ్లారు. ఏర్పాట్లపై చర్చ, ఇతర అంశాలపై సమావేశాల కోసం ఆమె లండన్ నుంచి వచ్చి వెళ్తున్నారు. అయితే.. జూలియా రాష్ట్రానికి వచ్చినప్పుడు ఆమెకు టూరిజం ప్లాజాలో బస కేటాయించిన అధికారులు.. అందుకు అద్దె కట్టించుకున్నారు. 50శాతం రాయితీ మాత్రం ఇచ్చి, మిగతా మొత్తాన్ని కట్టించుకున్నారని తెలిసింది.

80 శాతం ఏర్పాట్లు పూర్తి

మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించిన ఏర్పాట్లు 80 శాతం పూర్తయ్యాయి. తెలంగాణ పర్యాటక ప్రాంతాలను, చేనేత, సంస్కృతి, ఆహారం తదితరాలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని వేదికగా మార్చుకునే వ్యూహంలో ఉన్నాం. పోటీలో పాల్గొనే సుందరీమణులకు.. తెలంగాణకు సంబంధించిన కొంత ప్రమోషన్ చేయాలనే షరతు విధించాం. మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ ఈ విషయంలో మాకు సహకరిస్తోంది. మే నెల అంతా తెలంగాణకు పండుగ లాంటిదే. ఈ పోటీల్లో పాల్గొనే అమ్మాయిలకు వారి వారి దేశాల్లో ప్రచార ఒప్పందాలు ఉంటాయి. వాటిలో భాగంగా ప్రసారమయ్యే వీడియోల్లో మన తెలంగాణ పర్యాటకం, చేనేత, ఇతర అంశాలను ప్రమోట్ చేసేలా చేస్తున్నాం.

- స్మితా సభర్వాల్, పర్యాటక శాఖ కార్యదర్శి

తెలంగాణలో రోహిత్ వేముల

చట్టాన్ని చేయండి

- విద్యా సంస్థల్లో కుల వివక్షను రూపుమాపండి
- సీఎం రేవంత్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ లేఖ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లో కుల వివక్షను నిర్మూలించేందుకు రోహిత్ వేముల చట్టాన్ని రూపొందించాలని కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. నేటికీ దేశంలోని పలు విద్యా సంస్థల్లో లక్షలాది మంది దళిత, ఆదివాసీ, ఓబీసీ వర్గాల విద్యార్థులు దారుణమైన అంటరానితనాన్ని ఎదుర్కోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కుల వివక్ష కారణంగానే రోహిత్ వేముల, పాయల్ తడ్వి, దర్శన్ సోలంకి వంటి వారు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వీటికి ముగింపు పలకాలన్నారు. దేశంలో మరే బిడ్డా అంబేడ్కర్, రోహిత్ వేములలా వివక్షకు గురి కాకూడదని ఆకాంక్షించారు. రోహిత్ వేముల చట్టాన్ని పకడ్బందీగా రూపొందించాలని కోరారు. అలాగే, అంబేడ్కర్ ఎదుర్కొన్న కుల వివక్ష గురించి రాహుల్ లేఖలో ప్రస్తావించారు. "అక్కడ పుష్కలంగా ఆహారం ఉంది. మాకు బాగా ఆకలి వేస్తోంది. అయినా మేం తిండి లేకుండానే నిద్రపోవాల్సిన దుస్థితి. ఎందుకంటే మేం అంటరాని వాళ్లం. అందుకే మాకు నీరు కూడా దొరకలేదు" అన్న అంబేడ్కర్ వ్యాఖ్యలను గుర్తుచేశారు. అలాగే, "నేను అంటరానివాడినని నాకు తెలుసు. పాఠశాలలో తోటి విద్యార్థులతో కలిసి కూర్చోలేననీ తెలుసు. నేను ఒక మూలన కూర్చోవాలనీ తెలుసు" అన్న వ్యాఖ్యలను కూడా రాహుల్ ప్రస్తావించారు. కాగా, కుల వివక్ష నిర్మూలనకు రోహిత్ వేముల చట్టాన్ని చేయడంపై రాహుల్ గాంధీ ఇటీవల కర్ణాటక సీఎం సిద్దరామయ్య, హిమాచల్ సీఎం సుఖ్వీందర్‌కు కూడా లేఖలు రాశారు.

క్యాన్సర్ పరీక్షల

నిర్ణయం అభినందనీయం

పల్లె, పట్టణాల్లో చేయాలనే ఆలోచన అద్భుతం



వ్యాధిపై భయాన్ని పోగొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదరకు కృతజ్ఞతలు
- పేద, మధ్య తరగతికి సర్కారు భరోసా: జగ్గారెడ్డి

సంగారెడ్డి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తించడానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం అభినందనీయమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రశంసించారు. ఈ సందర్భంగా సీఎంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు తెలంగాణ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పుడున్న ఆధునిక పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను ముందే గుర్తించి, దాన్నుంచి బయటపడే అవకాశం ఉందని జగ్గారెడ్డి అన్నారు. అయితే, ముందుగానే గుర్తించే సదుపాయాలు లేనందు వల్ల చాలా మంది మహిళలు సర్వైకల్, రొమ్ము క్యాన్సర్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఇరవై ఏళ్లుగా క్యాన్సర్ బాధిత కుటుంబాలను తాను చూస్తున్నానని, అలాంటి వారిని ఎలా ఆదుకోవాలో ఆలోచించేవాడినని జగ్గారెడ్డి చెప్పారు. పేద, మధ్య తరగతి వర్గాల్లో క్యాన్సర్‌పై ఉన్న భయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పోగొడుతుందని పేర్కొన్నారు. లక్షల కుటుంబాలకు భరోసానిచ్చేలా ముఖ్యమంత్రి అద్భుతమైన నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. క్యాన్సర్‌పై అవగాహన లేక ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారని, ఈ నిర్ణయంతో అనేక మందికి ఊరట కలుగుతుందని జగ్గారెడ్డి తెలిపారు.



ప్రధాని చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ప్రధాని చేతుల మీదుగా ఆదిలాబాద్ కలెక్టర్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు

- ప్రత్యేకంగా అభినందించిన ప్రధాని మోదీ
- సమష్టి కృషితోనే సాధ్యమైందన్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

న్యూఢిల్లీ/ఆదిలాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా అరుదైన అవార్డును అందుకున్నారు. సోమవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ జిల్లా కలెక్టర్‌కు అవార్డును అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్ మండల బ్లాక్‌ను ఆస్పిరేషనల్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యం, పోషణ, వ్యవసాయం, సామాజికాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వంటి విభాగాల్లో కలెక్టర్ మెరుగైన ఫలితాలతో అభివృద్ధి పథంలో నిలిపారు. ప్రధానమంత్రి ప్రజాస్వామ్య పరిపాలన ఉత్తమ పురస్కారం - 2024 కింద నార్నూర్ ఎంపికవడంలో కలెక్టర్ కీలక పాత్ర పోషించారు. నార్నూరులో వందశాతం టీబీ స్క్రీనింగ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 70 శాతం ల్యాబ్‌లు, గ్రామ పంచాయతీల్లో 74శాతం సీఎస్సీ సెంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. పోషకాలు అందించే సోవా లడ్డూ తయారీతో పాటు సేంద్రియ పద్ధతిలో స్థిర ఆదాయం ఇచ్చే పంటలు సాగుచేసేలా 1200 మంది రైతులకు ప్రోత్సాహకం అందించారు. నార్నూరులోని అన్ని అంగన్‌వాడీలు అత్యుత్తమ పనితీరును కనబరిచాయి. గిరిజనాభివృద్ధి, సుస్థిర వ్యవసాయం, మహిళా సాధికారత, డిజిటల్ పరిపాలన.. ఇలా అన్నింటా నార్నూర్ బ్లాక్ ఉత్తమంగా నిలిచి, ప్రతిష్ఠాత్మకమైన పీఎం అవార్డును సొంతం చేసుకుంది. ఈ అవార్డు కోసం దేశవ్యాప్తంగా 500 బ్లాక్‌లు పోటీ పడగా.. నార్నూర్ మొదటి ఐదు అత్యుత్తమ బ్లాక్‌ల జాబితాలో చోటు సంపాదించింది. నార్నూరుతో పాటు కరప్ప (కేరళ), గమరియా(జార్ఖండ్), గంగా నగర్(త్రిపుర), రామ (మధ్యప్రదేశ్) బ్లాకులు అవార్డులను దక్కించుకున్నాయి. ఉత్తమ పనితీరును కనబరిచిన జిల్లా కలెక్టర్‌ను కేంద్ర ప్రభుత్వం గుర్తించి, అరుదైన అవార్డుతో సత్కరించింది. జిల్లాలోని ప్రజాప్రతినిధుల సహకారం, అధికార యంత్రాంగం కృషి ఫలితంగానే జిల్లాకు ఈ అవార్డు వచ్చిందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అందరూ సమష్టిగా కృషి చేయడం ఆనందంగా ఉందని జిల్లా కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్‌లో రజతోత్సవ రగడ!

- నియోజకవర్గాల ఇన్‌చార్జి బాధ్యతలపై లొల్లి
- మాజీ మంత్రులు వర్సెస్ ఎమ్మెల్సీలు
- మొదట్లో హడావుడి చేసిన హరీశ్‌రావు
- సభా వేదిక మార్పుతో సైలెంట్
- ఎర్రబెల్లి హవాకు ఓ వర్గం నేతల చెక్?

వరంగల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల వేళ.. నేతల్లో విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. ఓవైపు 25 ఏళ్ల ఉత్సవాలను వైభవంగా జరుపుకొనేందుకు ఏర్పాట్లు జరుగుతుండగా.. మరోవైపు నేతల మధ్య సమన్వయలేమి, వర్గపోరు తెరపైకి వస్తున్నాయి. నియోజకవర్గాల ఇన్‌చార్జి బాధ్యతలతో పాటు తనకు సమాచారమే ఇవ్వడం లేదంటూ సొంత పార్టీ నేతలపైనే కొందరు విమర్శలు చేస్తున్నారు. మొదట్లో సభ నిర్వహణ బాధ్యతలు తీసుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు.. ఉనికిచర్ల వద్ద స్థలాన్ని కూడా ఖరారు చేశారు. అయితే ఏం జరిగిందో ఏమోగానీ హరీశ్‌రావు ఎంపిక చేసిన స్థలాన్ని మార్చటంతోపాటు బాధ్యతల నుంచి కూడా ఆయనను తప్పించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కూడా పక్కనపెట్టి.. సభ నిర్వహణ బాధ్యతలు మరో వర్గానికి అప్పగించారు. దీంతో గులాబీ పార్టీలో నేతల మధ్య విభేదాలు తలెత్తాయనే చర్చ జరుగుతోంది. మొదట్లో రజతోత్సవ సభ ఏర్పాట్లను హరీశ్‌రావే పరిశీలించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎర్రబెల్లితోపాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలతో కలిసి సభ నిర్వహణకు స్థలం కోసం భట్టుపల్లి, మామునూరు, ఉనికిచర్ల సమీపంలో ఖాళీ స్థలాలను రెండుసార్లు పరిశీలించారు. చివరికి ఉనికిచర్లను ఖరారు చేశారు. ఈ క్రమంలోనే నేతల మధ్య సమన్వయ లోపం బయటపడటంతో అనూహ్యంగా సభను ఘట్‌కేసర్‌కు మార్చాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నట్టు ప్రచారం జరిగింది. దీంతో ఉలిక్కి పడిన వరంగల్, కరీంనగర్ నేతలు కేసీఆర్‌ను కలిసి ఎల్కతుర్తిలో సభ నిర్వహించేలా ఒప్పించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం, కరీంనగర్ పార్లమెంట్, హనుమకొండ జిల్లా పరిధిలో ఎల్కతుర్తి ఉండటంతో ఏ ఒక్క జిల్లా నేతల ఆధిపత్యం ఉండకుండా చూశారనే చర్చ జరుగుతోంది.

ఓరుగల్లు పర్యటనకు రాని హరీశ్‌రావు..

ఉనికిచర్ల సభాస్థలిని ఫైనల్ చేసిన తరువాత హరీశ్‌రావు ఓరుగల్లు పర్యటనకు రాకపోవడం, దయాకర్‌రావు కూడా అలా వచ్చి.. ఇలా వెళ్లిపోవటం పార్టీ క్యాడర్‌లో చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా 18న ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లా నేతలతో కేసీఆర్ నిర్వహించిన సమావేశానికి ఎర్రబెల్లి దూరంగా ఉండటం హాట్‌టాపిక్‌గా మారింది. కాగా, సభను విజయవంతం చేసేందుకుగాను బీఆర్ఎస్ అధిష్ఠానం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌కు మహబూబాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. అయితే నియోజకవర్గంలో క్యాడర్‌ను సమన్వయం చేయడంలో ఆమె విఫలమయ్యారని ఎమ్మెల్సీ రవీందర్‌రావు పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టి మరీ విమర్శించారు. వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతల విషయంలో బీఆర్ఎస్‌లో కోల్డ్‌వార్ జరుగుతోంది. ఎర్రబెల్లి గతంలో ఈ స్థానానికి ప్రాతినిధ్యం వహించడంతో రజతోత్సవ సభకు పాలకుర్తితో పాటు వర్ధన్నపేట ఇన్‌చార్జి బాధ్యతలు కూడా తానే చూసుకుంటానని అధిష్ఠానానికి తెలిపారు. అయితే ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి వర్ధన్నపేట ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలని మరో వర్గం అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చింది. దీంతో అక్కడ ఎర్రబెల్లి వర్సెస్ పోచంపల్లిగా లొల్లి కొనసాగింది. ములుగు, భూపాలపల్లి నియోజకవర్గాల్లోనూ ఇదే ఆధిపత్య పోరు నడుస్తోంది. కాగా, సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు కేటీఆర్ మంగళవారం ఎల్కతుర్తికి రానున్నారు. దీంతో కేటీఆర్ పర్యటనతోనైనా పార్టీలో అంతర్గత విభేదాలకు చెక్ పడుతుందా? లేదా? అనే చర్చ గులాబీ శ్రేణుల్లో జరుగుతోంది.

విద్వేషాలను రెచ్చగొట్టడమే బీజేపీ నైజం

» ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళన్ ముగింపులో మంత్రి సీతక్క



హనుమకొండ సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రజల మధ్య కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టడమే బీజేపీ నైజమని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. గాడ్సే సిద్ధాంతంతో పాలన సాగిస్తోందన్నారు. హనుమకొండ హరిత హోటల్‌లో జరుగుతున్న 'ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళన్'లో మూడో రోజు సోమవారం ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళన్ జాతీయ ఉపాధ్యక్షుడు, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. బీజేపీపై విమర్శనాస్త్రాలను సంధించారు. కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక దేశంలో శాంతియుత పరిస్థితులకు విఘాతం ఏర్పడిందన్నారు. వివిధ వర్గాల ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతూ భయానక పాలన సాగిస్తోందని విమర్శించారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలు, రైతులకు రుణమాఫీ చేయడానికి బీజేపీకి చేతులు రాలేదన్నారు. అంబానీ, అదానీ వంటి బడాబాబులకు మాత్రం రూ.21 లక్షల కోట్ల రుణాలను మోదీ ప్రభుత్వం మాఫీ చేసిందని విమర్శించారు. కాగా బీజేపీ 30 వేల మంది ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను తెలంగాణలో డంప్ చేసిందని సీడబ్ల్యూసీ సభ్యులు కొప్పుల రాజు ఆరోపించారు. కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు విక్రాంత్ బునియా తదితరులు పాల్గొన్నారు.

ఆ 26 జిల్లాల్లో హెచ్‌ఐవీ టెస్టులు పెంచండి

» ముప్పు ఎక్కువగా ఉన్న ప్రజలను గుర్తించి, అవగాహన సదస్సులు నిర్వహించండి:దామోదర

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎయిడ్స్ వ్యాప్తి ఎక్కువగా ఉన్న 26 జిల్లాల్లో హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షలు పెంచాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ముప్పు ఎక్కువగా ఉన్న ప్రజలను గుర్తించి, అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంఘం (టీశాక్స్) అధికారులతో మంత్రి సోమవారం సమావేశమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ) సెంటర్ల పనితీరు, మందుల సరఫరా, పరీక్షలు, కౌన్సిలింగ్ సేవలపై మంత్రి ఆరా తీశారు. 2024-25లో 19.02 లక్షల మందికి హెచ్‌ఐవీ టెస్టులు చేయగా, 9415 మందికి పాజిటివ్ వచ్చిందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో సుమారు 1.24 లక్షల మంది హెచ్‌ఐవీ బాధితులు ఉన్నారని, వారికి ఏఆర్‌టీ సెంటర్ల ద్వారా ఉచితంగా చికిత్స అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 5 వేల కంటే ఎక్కువ మంది రోగులు ఉన్నారని, మరో 13 జిల్లాల్లో 2-5 వేల మంది రోగులున్నారని వివరించారు. ఈ 26 జిల్లాల్లో పరీక్షల సంఖ్యను పెంచాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. 2030 నాటికి హెచ్‌ఐవీని పూర్తిగా నియంత్రించాలన్న లక్ష్యానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకు అనుగుణంగా టీశాక్స్ పనిచేయాలని చెప్పారు.

ఆర్ అండ్ బీలో తేలిన హ్యామ్ రోడ్లు

» తొలిదశలో 5,189 కి.మీల గుర్తింపు..

» సీఎం రాష్ట్రానికి వచ్చాక క్యాబినెట్ ఆమోదంతో నిర్మాణ పనులు: కోమటిరెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ పరిధిలో హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్) విధానంలో అభివృద్ధి చేయదల్చిన రోడ్ల గుర్తింపు ఒక కొలిక్కి వచ్చింది. తొలిదశలో 5,189 కిలోమీటర్ల పరిధిలో రహదారులను అభివృద్ధి చేయాలని శాఖ అధికారులు గుర్తించారు. ఇదే విషయాన్ని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వివరించారు. సోమవారం సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి కోమటిరెడ్డి.. హ్యామ్ రోడ్లు, రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తరభాగం, జాతీయ ప్రాజెక్టులపై శాఖ ముఖ్య అధికారులు వికాస్‌రాజ్, హరిచందనలతో కలిసి సమీక్ష నిర్వహించారు. హ్యామ్ రోడ్ల గుర్తింపు, ఎంపికపై చర్చించారు. తొలిదశలో ఎంపికైన హ్యామ్ రోడ్ల పూర్తి స్థాయి నిర్మాణ అంచనాలను సిద్ధం చేసి ఇవ్వాలని మంత్రి కన్సల్టెంట్లను ఆదేశించారు. విదేశీ పర్యటన నుంచి సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి వచ్చిన అనంతరం హ్యామ్ రోడ్లపై సమీక్ష నిర్వహించి, రోడ్ల అభివృద్ధికి క్యాబినెట్ ఆమోదం తీసుకున్న తర్వాత పనులను ప్రారంభిస్తామన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తరభాగం రహదారి కోసం భూమిలిచ్చిన రైతులకు నష్టపరిహారం చెల్లించే ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులకు సూచించారు. జాతీయ రహదారి ప్రణాళిక-2025-26కు ప్రతిపాదనలను త్వరగా సిద్ధం చేయాలన్నారు. గుంతలు లేని, సురక్షిత రహదారులను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి చెప్పారు.

బీబీనగర్ ఎయిమ్స్‌లో ఎల్లో ఫీవర్ టీకా సేవలు

బీబీనగర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థలో ఎల్లో ఫీవర్ టీకా సేవలు అందుబాటులోకి వచ్చాయి. సంస్థ డైరెక్టర్ వికాస్ భాటియా ఎల్లోఫీవర్ టీకా సేవలను ప్రారంభించి మాట్లాడారు. ఎల్లో ఫీవర్ టీకా ఒక్క డోస్‌తో జీవితాంతం రక్షణ ఇస్తుందని, వ్యాధి వ్యాప్తి చెందకుండా నిరోధిస్తుందన్నారు. ఎయిమ్స్‌లో ప్రతి సోమవారం ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య ఈ టీకా అందిస్తామన్నారు. టీకా వేయించుకున్నవారికి ఎల్లో కార్డ్ (ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ ఆఫ్ వ్యాక్సినేషన్, ప్రొఫిలాక్సిక్) అందజేస్తామని, ఎల్లో ఫీవర్ ప్రభావిత దేశాలకు ప్రయాణాలు చేసే వారికి ఈ డాక్యుమెంట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ టీకాను రూ.300కు మాత్రమే అందుబాటులో ఉంచినట్లు ఆయన వెల్లడించారు.

ఆర్ అండ్ బీ ఈఎన్సీ అడ్మిన్‌గా తొలిసారి మహిళ!

» బాధ్యతలు స్వీకరించిన ఎస్.తిరుమల..


ఎస్.తిరుమల

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) అడ్మిన్‌గా తొలిసారి ఓ మహిళా అధికారి నియామకమయ్యారు. ఎస్.తిరుమలను ప్రభుత్వం నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేయగా.. తాజాగా ఆమె బాధ్యతలు చేపట్టారు. అయితే శాఖలో సర్వీస్ రూల్స్ ఇంకా తేలకపోవడంతో తిరుమల ఇన్‌చార్జ్ ఈఎన్సీగానే బాధ్యతలు పర్యవేక్షించనున్నట్లు తెలిసింది. కాగా, శాఖ బలోపేతానికి, ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించి ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈఎన్సీ తిరుమల 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

ఎవరా ఎస్ఈ? ఏమిటా ప్రాజెక్టు?

» 'ఆంధ్రజ్యోతి' కథనంపై చర్చ

ఓ కీలక శాఖలో పూర్తి అదనపు బాధ్యతల్లో సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా పనిచేస్తున్న అధికారిని రిటైరయ్యాక కూడా కొనసాగించాలంటూ సంబంధిత శాఖ మంత్రి సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన విషయమై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం సచివాలయంతో పాటు సంబంధిత అధికారి శాఖలోనూ తీవ్ర చర్చనీయాంశమైంది. ఏప్రిల్ 30న సదరు అధికారి పదవీ విరమణ పొందనున్నారని, సర్కారు సూపర్ గేమ్ చేంజర్‌గా భావిస్తున్న ప్రాజెక్టుకు ఆయన చాలా అవసరమని.. శాఖలోనే ఆయన్ను కొనసాగించాలంటూ మంత్రి రాసిన లేఖపై.. 'ఆ అధికారిని రిటైరయ్యాక కొనసాగించండి' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సచివాలయంతో పాటు సంబంధిత శాఖలో 'ఎవరా ఎస్ఈ, ఏమిటా సూపర్ గేమ్ చేంజర్ ప్రాజెక్టు' అంటూ చర్చించుకుంటున్నారు.

తెలంగాణకు రండి.. ప్రపంచానికి విస్తరించండి

(మొదటిపేజీ తరువాయి)

ఆహ్వానించారు. సులభతర పారిశ్రామిక విధానం, స్థిరమైన పాలన, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు వంటివి తెలంగాణలో పెట్టుబడులకు ఆకర్షణగా నిలుస్తున్నాయని వివరించారు. జపాన్ పర్యటనలో ఉన్న సీఎం బృందం సోమవారం కిటాక్యూషు నుంచి ఒసాకా నగరానికి చేరుకుంది. అక్కడ జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఒసాకా ఎక్స్‌పో-2025లో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జపాన్ పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో 30వేల ఎకరాల్లో 'ఫ్యూచర్ సిటీ' నిర్మాణం జరుగుతోందని.. ఎకో, ఎనర్జీ, స్మార్ట్ మొబిలిటీ, సర్క్యులర్ ఎకానమీ కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని వారికి సీఎం వివరించారు. అక్కడ జపాన్‌కు చెందిన మారుబెనీ కార్పొరేషన్‌తో కలిసి ఒక పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ చుట్టూ 370 కిలోమీటర్ల పొడవైన రీజనల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్), రేడియల్ రోడ్లు, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్‌ఆర్) మధ్య ఉన్న ప్రాంతంలో ఎలక్ట్రిక్ వాహనాలు, ఎనర్జీ స్టోరేజ్, ఎలక్ట్రానిక్స్ సెమీ కండక్టర్లు, ఏరోస్పేస్ పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందని వివరించారు. అంతర్జాతీయ ఎగుమతుల కోసం సమీప ఓడరేవుతో అనుసంధానిస్తూ డ్రై పోర్ట్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మూసీ నది పునరుజ్జీవంలో భాగంగా నది పొడవునా 55 కిలోమీటర్ల అర్బన్ గ్రీన్ వే అభివృద్ధి చేయనున్నట్టు వివరించారు. ఇక మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తెలంగాణ ఇప్పటికే ఐటీ, బయోటెక్నాలజీ రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించిందని చెప్పారు. ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్ రంగాల్లో పెట్టుబడులకు అనువైన వాతావరణం రాష్ట్రంలో ఉందని వివరించారు.

భారత్ నుంచి తొలిసారిగా పెవిలియన్..

తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించేందుకు ఒసాకా ఎక్స్‌పో-2025లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పెవిలియన్‌ను ఏర్పాటుచేసింది. 150కిపైగా దేశాలు పాల్గొంటున్న ఈ ఎక్స్‌పోలో భారత్ నుంచి ఒక రాష్ట్రం పెవిలియన్ ప్రారంభించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలసి దీనిని ప్రారంభించారు. ఈ పెవిలియన్‌లో తెలంగాణలోని వైవిధ్యమైన సంస్కృతి, పారిశ్రామిక అనుకూల వాతావరణం, సాంప్రదాయ కళలు, పర్యాటక ఆకర్షణలను ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే సందర్శకులకు వివరించేలా.. రాష్ట్ర సాంకేతిక పురోగతి, సాంస్కృతిక వారసత్వం, పర్యాటక సంపదను ప్రతిబింబించేలా ప్రదర్శనలను ఏర్పాటు చేశారు.


ఒసాకా వరల్డ్ ఎక్స్‌పో-2025లో రోబోతో సీఎం రేవంత్

ఒకప్పుడు కాలుష్య కాసారం..
ఇప్పుడు పర్యావరణహిత నగరం!

» కిటాక్యూషు ప్రస్థానం ఆసక్తికరం

» పారిశ్రామిక వ్యర్థాలతో బ్యాక్టీరియా బతకడమే కష్టమైన చోట.. 'ఎకో టౌన్'తో మారిన స్వరూపం

» తాజాగా అక్కడ సీఎం బృందం పర్యటన

» హైదరాబాద్‌లోనూ ఎకో టౌన్!

» అక్కడి ప్రముఖ సంస్థలతో ఒప్పందం



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఏకో టౌన్.. జపాన్‌లోని కిటాక్యూషుకు మరో పేరు. ఒకప్పుడు పారిశ్రామిక కాలుష్యంతో నానాయాతనలు పడ్డ ఈ నగరం.. ఇప్పుడు ప్రపంచ పరిశుభ్ర నగరాల్లో ఒకటిగా నిలిచింది. బ్యాక్టీరియా సైతం బతకలేనటువంటి పరిస్థితి నుంచి పర్యావరణహిత నగరంగా మారడం ఆసక్తి కలిగించే ప్రయాణం. అక్కడి ప్రజలు, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థల ఉమ్మడి ప్రయత్నాలతోపాటు సరైన ప్రణాళిక, లక్ష్యం చేరుకోవాలనే తపన వెరసి.. కాలుష్య భూతం నుంచి విముక్తి పొందింది. జపాన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ బృందం ఆదివారం కిటాక్యూషును సందర్శించి, అక్కడి మేయర్ కజుహిసా టేకుచితో సమావేశమైంది. హైదరాబాద్‌లో ఎకో టౌన్ ఏర్పాటుకు అక్కడి ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది. మూసీ ప్రక్షాళన మాత్రమే కాదు.. మరో పర్యావరణ పరిరక్షణ దిక్సూచిగా మహానగరం నిలిచేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎకో టౌన్ ఒప్పందం ద్వారా ఈ ప్రక్రియలో మొదటి అడుగు వేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

పారిశ్రామిక విప్లవంతో కాలుష్య కాసారంగా

కిటాక్యూషు నగరం.. జపాన్‌లోని క్యుషూ దీవుల్లో ఉంది. జపాన్‌లో పారిశ్రామిక విప్లవం మొదలైందో.. అప్పటి నుంచే అక్కడ కాలుష్యమూ పెరిగింది. 1960 నాటికి అక్కడి గాలి, నీరు, నేల పూర్తిగా కలుషితమయ్యాయి. ఎంతగా అంటే.. కిటాక్యూషు నగరానికి సమీపంలోని డొకాయ్ తీరంలో కనీసం బ్యాక్టీరియా కూడా బతకదనేంతగా! 'సీ ఆఫ్ డెత్'గా ఆ తీరాన్ని పేర్కొనే వారంటే ఎంతగా ఆ జలాలు కలుషితమయ్యాయో అర్థం చేసుకోవచ్చు. అలాంటి పరిస్థితుల్లో అక్కడ రీ సైక్లింగ్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుగా కిటాక్యూషు ఎకో టౌన్‌ను తీర్చిదిద్దారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం పలు రకాలుగా నిధులను అందించడంతోపాటు బాండ్స్ జారీ చేయడం ద్వారా స్థానిక ప్రభుత్వం మద్దతు అందించింది. కిటాక్యూషు ఫ్యూచర్ సిటీలో వ్యర్థాల నుంచి ఇంధనం తయారీ సహా అనేక రీసైక్లింగ్ ప్రాజెక్ట్‌లను భాగం చేసింది. వీటితో పాటు ఆటోమేషన్, రోబోటిక్స్, ఆఫ్ షోర్ విండ్ ఎనర్జీ వంటి ప్రాజెక్టులను చేపట్టింది. అలాగే, పర్యావరణ అనుకూల పద్ధతులను అనుసరించే కంపెనీలకు సర్టిఫికేషన్ అందించడంతో పాటుగా కంపెనీల ప్రయత్నాలను ప్రోత్సహించడానికి కిటాక్యూషు ప్రత్యేకంగా కార్యక్రమాలను చేపట్టింది. ఈ ప్రయత్నాలు సత్ఫలితాలనే అందించాయి. ఒకప్పుడు సీ ఆఫ్ డెత్‌గా గుర్తింపు పొందిన డొకాయ్ తీరంలో ఇప్పుడు 100కుపైగా చేప జాతులు నివసిస్తుండడం గమనార్హం. ఈ విజయంలో కిటాక్యూషు పర్యావరణ సంబంధిత పరిశ్రమ కమిటీ కీలక పాత్ర పోషించింది. గతంలో కిటాక్యూషు ముడి పదార్థాలను తమ ఉక్కు పరిశ్రమ కోసం దిగుమతి చేసుకునేది. కానీ, ఇప్పుడు పర్యావరణ సాంకేతికతను ప్రపంచానికి ఎగుమతి చేస్తోంది. కిటాక్యూషు ఇంటర్నేషనల్ టెక్నికల్ కోఆపరేషన్ అసోసియేషన్ ఇప్పుడు ఆసియా ఖండానికి పర్యావరణ అనుకూల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోంది.

హైదరాబాద్ పరిస్థితి ఇలా...

తోటలు, చెరువులకు ప్రసిద్ధిగాంచిన భాగ్యనగరం కాలగమనంలో కాలుష్య కాసారంగా మారింది. పరిశ్రమల వ్యర్థాలు, ఇళ్ల నుంచి వెలువడే మురుగు చెరువుల్లోకి చేరుతోంది. తాగునీటికి నెలవైన హుస్సేన్‌సాగర్, చేపల పెంపకానికి అనువైన మూసీ.. కలుషితమయ్యాయి. గ్రేటర్‌లోని పలు చెరువుల్లో ప్రస్తుతం జలచరాలకు ఆక్సిజన్ అందని దుస్థితి నెలకొంది. బాగ్‌లు మాయమై బహుళ అంతస్తుల భవనాలతో నగరం కాంక్రీట్ జంగల్‌గా మారింది. దేశ రాజధాని ఢిల్లీని తలపించేలా గాలిలో దుమ్ము, ధూళి కణాల తీవ్రత పెరుగుతోంది. అయినా ఇప్పటికీ దిద్దుబాటు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. బృహత్ ప్రణాళికలు, పర్యావరణ పరిరక్షణ నిబంధనలు కాగితాలకే పరిమితమవుతోన్న వేళ విధ్వంసం యథేచ్ఛగా కొనసాగుతోంది. పరిస్థితి ఇలానే కొనసాగితే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరూ కరువయ్యే పరిస్థితి రానుంది. ఈ నేపథ్యంలో పర్యావరణహితంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు జపాన్‌లో మొదటి అడుగు పడింది.

నేడే ఇంటర్ ఫలితాలు

విద్యార్థుల మొబైల్ ఫోన్లకూ ఫలితాల లింక్

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదల కానున్నాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో ఫలితాలను విడుదల చేయనున్నారు. తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటించనున్నారు. దీంతోపాటు ఈసారి ప్రతీ విద్యార్థి మొబైల్ ఫోన్‌కు కూడా ఫలితాల లింక్ పంపనున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. లింక్‌పై క్లిక్ చేసి హాల్ టికెట్ వివరాలు నమోదు చేసి ఫలితాలు పొందవచ్చునన్నారు. గతంలో ఫలితాల సమయంలో సర్వర్ డౌన్ లాంటి సమస్యలు ఎదురైన అనుభవాల నేపథ్యంలో.. ఈసారి అలాంటి సాంకేతిక సమస్యలు ఎదురవకుండా ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఫలితాల నేపథ్యంలో ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య సోమవారం విద్యార్థుల మొబైల్ ఫోన్లకు సంక్షిప్త సందేశం (ఎస్ఎంఎస్) పంపారు. 'పరీక్షల్లో జయాపజయాలు సహజం. ఫెయిలయ్యారనో, ఆశించిన విధంగా మార్కులు రాలేదనో నిరుత్సాహ పడవద్దు. మరింత శ్రమించండి.. రెట్టింపు పట్టుదలతో పోరాడండి. విజయం మీ బానిస అవుతుంది" అంటూ స్ఫూర్తిదాయక సందేశాన్ని పంపారు. ప్రతి విద్యార్థికీ ప్రత్యేక నైపుణ్యం ఉంటుందని, వారి ప్రతిభను కేవలం మార్కుల ఆధారంగా అంచనా వేయలేమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆసక్తులను గుర్తించి ప్రోత్సహించాలని, వారికి అండగా నిలబడాలని సూచించారు. ఫలితాల అనంతరం మానసిక ఆందోళనతో ఉన్న విద్యార్థులు టెలీ మానస్ టోల్‌ఫ్రీ నంబర్ 1800 891 4416 కు కాల్ చేయవచ్చని అన్నారు. కాగా, మార్చి 5-25 వరకు జరిగిన ఇంటర్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 9,96,971 మంది విద్యార్థులు హాజరయ్యారు.



కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో
కొందరికే కొలువులు

ఉద్యోగాల కల్పనలో గత పాలకుల నిర్లక్ష్యం

ప్రజా ప్రభుత్వంలో ఉపాధి అవకాశాలు

మధిర జాబ్‌మేళాలో డిప్యూటీ సీఎం భట్టి

మధిర టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కొందరికే కొలువులు దక్కాయని, గత పదేళ్ల అధికారంలో ఉన్నవారు యువతకు ఉద్యోగాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేశారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. ఖమ్మం జిల్లా మధిరలో సోమవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం మూడంచెల వ్యూహం అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా మొదటి దశలో ఇప్పటికే 56వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 30వేల ఉద్యోగాల భర్తీకి కసరత్తు చేస్తున్నామని తెలిపారు. రెండో దశలో మల్టీనేషనల్ కంపెనీలకు రాష్ట్రంలో అవసరమైన వనరులు కల్పించి భారీగా పెట్టుబడులను ఆకర్షించి తద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు లభించేలా చేస్తామన్నారు. మూడో దశలో రాజీవ్ యువ వికాసం ద్వారా రూ.9వేల కోట్లతో యువత తమకు నచ్చిన రంగంలో ఉపాధి పొందేందుకు అవకాశాలు కల్పించి, వారికి అవసరమైన శిక్షణ ఇప్పిస్తామన్నారు. జూన్ 2 నుంచి ఈ పథకాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ జాబ్‌మేళా ద్వారా ఉద్యోగాలు పొందిన వారు జీవితంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని భట్టి ఆకాంక్షించారు. జాబ్ మేళాకు 5,287మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా వంద కంపెనీలు 2,235 మందికి నియామక పత్రాలు అందజేశాయి.

ప్రతి ఊరికీ ఓ పరిపాలన అధికారి

మే నుంచి విధుల్లోకి 10,695 మంది.. జూన్ 2 నుంచి గ్రామాలకు తహసీల్దార్ స్థాయి అధికారులు

» భూ సమస్యలపై దరఖాస్తు స్వీకరిస్తారు

» రూపాయి చెల్లించకుండా సమస్యలు పరిష్కరించుకోవచ్చు

» భూమి రిజిస్ట్రేషన్ సమయంలోనే సర్వే మ్యాప్ ఏర్పాటు

» ధరణి పేరుతో బీఆర్ఎస్ భూ కబ్జాలు.. అన్నింటినీ వెలికి తీస్తాం: పొంగులేటి

» భూ పట్టాలు, పాస్ పుస్తకాలు ఇవ్వలేదని సాగర్ ముంపు రైతుల ఆవేదన

» ఆర్నెల్లైనా అవగాహన రాలేదా.. అంటూ ఆర్డీవోపై మంత్రి ఆగ్రహం



దేవరకొండ/ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల భూములను సర్వే చేయడానికి ఆరు వేల మంది సర్వేయర్లను నియమించనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. భూముల సర్వే కోసం లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తామన్నారు. అలాగే ప్రతి ఊరికి ఒక గ్రామ పరిపాలనాధికారి చొప్పున 10,695 మందిని వచ్చే నెల మొదటి వారం నుంచి పంపించనున్నామని వెల్లడించారు. సోమవారం నల్లగొండ జిల్లా చందంపేట, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధరణితో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఆ బాధ్యత రెవెన్యూ అధికారులపైనే ఉందని చెప్పారు. 'భూ భారతి'తో సాగులో ఉన్న ప్రతి రైతుకూ న్యాయం జరుగుతుందన్నారు. గిరిజన ప్రాంతమైన చందంపేట మండలంలో భూ సమస్యలను పరిష్కరించేందుకే కొత్త చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, పైలెట్ మండలంగా ఏర్పాటు చేసి భూసమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జూన్ 2 నుంచి ప్రతి గ్రామానికి తహసీల్దార్ స్థాయి అధికారులు వచ్చి భూ సమస్యలపై దరఖాస్తులు తీసుకుంటారని మంత్రి చెప్పారు. రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రతి మనిషికి ఆధార్ లాగే భూదార్ కార్డు ఇచ్చి ఖాతా నంబరును ఇస్తామని తెలిపారు. గతంలో భూములు అమ్మినా, కొన్నా మ్యాపింగ్ లేదని, ఇకపై రాష్ట్రవ్యాప్తంగా భూవి రిజిస్ట్రేషన్ సమయంలోనే సర్వే మ్యాప్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా చట్టంలో నిబంధన పెట్టామని చెప్పారు. 9.26 లక్షల సాదా బైనామా దరఖాస్తులు ఉన్నాయని, వాటిలో న్యాయమైన వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. గతంలో పట్టాలిచ్చిన డీ లిమిటేషన్ అటవీ భూములను పరిశీలించి, సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇస్తామని చెప్పారు.

ఆరు నెలలైనా అవగాహన రాలేదా?

ఆర్డీవోగా వచ్చి ఆరు నెలలైనా అవగాహన రాలేదా.. అంటూ దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. చందంపేట మండలం కంభాలపల్లి, పొగిళ్ల, తెల్లదేవరపల్లి గ్రామాలకు చెందిన సాగర్ ముంపు భూ నిర్వాసితులు శంకర్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, రమావత్ రత్తి మాట్లాడుతూ..కొన్నేళ్ల క్రితం భూమి పట్టాలు ఇచ్చినా, హక్కులు కల్పించలేదని, పాస్ పుస్తకాలు ఇవ్వలేదని చెప్పారు. ఫలితంగా రైతుబంధు రాలేదని, రుణమాఫీ కాలేదని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వారికి సమాధానం చెప్పాలని మంత్రి ఆర్డీవోని కోరారు. ఆ సమస్యలు తన దృష్టికి రాలేదని, తెలుసుకొని పరిష్కరిస్తానని ఆర్డీవో తెలిపారు. ఆర్డీవోగా ఎంతకాలం నుంచి పనిచేస్తున్నారని మంత్రి ప్రశ్నించగా.. ఆరు నెలలైందని చెప్పారు. 6 నెలలైనా అవగాహన రాలేదా? అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. చందంపేటను పైలెట్ మండలంగా ప్రకటించి, మండలంలో నెలకొన్న భూసమస్యలన్నీ పరిష్కరించాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ కోరారు.

ధరణి పేరుతో బీఆర్ఎస్ భూ కబ్జాలు

గత ప్రభుత్వం ధరణిని అడ్డుపెట్టుకొని రంగారెడ్డి జిల్లాలో వందలాది ఎకరాలను కబ్జా చేసినట్లు వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపించి, ఆ భూములను వెలికి తీస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. కేసీఆర్ కుటుంబంలో నలుగురి కోసమే ధరణి చట్టాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. ఇందుకు భిన్నంగా బడుగు, బలహీన వర్గాల ప్రజలు, రైతుల కోసం తమ ప్రభుత్వం భూ భారతిని తీసుకొచ్చిందని చెప్పారు. పార్ట్-బీలో ఉన్న 18 లక్షల ఎకరాలకు కూడా శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. గతంలో అక్రమంగా పాస్ పుస్తకాలు పొందితే, వాటిని రద్దు చేసే అధికారం ఈ చట్టంలో ఉందని తెలిపారు. చట్టంలో కౌలుదారు కాలాన్ని పొందుపరుస్తున్నామని, వారికి కూడా న్యాయం జరిగేట్లు చూస్తామని అన్నారు. గ్రామాల్లో పేదలకు స్థలాలు ఇవ్వాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కోరగా.. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి చెప్పారు.

ఘోస్ట్ ఫ్యాకల్టీ పద్ధతి మంచిది కాదు

» వైద్య విద్యలో ప్రమాణాలు తగ్గితే ప్రాణాలకే ముప్పు

» నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

» ప్రైవేటు మెడికల్ కాలేజీలకు మంత్రి దామోదర హెచ్చరిక



హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): "ప్రైవేటు వైద్య కళాశాల్లో ఘోస్ట్ ఫ్యాకల్టీ (పేరుకే కాగితాల్లో ఉంటూ విధులు నిర్వహించని అధ్యాపకులు) పద్ధతి మంచిది కాదు. దీని వల్ల వైద్య విద్య ప్రమాణాలు దిగజారుతాయి. వైద్య విద్యలో నాణ్యత ప్రమాణాలు తగ్గితే ప్రజల ప్రాణాలకే ముప్పు. ఈ విషయంలో ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుంది. నాణ్యత ప్రమాణాలు పాటించని కాలేజీల విషయంలో కఠిన చర్యలు తీసుకుంటాం" అని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. సోమవారం ప్రైవేట్ మెడికల్ కాలేజీల యాజమాన్యాలు, డీన్స్, ప్రిన్సిపాళ్లతో సచివాలయంలో మంత్రి సమావేశమయ్యారు. ప్రైవేటు వైద్య కళాశాలల్లో విద్యలో నాణ్యత ప్రమాణాలు, ఎన్ఎంసీ నిబంధనలు, అధ్యాపకులు, హాజరు, ఫీజులు తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'తెలంగాణ డాక్టర్లకు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు ఉంది. ప్రపంచంలోని ఎన్నో ప్రఖ్యాత మెడికల్ ఇనిస్టిట్యూట్లను ఇక్కడ చదివిన వైద్యులు నడిపిస్తున్నారు. ఇక్కడి వైద్య విద్య ప్రమాణాల వల్లే అది సాధ్యమైంది. పీజీ వైద్య విద్యార్థులకు స్టైపెండ్ చెల్లించే విషయంలో కొన్ని కాలేజీలపై ఫిర్యాదులు వస్తున్నాయి. పిల్లలకు కచ్చితంగా స్టైపెండ్ చెల్లించాలి. కాలేజీలకు అనుబంధంగా ఉన్న బోధన ఆస్పత్రుల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. అదనపు ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బంది పెట్టినా, అడ్వాన్స్‌గా ఫీజులు కట్టాలని ఒత్తిడి చేసినా ఉపేక్షించేది లేదు' అని మంత్రి స్పష్టం చేశారు. ఎన్ఎంసీ నిబంధనల విషయంలో కాలేజీలు లేవనెత్తిన సమస్యలను ఎన్ఎంసీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామని హామీనిచ్చారు.

వడదెబ్బ బారినపడితే 108కి సమాచారమివ్వాలి

వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ ఆరోగ్యశాఖ రూపొందించిన పోస్టర్‌ను మెడికల్ కార్పొరేషన్ (టీజీఎంఎస్ఐడీసీ) కార్యాలయంలో మంత్రి ఆవిష్కరించారు. ఎండలు ముదురుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఎవరికైనా వడదెబ్బ తగిలితే వెంటనే సమీప ఆస్పత్రికి బాధితులను తరలించాలని, 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వాలని మంత్రి కోరారు. వడదెబ్బపై అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి బోధన ఆస్పత్రుల వరకూ అన్నింట్లో వడ దెబ్బ బాధితులకు చికిత్స అందించేందుకు వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

జీఎంఆర్ ఏరో అకాడమీలో రక్షణ, అగ్నిమాపక శిక్షణ కేంద్రం

» శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో పునఃప్రారంభం

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని జీఎంఆర్ ఏరో అకాడమీలో రక్షణ, అగ్నిమాపక శిక్షణ కేంద్రాన్ని జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారులు ప్రారంభించారు. ఎయిర్‌క్రాఫ్ట్ రెస్క్యూ, ఫైర్ ఫైటింగ్ శిక్షణ కేంద్రాన్ని పునఃప్రారంభించారు. 2013 నుంచి 2018 వరకు 350 మందికి శిక్షణ అందించిన ఈ కేంద్రంలో మే 14వ తేదీన 9వ బ్యాచ్ ప్రారంభం కానుంది. 24 వారాల పాటు సాగే ఈ శిక్షణలో ఆధునిక ఫైర్ ఫైటింగ్ పరికరాలతో పాటు ప్రాక్టికల్ శిక్షణలో అనుభవం ఉన్న అధ్యాపకులచే బోధన అందిస్తామని అధికారులు తెలిపారు. కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు జీఎంఆర్ ఏఏ నిర్వహిస్తున్న 15కు పైగా భారతీయ విమానాశ్రయాలు, ఇండిగో, ఎయిరిండియా వంటి ప్రముఖ ఎయిర్‌లైన్స్‌లతో భాగస్వామ్య ప్రయోజనాలు పొందుతారని చెప్పారు. ఇక్కడ శిక్షణ పొందినవారిలో 90 శాతం ప్లేస్‌మెంట్ రికార్డు ద్వారా 980 మందికి పైగా ఉద్యోగాలు పొందారని జీఎంఆర్ ఏఏ అధ్యక్షుడు అశోక్ గోపీనాథ్ తెలిపారు.

హైకోర్టు ఆదేశాలతో జరిమానా చెల్లించిన చెన్నమనేని

» ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు 25 లక్షల చెక్కు అందజేత

వేములవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో అక్రమంగా భారత పౌరసత్వం పొందారన్న కేసులో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను వేములవాడ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు చెన్నమనేని రమేష్ బాబు సోమవారం అమలు చేశారు. వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కోర్టు ఖర్చుల రూపంలో రూ.25 లక్షలు చెల్లించారు. రమేష్‌బాబు తప్పుడు పత్రాలతో అధికారులను, కేంద్ర ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించి భారత పౌరసత్వం పొందారని, వాటి ఆధారంగా ఎన్నికల్లో గెలుపొందుతున్నారని పేర్కొంటూ 2009 నుంచి ఆది శ్రీనివాస్ న్యాయ పోరాటం చేస్తున్నారు. దీనిపై గత ఏడాది డిసెంబర్ 9న హైకోర్టు తీర్పు వెలువరిస్తూ రమేష్ భారత పౌరుడు కాదని స్పష్టం చేసింది. భారత పౌరుడు కానప్పటికీ నాలుగు పర్యాయాల పాటు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించడం అధికారులను, కోర్టులను మోసం చేయడమేనని పేర్కొంది. ఆయనకు రూ. 30 లక్షలు జరిమానాగా విధించింది. ఇందులో ఆది శ్రీనివాస్‌కు కోర్టు ఖర్చుల నిమిత్తం రూ.25 లక్షలు చెల్లించాలని, మరో రూ.ఐదు లక్షలు లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలని పేర్కొంది. హైకోర్టు ఆవరణలో చెన్నమనేని తరఫు న్యాయవాదులు ఆది శ్రీనివాస్‌కు రూ.25 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తప్పుడు పత్రాలతో మోసగించినందున చెన్నమనేని రమేష్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డీజీపీని కోరినట్లు తెలిపారు. వేములవాడ ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు

ముగ్గురి ప్రాణంతీసిన అతివేగం..!

» మరో ఇద్దరి పరిస్థితి విషమం..

» దర్గాకు వెళుతూ అనంతలోకాలకు భార్యాభర్తలు

కౌడిపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లల పుట్టు వెంట్రుకలు తీయడానికి బయలుదేరిన భార్యాభర్తలు.. వారి మనుమడు అనంత లోకాలకు తరలిపోయిన ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం రాయిలాపూర్ శివారులో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. హైదరాబాద్‌లోని సురారం వాసి మహ్మద్ అలీ.. తన భార్య అజీమాబేగం, చిన్నకూతురు సంరీన్‌తో కలిసి ఆల్టోకారులో ఆదివారం సాయంత్రం కొల్చారంలోని దర్గాకు బయలుదేరారు. మధ్యలో నర్సాపూర్‌లోని పెద్దకూతురు హీరాం ఇంటికెళ్లారు. హీరాం, ఆమె పిల్లలు మహ్మద్, నీలోఫర్, గౌస్.. కుటుంబ సభ్యులు సనా బేగం, జురేనాలతో కొల్చారం బయలుదేరారు. వీరు బయలుదేరిన కారును ఆదివారం రాత్రి 11.30 గంటలకు రాయిలాపూర్ శివారులో 765-డీ జాతీయరహదారిపై గల వంతెనపై ఎదురుగా వస్తున్న మారుతి స్విఫ్ట్ కారు ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న మహ్మద్ అలీ (50) అక్కడికక్కడే మరణించగా, మిగతా వారికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించగా, గౌస్ (1) మృతి చెందాడు. మిగతా వారిని మెరుగైన చికిత్స కోసం సురారంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అజీమాబేగం (45) మరణించారు. తీవ్రంగా గాయపడిన నీలోఫర్, జురేనా పరిస్థితి విషమంగా మారడంతో చికిత్స కోసం హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. స్విఫ్ట్ కారులో వస్తున్న రాయిలపూర్ వాసి హరీశ్‌రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అతి వేగం వల్లే ప్రమాదం జరిగిందని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

తెలంగాణ పోలీసులకు సైబర్ నేరగాడు బురిడీ

» టాయిలెట్ అని చెప్పి పోలీసుల కళ్లుగప్పి పరారీ

» ఢిల్లీ పోలీసు స్టేషన్‌లో తెలంగాణ పోలీసుల ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ పోలీసులను సైబర్ నేరగాడు బురిడీ కొట్టించాడు. టాయిలెట్‌కు వెళ్తున్నానని చెప్పి పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. దీంతో చేసేదిలేక తెలంగాణ సీసీఎస్ పోలీసులు ఢిల్లీ పోలీసులను ఆశ్రయించారు. అమాయకులను మోసం చేసిన ఉత్తరాదికి చెందిన సైబర్ నేరస్తుల ఆట కట్టించేందుకు సీసీఎస్ సీఐ నరేష్ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన బృందం ఢిల్లీ కేంద్రంగా సైబర్ ముఠాను వేటాడే పనిలో పడింది. ఎట్టకేలకు ముఠాలో కీలకపాత్ర పోషిస్తున్న దినేశ్‌ను ఆదివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఏ నేరస్తుడినైనా అదుపులోకి తీసుకుంటే తొలుత అక్కడి న్యాయస్థానంలో హాజరు పరిచి, ట్రాన్సిట్ రిమాండ్ ద్వారా సొంత రాష్ట్రానికి తరలించాల్సి ఉంటుంది. కానీ పోలీసులు అలా చేయకుండా అరెస్ట్ చేసి తెలంగాణ భవన్‌కు తీసుకువచ్చారు. అయితే, అర్ధరాత్రి సమయంలో టాయిలెట్‌కు వెళ్లాలని చెప్పి, పోలీసుల కళ్లుగప్పి నిందితుడు పరారయ్యాడు. నిందితుడుని అదుపులోకి తీసుకున్న తర్వాత పోలీసులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

కేటీఆర్‌పై కేసులు కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సోమవారం హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై మహదేవ్‌పూర్, ఉట్నూరు పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులను కొట్టివేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కాళేశ్వరం నీటిని వినియోగించడం లేదని ఆరోపిస్తూ కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు గతేడాది జూలైలో మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు వెళ్లారు. అనుమతి లేకుండా మేడిగడ్డ బ్యారేజీ పైకి రావడమే కాకుండా నిషేధిత ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టుపై డ్రోన్ కెమెరా ఎగురవేశారని నీటిపారుదలశాఖ అధికారుల ఫిర్యాదు చేశారు. దాంతో మహదేవ్‌పూర్ పోలీసులు కేటీఆర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకట రమణారెడ్డి, బాల్క సుమన్ తదితరులపై కేసు నమోదు చేశారు. దీనిని కొట్టివేయాలని కోరుతూ దాఖలైన క్వాష్ పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. మేడిగడ్డ ప్రాంతం నిషేధిత జాబితాలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసినప్పటికీ కేంద్రం నుంచి ఎలాంటి నోటిఫికేషన్ వెలువడలేదని, అందువల్ల కేసు చెల్లదని వాదించారు. దీంతో ఏకీభవిస్తూ ధర్మాసనం కేసును కొట్టేసింది. మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టులో రూ.25 వేల కోట్ల కుంభకోణం ఉందని కేటీఆర్ ఆరోపించడంపై కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ ఉట్నూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివిధ వర్గాల మధ్య శతృత్వం, రెచ్చగొట్టడం వంటి సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. జరిగిన విషయానికి ఈ సెక్షన్లకు సంబంధం లేదని పేర్కొన్న ధర్మాసనం కేసును కొట్టేసింది.

రాజాసింగ్‌పై కేసు కూడా..

కోవిడ్ నిబంధనలు ఉల్లంఘించారని పేర్కొంటూ ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, ఎన్‌వీఎస్ ప్రభాకర్ తదితరులపై నమోదైన కేసును హైకోర్టుకొట్టేసింది. కోవిడ్ నిషేధం అమలులో ఉండగా జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద ధర్నా చేశారని ఆరోపిస్తూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు ఎలాంటి ఆధారాలు లేవంటూ హైకోర్టు కేసు కొట్టివేసింది. కాగా, లగచర్లలో భూసేకరణ విచారణ కోసం వెళ్లిన కలెక్టర్, ఇతర అధికారులపై దాడికి పాల్పడ్డ ఘటనలో బొమ్రాస్‌పేట పోలీసులు కొందరు రైతులపై నమోదు చేసిన రెండు అదనపు ఎఫ్ఐఆర్‌లను కొట్టేసింది.

పిల్లలను వాగులో తోసేసి..

తానూ దూకేసిన తల్లి

» మనసు మార్చుకుని పిల్లలను రక్షించే యత్నం

» అప్పటికే మృతి చెందిన ఇద్దరు చిన్నారులు.. తల్లి క్షేమం



మృతదేహాలపై పడి రోధిస్తున్న తల్లి మమత

తూప్రాన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భర్త మృతి చెందడం.. ఆర్థిక ఇబ్బందులు.. కుటుంబ భారం మోయలేని ఓ తల్లి... ఇద్దరు పిల్లలను వాగులో తోసేసి, తానూ దూకేసింది. కానీ చివరి క్షణంలో బతుకుమీద ఆశపుట్టింది. తాను ఒడ్డుకు చేరుతూ, పిల్లలను రక్షించేందుకు ప్రయత్నించింది. అయినా ఫలితం లేక చిన్నారులిద్దరూ నీటమునిగిపోవడంతో గుండెలు బాదుకుంటూ రోదించింది. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ శివారులో సోమవారం ఈ విషాద ఘటన జరిగింది. తూప్రాన్ ఎస్సై శివానందం, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల మేరకు.. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం దంతాన్‌పల్లికి చెందిన వడ్డేపల్లి మమత తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోవడంతో.. చిన్నమ్మ మైసమ్మ వద్ద పెరిగింది. మమతకు కొన్నేళ్ల క్రితం మాసాయిపేటకు చెందిన స్వామితో వివాహంకాగా, పూజ (7), తేజస్విని (5) ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్వామి అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతి చెందడంతో.. మమత పిల్లలతో కలిసి దంతాన్‌పల్లికి వచ్చేసింది. కానీ భర్త మృతి, పిల్లల పోషణ భారం, ఆర్థిక సమస్యలతో ఆవేదనలో పడింది. పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. సోమవారం ఉదయం పిల్లలను తీసుకుని ఇస్లాంపూర్ శివార్లలోని హల్దీవాగు వద్దకు వచ్చింది. పిల్లలను తోసేసి, తానూ దూకింది. అంతలోనే మనసు మార్చుకుని పిల్లలను రక్షించే ప్రయత్నం చేసింది. ఒడ్డుకు చేరుకుని తన చీరను విప్పి పిల్లల వైపు విసిరింది. సాయం కోసం కేకలు వేసింది. కానీ అప్పటికే పిల్లలు నీట మునిగిపోయారు. స్థానికులు దీనిపై పోలీసులకు సమాచారమిచ్చారు. తూప్రాన్ ఎస్సై శివానందం హల్దీవాగులో గాలింపు చర్యలు చేపట్టి పూజ, తేజస్వినిల మృతదేహాలను బయటికి తీశారు. ఈ ఘటనపై ఫిర్యాదు ఏదీ అందలేదని పోలీసులు తెలిపారు. అయితే ఇద్దరు పిల్లలను వాగులో తోసినందుకు తల్లిపై కేసు నమోదు చేసే అవకాశం ఉందని అంటున్నారు.

భర్తను చంపి.. శవాన్ని పూడ్చి..

హైదరాబాద్‌లో ఒక భార్య క్రైమ్ కథాచిత్రమ్.. కొన్నేళ్లుగా భర్తకు దూరంగా ఒంటరి జీవనం

» కలిసి ఉండాలని ఇటీవలే నిర్ణయం



సాయిలు (ఫైల్)



కవిత

హైదర్‌నగర్, పాపన్నపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇరవై ఏళ్లుగా భర్తకు దూరంగా ఉండి, ఇటీవలే అతడితో కలిసి ఉండడం ప్రారంభించిన ఓ మహిళ.. అతడికి కరెంటు షాకిచ్చి, ఊపిరాడకుండా చేసి చంపేసి, అతడి శవాన్ని పూడ్చేసింది! రాజధాని హైదరాబాద్ కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ దారుణం మూడు రోజులు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌జిల్లా పాపన్నపేట్ మండలం పాతలింగాయపల్లికి చెందిన బెయిని సాయిలు(45)కి కవిత(42)తో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమార్తె శ్వేత(17), కుమారుడు బన్ని(14) ఉన్నారు. దంపతుల మధ్య మొదటి నుంచి సఖ్యత లేకపోవడంతో.. సాయిలు తన పిల్లలతో పాతలింగాయపల్లిలోనే నివాసం ఉంటున్నాడు. ఊరిలో ఉండటం ఇష్టంలేని కవిత హైదరాబాద్ వచ్చి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ మిత్రహిల్స్ ప్రాంతంలో తన చెల్లి జ్యోతి, మరిది మల్లేశ్‌తో కలిసి జీవించేది. తనకు ఇష్టమైనప్పుడు ఊరికి వెళ్లి భర్త, పిల్లలతో రెండు మూడు రోజులు గడిపి వచ్చేది. ఇటీవల దగ్గరి బంధువుల అంత్యక్రియలకు వెళ్లినప్పుడు.. వారిద్దరూ కలిసి ఉండాలనే నిర్ణయానికి వచ్చారు. 12వ తేదీన సాయిలు భార్యతో సహా నగరానికి వచ్చాడు. 18వ తేదీన రాత్రి.. సాయిలు, కవిత, జ్యోతి, మల్లేశ్ నలుగురూ కలిసి కల్లు తాగారు. ఆ సమయంలో సాయిలు, కవిత మధ్య గొడవ జరిగింది. ఆ కోపంలో.. చెల్లెలు సాయంతో కవిత తన భర్తకు కరెంట్ షాకిచ్చి చంపేదుకు యత్నించింది. అయినా మృతిచెందకపోవడంతో ఇద్దరూ కలిసి అతడి మెడకు తువ్వాలు చుట్టి ప్రాణాలు తీశారు.

ఆటోలో బయల్దేరి..

అదే రోజు రాత్రి 12గంటల సమయంలో.. కవిత తనకు పరిచయం ఉన్న ఆటోడ్రైవర్‌ను పిలిపించుకుని అందులో శవాన్ని తీసుకెళ్లి, పాత లింగాయపల్లి ఊరి శివారుల్లో మృతదేహాన్ని పూడ్చి పెట్టేందుకు యత్నించింది. కానీ.. "ఎవరికి తెలీకుండా మృతదేహాన్ని ఎందుకు పూడ్చేస్తున్నావు, నేను ఇందుకు సహకరించను." అని ఆటోడ్రైవర్ అనడంతో, తన ఇంటివద్దే తిరిగి దింపాలని ఆమె కోరింది. తిరిగొచ్చాక.. చెల్లి, మరిది సాయంతో భర్త మృతదేహాన్ని మిత్రహిల్స్ పక్కనే ఉన్న నిర్మానుష్య ప్రదేశంలో పాతిపెట్టింది. అనంతరం పాతలింగాయపల్లికి వెళ్లింది. అక్కడ పిల్లలు, సాయిలు కుటుంబసభ్యులు అడిగిన ప్రశ్నలకు పొంతన లేని జవాబులు చెప్పింది. మరోవైపు... సాయిలు మృతదేహాన్ని తరలించిన ఆటో డ్రైవర్ కేపీహెచ్‌బీ ఠాణాకు వెళ్లి కవిత గురించి ఫిర్యాదు చేశాడు. దీంతో వారు సోమవారం జ్యోతి, మల్లేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించడంతో విషయం బయటపడింది. పోలీసులు వెంటనే పాతలింగాయపల్లికి వెళ్లి కవితను అదుపులోకి తీసుకుని విచారించారు. తన భర్తకు ఎయిడ్స్ ఉందని, అనుమానంతో నిత్యం వేధిస్తుండడంతో.. భరించలేక ఈ హత్యకు పాల్పడినట్లు తెలిపిందామె. కాగా సాయిలు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని వాంగ్మూలం ఇచ్చారు. సాయిలుకు ఎటువంటి వ్యాధులూ లేవని స్పష్టం చేశారు. కాగా.. మంగళవారం కూకట్‌పల్లి తహసీల్దార్ సమక్షంలో సాయిలు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేయిస్తామని పోలీసులు తెలిపారు.

తాగి గొడవ చేస్తున్నాడని భర్తను హతమార్చిన భార్య

» కూతురితో కలిసి ఘాతుకం..

పాపన్నపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నిత్యం మద్యం తాగి ఇంట్లో గొడవ చేస్తున్నాడని భర్తను కూతురితో కలిసి ఓ భార్య హతమార్చింది. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నామాపూర్‌లో ఆదివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నామాపూర్‌కు చెందిన గొల్ల జోగయ్య (51) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతను మద్యానికి బానిసగా మారాడు. రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చి గొడవ చేస్తుండేవాడు. దీంతో విసుగు చెందిన భార్య నాగమ్మ ఆదివారం ఇంట్లో చిన్న కూతురితో కలిసి జోగయ్య మెడకు చీరతో ఉరి బిగించి హతమార్చింది. కూతురు అతని కాళ్లు పట్టుకోగా నాగమ్మ గొంతుకు ఉరి బిగించి హత్య చేసింది. కాసేపటి తర్వాత జోగయ్య ఇంటికి వెళ్లిన ఇరుగు పొరుగు వారు అతను చలనం లేకుండా పడి ఉండటాన్ని గమనించి చికిత్స కోసం మెదక్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే జోగయ్య మృతి చెందినట్లు నిర్ధారించి, అతని మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. సోమవారం బంధువులు మార్చురీకి చేరుకుని పరీక్షించగా జోగయ్య మెడకు కమిలిన గాయం కనిపించింది. అనుమానం వచ్చి భార్య నాగమ్మను గ్రామస్థులు, బంధువులు నిలదీయడంతో అసలు విషయం బయటపడింది. జోగయ్య సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మత్తు కోసం ఒకేసారి ఇంజక్షన్, ట్యాబ్లెట్లు

» వికటించి ఓ ఇంటర్ విద్యార్థి మృతి

» ఆస్పత్రిలో అతని ఇద్దరు స్నేహితులు

» హైదరాబాద్ బాలాపూర్‌లో ఘటన

పహాడిషరీఫ్ ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మత్తు కోసం ఇంజక్షన్, ట్యాబ్లెట్లు కలిపి తీసుకొని వికటించడంతో ఓ ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. అతని ఇద్దరు స్నేహితులు చావు బతుకుల మధ్య ఆస్పత్రిలో కొట్టిమిట్టాడుతున్నారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో జరిగింది. బాలాపూర్‌కు చెందిన ఓ 17 ఏళ్ల బాలుడు ఆరాంఘర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన షాబాజ్ (22), కొత్తపేటకు చెందిన మరో 17 ఏళ్ల బాలుడు అతని స్నేహితులు. గత కొంత కాలంగా వీరు మత్తుకు అలవాటుపడ్డారు. వీరు షాహిన్‌నగర్‌కు చెందిన సాహిల్ అనే వ్యక్తి వద్ద మెడికల్ డ్రగ్స్‌ను కొనుగోలు చేసి నిర్మానుష్య ప్రదేశానికి వెళ్లి శరీరంలోకి ఎక్కించుకునేవారు. ఈ నెల 17న ఎప్పటిలాగే ఇంజక్షన్‌ను కొనుగోలు చేసి ఎక్కించుకున్నారు. మత్తు ఎక్కకపోవడంతో ఇంకొద్దిగ ఇంజక్షన్‌తో పాటు, ట్యాబ్లెట్లు తీసుకున్నారు. కాసేపటికి ముగ్గురు స్పృహ తప్పి పడిపోయారు. అటుగా వెళ్తున్న వారు గమనించి వారిని వెంటనే ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఒకరు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో ఇద్దరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వీరికి మత్తు ఇంజక్షన్‌లు విక్రయించిన నిందితుడు సాహిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

అధిక వడ్డీ ఆశ చూపి.. ఉన్నదంతా ఊడ్చేసి..

» ఓం సాయి శ్రీరాం ఫైనాన్స్ సంస్థ ఘరానా మోసం

» 2,500 మందికి.. 200 కోట్లకుపైగా టోపీ

» నిందితులు బయట తిరుగుతున్నా.. పోలీసులు పట్టించుకోవడం లేదు

» సీఎం న్యాయం చేయాలి: బాధితులు

పంజాగుట్ట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): "పైసా పైసా కూడబెట్టుకున్న సొమ్ము.. పాలమూరు ప్రాజెక్టులో భూములు మునిగిపోతే ఇచ్చిన పరిహారం.. ఏదీ వదల్లేదు.. అధిక వడ్డీ వస్తుందని ఆశపెట్టారు.. డబ్బులు డిపాజిట్ చేయించుకుని నిలువునా ముంచారు. రాజకీయ నాయకులతో కలిసి దర్జాగా తిరుగుతున్నారు. పోలీసులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా లాభం లేదు. ఇక మాకు ఆత్మహత్యలే శరణ్యం. సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకోవాలి." అని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ బాధితులు గోడు వెళ్లబోసుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాధితులు ఎల్లమ్మ, దస్తగిరి, నాగమ్మ, వెంకటయ్య, భాగ్యమ్మ, పర్వతాలు తదితరులు మాట్లాడారు. ఇట్యాల సాయిబాబు, అతడి సోదరులు ఇట్యాల ధనుంజయ, బాలేశ్వర్, మరికొందరు కలిసి నాగర్‌కర్నూల్‌లో ఓం సాయి శ్రీరాం ఫైనాన్స్ సంస్థను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆ సంస్థ 2,500 మంది నుంచి రూ.200 కోట్లకుపైగా వసూలు చేసి మోసానికి పాల్పడిందని ఆరోపించారు. దీనిపై పోలీసులు 14 మందిపై కేసు పెట్టి ఐదుగురినే అరెస్టు చేశారని.. నాగం కరుణాకర్ రెడ్డి, నాగం బుచ్చిరెడ్డి, జానకిరామ్‌రెడ్డి, సాయిబాబు కుటుంబ సభ్యులు పరారీలో ఉన్నట్టు చూపారని తెలిపారు. నిజానికి వారంతా బహిరంగంగా ఎమ్మెల్యేలతో కలిసి తిరుగుతున్నారని పేర్కొన్నారు. బాధితుల్లో ఇప్పటికే 105 మందికిపైగా ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి కల్పించుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. బాధితులకు ప్రజాసంఘాల నేతలు విమలక్క, పాశం యాదగిరి సంఘీభావం తెలిపారు.

ఢిల్లీ పోలీసుల ముందు మే 2న హాజరుకండి

» పూజా ఖేడ్కర్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: నకిలీ పత్రాలు సమర్పించి ఉద్యోగం పొందారన్న ఆరోపణలతో ఉద్వాసనకు గురయిన ఐఏఎస్ ప్రొబేషనరీ అధికారిణి పూజా ఖేడ్కర్ కేసుపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. విచారణ నిమిత్తం మే రెండో తేదీన ఢిల్లీ పోలీసుల ఎదుట హాజరు కావాలని ఆమెను ఆదేశించింది. మే 21 వరకు ఆమెపై చర్యలు తీసుకోకూడదని పోలీసులకు సూచించింది. ఈ మేరకు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది.

వడదెబ్బతో 9 మంది మృతి

» భానుడి భగభగ.. మండుతున్న రాష్ట్రం

» కామారెడ్డి జిల్లా బిచ్కుందలో గరిష్ఠంగా 44డిగ్రీల ఉష్ణోగ్రత

» సాయంత్రం.. కొన్ని జిల్లాల్లో వర్షం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



ఆదిలాబాద్‌లో నిర్మానుష్యంగా రోడ్డు

భానుడి భగభగలతో రాష్ట్రం మండిపోతోంది. ఎండల తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 24 గంటల వ్యవధిలోనే వడదెబ్బ తగిలి తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. కామారెడ్డి జిల్లా బిచ్కుందలో సోమవారం అత్యధికంగా 44 డిగ్రీలు, కామారెడ్డి జిల్లాలోని పిట్లం, నిర్మల్, ఆదిలాబాద్‌లో 43.8డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కరీంనగర్ జిల్లాలో 43.4, మంచిర్యాలలో 42.8, సిరిసిల్ల జిల్లాలో 42.2, మెదక్ జిల్లాలో 42.2, ఖమ్మం జిల్లాలో 41.5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఒకవైపు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత భయపెట్టగా.. సాయంత్రం వేళ అకస్మాత్తుగా కురిసిన వర్షాలు బీభత్సం సృష్టించాయి. ఈదురుగాలుల దాటికి పలు ప్రాంతాల్లో ఆస్తి నష్టం సంభవించింది. రానున్న రెండు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, గరిష్ఠంగా 44-45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రెండు, మూడు మినహా అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

వడదెబ్బ మృతులు వీరే..

- నిర్మల్‌లోని కురన్నపేట్‌కు చెందిన నిగులపు శంకర్(45), నిగులపు రాజు(40).. కుల వృత్తిలో భాగంగా ఆదివారం పోచమ్మ ఆలయం వద్ద డప్పు కొట్టేందుకు వెళ్లారు. రోజంతా ఎండలో ఉండడంతో సాయంత్రం ఇంటికి వచ్చాక అస్వస్థతకు లోనయ్యారు. కుటుంబీకులు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా.. సోమవారం ఉదయం మృతి చెందారు.
- ఆదిలాబాద్ జిల్లా బీంపూర్‌లో ఉపాధి పనులకు వెళ్లిన కూలీ చహన్ కేశవ్ (60) వడదెబ్బ తగలడంతో అపస్మారక స్థితికి చేరాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.
- భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఇప్పలపల్లికి చెందిన దూడపాక ప్రభాకర్(48) ఆదివారం పొలం వద్దకు వెళ్లాడు. ఎండల దాటికి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జమ్మికుంటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.
- మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెంలో మహిళా రైతు హనుమాండ్ల ప్రేమలతరెడ్డి (58).. కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం ఆరపోశారు. రెండు రోజులుగా అక్కడే ఉన్న ఆమె.. ఎండల తీవ్రతతో అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి.. ఆమె భర్త వెంకట్రాంరెడ్డిని ఓదార్చారు. ఇది ప్రభుత్వ హత్యేనని ధ్వజమెత్తారు.
- వరంగల్ జిల్లా సంగెం మండలం కాట్రపల్లికి చెందిన గీసగోని శ్రీదేవి (36) ఆదివారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లింది. అక్కడ అస్వస్థతకు గురైన ఆమెను మహిళలు వెంటనే ఇంటికి తీసుకవెళ్లారు. అనంతరం చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. అదే రోజు రాత్రి మృతి చెందింది.
- ఖమ్మం జిల్లా మధిర మండలం నిదానపురానికి చెందిన మేసిపోగు రత్తయ్య(33)మేకలు మేపేందుకు వెళ్లగా.. వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యాడు. రత్తయ్యను కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడు.
- నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని ముక్కిడిగుండం గ్రామానికి చెందిన వృద్ధురాలు లావుడ్య లక్ష్మి ఓ రేకుల షెడ్డులో ఒంటరిగా నివసిస్తోంది. ఎండల తీవ్రతతో వడదెబ్బ తగిలి సోమవారం మధ్యాహ్నం మృతి చెందింది.
- కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం గొల్లపల్లికి చెందిన ఉడిగే ఐలమ్మ(55) వ్యవసాయ పనులకు వెళ్లింది. ఎండ తీవ్రతకు వడదెబ్బ తాకడంతో అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు స్థానికంగా వైద్యం చేయించినా ఫలితం దక్కలేదు. సోమవారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందింది.

ఈదురుగాలుల బీభత్సం

వికారాబాద్ జిల్లాలో సోమవారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈదురుగాలుల దాటికి వికారాబాద్ నుంచి సదాశివపేటకు వెళ్లే మెయిన్ రోడ్డు, దోమ-పాలేపల్లి రోడ్డుపై భారీ వృక్షాలు విరిగి పడ్డాయి. నవాబ్‌పేట మండలం మమ్మదాన్‌పల్లి సమీపంలో భారీ చెట్టు రైల్వే ట్రాక్‌పై పడగా.. రైల్వే అధికారులు అప్రమత్తమై తొలగించారు. శంకర్‌పల్లి మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి హోర్డింగ్ నేలకొరిగింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని మార్కెట్ యార్డులో ధాన్యం తడిసిపోయింది. తిమ్మాపూర్, దౌలాపూర్‌లో మామిడికాయలు నేలరాలాయి. నారాయణపేటలో విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో సరఫరా నిలిచిపోయింది. మార్కెట్ యార్డులో 500బస్తాల ధాన్యం వర్షపునీటిలో కొట్టుకుపోయింది. సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో పిడుగుపాటుకు పత్తి లోడు లారీ దగ్ధమైంది. కరీంనగర్ జిల్లా చింతపల్లిలోని కవిత కాటన్ ఇండస్ట్రీస్ నుంచి 24టన్నుల పత్తిని లోడు చేసుకుని తమిళనాడు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. సుమారుగా రూ.80లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది.

బిల్లుల చెల్లింపుపై సర్కారు దృష్టి

» నేడు, రేపు కొన్నింటిని చెల్లించే యోచన

» ఉద్యోగులు, సర్పంచ్‌లు, చిన్న కాంట్రాక్టర్ల బిల్లులకు తొలి ప్రాధాన్యం

హైదరాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, చిన్న కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు సర్కారు దృష్టి పెట్టింది. మంగళ, బుధవారాల్లో కొన్ని బిల్లులను చెల్లించడానికి ఆర్థిక శాఖ సన్నాహాలు చేసింది. ఈమేరకు ఆర్థిక శాఖ అధికారులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అనుమతి తీసుకున్నట్లు తెలిసింది. ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులతోపాటు సర్పంచ్‌లు, చిన్న కాంట్రాక్టర్లకు తొలి ప్రాధాన్యంలో బిల్లులు చెల్లించాలని నిర్ణయించింది. ఏప్రిల్ నుంచి ప్రతి నెలా రూ.500 కోట్ల మేర బిల్లులను చెల్లిస్తామని డిప్యూటీ సీఎం భట్టి, ఆర్థిక శాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఉద్యోగుల జీపీఎఫ్, టీజీఎల్ఐసీ, గ్రాట్యుటీ, కమ్యూటేషన్, సరెండర్ లీవ్ బిల్లులతోపాటు మెడికల్ రీ-యింబర్స్‌మెంట్ బిల్లులు పెద్ద మొత్తంలో పేరుకుపోయాయి. వీటికి తోడు 9 వేలమందికి పదవీ విరమణానంతర ప్రయోజనాల బిల్లులు చెల్లించాల్సి ఉంది. వీటికే దాదాపు రూ.8వేల కోట్లు అవసరమని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక, చిన్న కాంట్రాక్టర్లు, సర్పంచ్‌ల బిల్లులు మరో రూ.2వేలకోట్ల దాకా ఉంటాయని తెలుస్తోంది. ఈ మేరకు ప్రతి నెలా రూ.500కోట్ల మేర బిల్లులను విడుదల చేస్తూ పోవడం ద్వారా భారం తగ్గించుకోవచ్చన్నది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. ఇందులో భాగంగానే కొన్ని బిల్లులను మంగళ, బుధవారాల్లో చెల్లించేందుకు సిద్ధం చేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.